www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 5-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 308 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: దశమి సా. 5.26 తదుపరి ఏకాదశి; నక్షత్రం: అనూరాధ ఉ. 7.55 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ. 1.26-3.01, దుర్ముహూర్తం: మ.12.52-1.38, మ.3.08-3.53; అమృతఘడియలు: రా.10.54-12.29, రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 6.09 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

రూ. 60 కోట్ల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సస్పెన్షన్

హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ పాత్రపై ఉన్నతాధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పరిధిలో రూ.60 కోట్ల విలువ చేసే భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంపైన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన పత్రికలో వచ్చిన కథనం సంచలనం సృష్టించింది. ఇటు రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, అటు రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ అక్రమంపై ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) నవీన్‌మిత్తల్

మిగతా 13వ పేజీలో...

జయజయహే తెలంగాణ

రాష్ట్ర అధికారిక గీతంగా క్యాబినెట్ ఆమోదం

ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి, రాష్ట్ర చిహ్నంలో మార్పులు


500కే సిలిండర్, ఉచిత విద్యుత్‌కు ఓకే.. వాహన రిజిస్ట్రేషన్‌లో టీఎస్ బదులు టీజీ

కులగణనకు అంగీకారం.. ఏఈవోల భర్తీ.. హైకోర్టుకు 100 ఎకరాల కేటాయింపు

8 నుంచి బడ్జెట్ సమావేశాలు.. గ్రూప్-1కి మరో 160 పోస్టులు కలపడంపై చర్చ

గ్రూప్-2, 3 పోస్టుల భర్తీ.. మెగా డీఎస్సీ నిర్వహణపైనా మంత్రివర్గంలో ప్రస్తావన

ప్రత్యేక రాష్ట్రం సాకారమై పదేళ్లు! ఇప్పటి వరకూ రాష్ట్ర గీతం లేని తెలంగాణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గీతాన్ని ఖరారు చేసింది! జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా ఆమోదించింది! మరికొన్ని సంచలన నిర్ణయాలనూ తీసుకుంది! హామీల అమలు, పోస్టుల భర్తీపైనా అడుగులు ముందుకు వేసింది!!



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ'ను రాష్ట్ర అధికారిక గీతంగా ఎంపిక చేస్తూ రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. అలాగే.. తెలంగాణ తల్లి విగ్రహ రూపం, రాష్ట్ర చిహ్నంలో మార్పు చేయాలని నిర్ణయించింది. ఆదివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశమైంది. రాత్రి 9 గంటల వరకూ సుమారు ఐదుగంటలపాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో.. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల అమలుకు ఆమోదం తెలపడంతోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఫిబ్రవరి 8 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు, గవర్నర్ ప్రసంగానికి ఆమోదం తెలిపింది. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లలో తెలంగాణ రాష్ట్రాన్ని సూచించే 'టీఎస్' అక్షరాలను 'టీజీ'గా మార్చేందుకు క్యాబినెట్ ఓకే చెప్పింది. రాష్ట్రంలో కులగణన జరిపేందుకు, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు, 65 ప్రభుత్వ ఐటీఐ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి పచ్చజెండా ఊపింది. రాష్ట్ర హైకోర్టుకు 100 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతంలో నోటిఫికేషన్ వచ్చిన సంగతి తెలిసిందే. దానికి మరో 160 పోస్టులను జోడించి రీ నోటిఫికేషన్ ఇచ్చే అంశంపై, గ్రూప్ 2, 3 పోస్టుల భర్తీపై కూడా క్యాబినెట్ భేటీలో చర్చ జరిగింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి.. వెంటనే ఖాళీల వివరాలను తెప్పించాలని, మెగాడీఎస్సీ నిర్వహణపై కసరత్తు చేయాలని మంత్రిమండలి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రం వస్తే ప్రజలకు గౌరవం

మిగతా 13వ పేజీలో...



కేసీఆర్ పాపాలే.. శాపాలు

తప్పులు మీరు చేసి.. నిందలు మాపై మోపుతారా?

ప్రాజెక్టులు, జలాల పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం చేశారు

60 ఏళ్ల ఉమ్మడి రాష్ట్రంలో కంటే.. గత పదేళ్లలోనే ఎక్కువ నష్టం

పాపాలు చేసి ఉద్యమం చేస్తానంటే ప్రజలు చెప్పుతో కొడతారు

శాసనసభలో చర్చకు రా.. ద్రోహులెవరో తేలిపోతుంది

ప్రాజెక్టులు, జలాలపై 2 రోజులు చర్చిద్దాం.. నిజాలు తేలుద్దాం

శ్వేతపత్రం తెస్తాం.. మైక్ కట్ చేయం.. ఎంతైనా మాట్లాడండి

ప్రాజెక్టుల అప్పగింతకు కేసీఆర్ ఎంపీగా ఉన్నప్పుడే పునాది

జగన్‌తో కుమ్మక్కై తెలంగాణ నీటిని ఏపీకి ధారాదత్తం చేశారు

పోలింగ్ రోజు సాగర్‌ను ఆక్రమించుకుంటే లొంగిపోయారు

ఇప్పుడున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.. జగన్‌ను ఇప్పుడు రమ్మను

వాటాలు తేలేవరకు ప్రాజెక్టులను అప్పగించబోం: సీఎం రేవంత్

ప్రాజెక్టులపై కేసీఆర్ నిర్ణయాలను మారుస్తున్నాం: ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ పదేళ్లలో చేసిన పాపాలే రాష్ట్రానికి శాపాలుగా మారాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టులు, జలాల కేటాయింపుల్లో రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నారని, తద్వారా తెలంగాణ ప్రాంతం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. కేంద్రంతోపాటు పక్క రాష్ట్రమైన ఏపీతో కుమ్మక్కై, తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. తప్పులు మీరు చేసి, నిందలు మాపై వేస్తారా? అంటూ మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లపాటు తెలంగాణకు జరిగిన అన్యాయం కంటే.. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలోనే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. పాపాలు చేసి.. ప్రజా ఉద్యమాలంటే ప్రజలు చెప్పుతో కొడతారని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులు, జలాల

మిగతా 14వ పేజీలో...



హైదరాబాద్ చేరుకున్న బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సంపత్‌కుమార్ తదితరులు

ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు ఔట్.. బిహార్ ఎమ్మెల్యేలు ఇన్

హైదరాబాద్ నుంచి సొంత రాష్ట్రానికి జేఎంఎం కూటమి శాసనసభ్యులు

ఆ వెంటనే నగరానికి బిహార్ ఎమ్మెల్యేలు.. ఇబ్రహీంపట్నంలోని రిసార్టుకు

12న విశ్వాస పరీక్ష.. అప్పటిదాకా ఇక్కడే.. పర్యవేక్షిస్తున్న టీపీసీసీ నేతలు

హైదరాబాద్/ఇబ్రహీంపట్నం/మేడ్చల్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం వచ్చినా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపులకు వేదికగా హైదరాబాద్ నిలుస్తోంది. ఇటీవల ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు హైదరాబాద్ రాగా.. తాజాగా ఆదివారం బిహార్ ఎమ్మెల్యేలు శంషాబాద్ విమానాశ్రయంలో దిగారు. ఝార్ఖండ్‌లో హేమంత్ సోరేన్ రాజీనామా తర్వాత రాజకీయ సంక్షోభం ఏర్పడడంతో ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, జేఎంఎం పార్టీలకు చెందిన 39 మంది ఎమ్మెల్యేలను రెండు ప్రత్యేక విమానాల్లో రెండు రోజుల క్రితం హైదరాబాద్ తరలించిన సంగతి తెలిసిందే. ప్రత్యేక భద్రతా ఏర్పాట్లతో వారిని అక్కడి నుంచి శామీర్‌పేటలోని లియోనియా రిసార్టుకు టీపీసీసీ తరలించింది. ఝార్ఖండ్

మిగతా 2వ పేజీలో...

ఝార్ఖండ్ అసెంబ్లీలో నేడు బలపరీక్ష

జేఎంఎం కూటమికి 46.. బీజేపీ కూటమికి 29 సీట్లు

నెగ్గడానికి కావాల్సినవి 41

హేమంత్ ఓటుకు కోర్టు ఓకే

ఇద్దరు జేఎంఎం ఎమ్మెల్యేల విషయంలో అనుమానాలు

2 నేడు రాంచీ వెళ్లనున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

తెలుగువాళ్లు ఎక్కడున్నా మనవాళ్లే



చిరు, వెంకయ్య సహా పద్మ పురస్కార గ్రహీతల సన్మానంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాజకీయాలకతీతంగా కలిసి పనిచేయాలి

వెంకయ్య నాయుడు రాష్ట్రపతి కావాలి

ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవాళ్లనే ఎంపీలుగా గెలిపించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

రేవంత్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

తెలుగు కళామతల్లికి మూడో కన్ను చిరంజీవి

రాజకీయాల్లో విలువలు ముఖ్యం: వెంకయ్య

గద్దర్ పేరిట అవార్డులు సముచితం: చిరు

పద్మ అవార్డు గ్రహీతలకు సర్కారు సన్మానం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): "తెలుగు వాళ్లు ఎక్కడున్నా మన వాళ్లే. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాల్సి వచ్చినప్పుడు, కాపాడుకోవాల్సి వచ్చినప్పుడు మనమంతా ఏకం కావాలి. రాజకీయాలకు అతీతంగా కలిసి పని చేయాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉండి, అవసరమైతే జాతీయ స్థాయి నాయకులతో మాట్లాడగలిగిన శక్తి, సామర్థ్యాలు ఉన్న నాయకత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో పద్మవిభూషణ్ అవార్డులకు ఎంపికైన

మిగతా 13వ పేజీలో...

పద్మశ్రీలకు రూ.25లక్షలు అందజేత

రూ.25వేల పింఛన్ ఇస్తామని రేవంత్ ప్రకటన



ఎండ ప్రచండమే

ఈసారి వడగాలులు, అధిక ఉష్ణోగ్రతలు.. పసిఫిక్‌లో తీవ్ర దశకు ఎల్‌నినో

ఏప్రిల్ తర్వాత బలహీనం.. 'నైరుతి'పై నిపుణుల భిన్నాభిప్రాయాలు

సెప్టెంబరు నాటికి లానినా అభివృద్ధి

విశాఖపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో తీవ్ర దశకు చేరుకుంది. తూర్పు, మధ్య పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవడంతో శీతాకాలంలోనూ వేడి వాతావరణం కొనసాగుతోంది. ఈ ఏడాది వేసవిలో తొలుత మోస్తరు వేడి, ఆ తరువాత క్రమేపీ తీవ్రమైన ఎండలతో వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పలు మోడళ్లను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాకు వచ్చారు. గతేడాది కంటే మరింత తీవ్రమైన వేసవి చూడబోతున్నామని ఒక నిపుణుడు వ్యాఖ్యానించారు. గతేడాది దేశంలో రికార్డుస్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవడంతోపాటు వడగాలులు వీచాయి. అనంతరం వర్షాకాలం, ఆ తరువాత వచ్చిన శీతాకాలంలో

మిగతా 2వ పేజీలో...

భానుడి సెగలు.. మొదలు!

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పైపైకి

ఖమ్మంలో 36 డిగ్రీలు నమోదు

వనపర్తిలో 35.. పలుచోట్ల 34

2

మేం తిడితే తట్టుకోలేవ్

రేవంత్.. తిట్ల పురాణం బంద్ చెయ్

చీకటి ఉంటేనే వెలుగు విలువ తెలుస్తుంది

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి మన మంచికే

కాంగ్రెస్ నికృష్ట పాలన చూస్తేనే.. కేసీఆర్ గొప్పతనం అర్థమవుతుంది

6 గ్యారెంటీలివ్వకుంటే బొంద పెడతాం

రేవంత్.. నీ జుట్టు మోదీ చేతిలో ఉందా

బడ్జెట్‌లో ఏం ఇవ్వకున్నా మాట్లాడవేం

ఉప్పల్, మల్కాజిగిరి సభల్లో కేటీఆర్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): "ప్రతిపక్షంలో ఏదైనా మాట్లాడొచ్చు.. ముఖ్యమంత్రివి.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకో.. తిట్ల పురాణం బంద్ చేయ్.. మారని పక్షంలో 100 రోజుల తర్వాత మేం తిట్టే తిట్లు తట్టుకోలేవు' అని సీఎం రేవంత్ రెడ్డిని.. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్‌ను తొక్కుతా.. బీఆర్ఎస్‌ను పాతిపెడతా అనే మాటలు రేవంత్ హోదాకు తగవని చెప్పారు. ఆదివారం ఉప్పల్, మల్కాజిగిరి

మిగతా 14వ పేజీలో...

సున్నా కరెంటు బిల్లు

ఆ దిశగా మా ప్రభుత్వం కృషి చేస్తోంది

తాజా బడ్జెట్‌లో భారీ సోలార్ ప్రాజెక్టు

తొలిదశలో కోటి ఇళ్లపై సౌర పలకలు

గువాహటిలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

'కామాఖ్య' ప్రాజెక్టుకు శంకుస్థాపన

జనంలోకి వెళ్లాల్సిందే!

హ్యాట్రిక్ అంటూ ఏమరుపాటు వద్దు

కేంద్ర మంత్రులకు మోదీ హెచ్చరిక!

మన విజయాలు ప్రచారం చేయాలి

మిత్రులను కూడగట్టుకోవాలి

ఇలా చేయకనే 2004లో దెబ్బతిన్నాం

నేతలకు మోదీ-అమిత్‌షా కర్తవ్య బోధ



గువాహటి, ఫిబ్రవరి 4: దేశంలోని కుటుంబాలకు విద్యుత్ బిల్లు సున్నా(జీరో) చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అసోంలోని గువాహటి నగరంలో 11,599 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ఆదివారం ప్రధాని శంకుస్థాపనలు చేశారు. వీటిలో కామాఖ్య మాత ఆలయానికి విచ్చేసే భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే 'మా కామాఖ్య దివ్య పరియోజన(మా కామాఖ్య యాక్సస్ కారిడార్)' ప్రాజెక్టు కూడా ఉంది. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో...

మథురలో ఆ మసీదు.. గుడిని కూల్చి కట్టిందే

కృష్ణుడి ఆలయాన్ని పడగొట్టి ఔరంగజేబు షాహీ ఈద్గా మసీదు కట్టించాడు

ఆర్టీఐ ప్రశ్నకు పురావస్తు శాఖ సమాధానం

ఆధారంగా.. 1920 నాటి బ్రిటిష్ గెజిట్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మథురలో శ్రీకృష్ణ జన్మభూమి ఆలయాన్ని కూల్చివేసి.. ఆ స్థానంలో షాహీ ఈద్గా మసీదును కట్టించాడని భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఆగ్రా విభాగం పేర్కొంది. యూపీలోని మెయిన్‌పురికి చెందిన అజయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించింది. ఆలయం కూల్చిన చోటే మసీదును కట్టినట్టు స్పష్టం చేసింది. 1920లో బ్రిటిష్ సర్కారు ప్రచురించిన రాజపత్రాన్ని ఏఎస్ఐ తన సమాధానంలో ఉటంకించింది. దీనిపై కృష్ణ జన్మభూమి ముక్తి న్యాస్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది

మిగతా 2వ పేజీలో...

బీజేపీలో చేరాలని నాపై ఒత్తిడి చేశారు



- ఎప్పటికీ ఆ పార్టీలోకి వెళ్లను: కేజ్రీవాల్
- ఆప్ మంత్రి అతిశీకి పోలీసు నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీలో చేరాలని తనపై ఒత్తిడి చేశారని, ఆ పార్టీలోకి వెళితే కేసులు లేకుం డా వది లేస్తామని చెప్పారన్నారు. ఆదివారం ఢిల్లీలో ఓ పాఠశాల భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ ఆరోపణలు చేశారు. 'వాళ్లు (బీజేపీ) ఎలాంటి కుట్రలైనా పన్నుతారు. నేను లొంగకుండా గట్టిగా నిలబడ్డాను. బీజేపీలో చేరాలని నన్ను బలవంతం చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. నేను బీజేపీలో చేరే ప్రసక్తే లేదు. వాళ్లు మమ్మల్ని క్షమించాల్సినంత నేరం ఏం చేశాం?' అని కేజ్రీవాల్ అన్నారు. ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.25కోట్లు ఆఫర్ చేసి కొనేందుకు బీజేపీ ప్రయత్నించిందని కేజ్రీవాల్, ఢిల్లీ మంత్రి అతిశీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వీటిని బీజేపీ ఖండించింది. బీజేపీ ఫిర్యాదు మేరకు ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలివ్వాలని, ఆ ఎమ్మెల్యేల పేర్లు చెప్పాలంటూ శనివారం ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కేజ్రీవాల్‌కు నోటీసిచ్చారు. ఆదివారం ఆప్ మంత్రి అతిశీకీ నోటీసులు అందజేశారు. ఢిల్లీలో స్కూళ్లు, ఆస్పత్రులు, క్లినిక్‌లు, రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, అందులో తప్పేముందని కేజ్రీవాల్ ప్రశ్నించారు.

మణిశంకర్ అయ్యర్ కుమార్తెపై ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టారంటూ కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ కుమార్తె సురణ్య అయ్యర్‌పై పోలీసులకు ఫిర్యాదు అందింది. సుప్రీంకోర్టు న్యాయవాది, బీజేపీ నాయకుడు అజయ్ అగర్వాల్ శనివారం ఢిల్లీ సైబర్ క్రైం పోలీసులకు ఈ ఫిర్యాదును అందజేశారు. అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠకు వ్యతిరేకంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ గతనెల 20న పలు పోస్టులు పెట్టారు. 36 నిమిషాల నిడివి వీడియోను పోస్టు చేశారు. ఆ కార్యక్రమానికి వ్యతిరేకంగా 3 రోజులపాటు నిరాహారదీక్ష చేశారు. ఇవి అభ్యంతరకరమైనవంటూ అగర్వాల్ ఫిర్యాదు చేశారు.

సైనిక దుస్తుల అక్రమ విక్రయం.. వ్యక్తి అరెస్ట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి4: యుద్ధ క్షేత్రంలో సైన్యం కోసం ప్రత్యేకంగా రూపొందించిన యూనిఫాంను పోలిన దుస్తులను అక్రమంగా విక్రయిస్తున్న ముఠా కార్యకలాపాలను దక్షిణ కమాండ్ మిలటరీ నిఘా విభాగం, పోలీసులు అడ్డుకున్నారు. మహారాష్ట్రలోని పుణె, అహ్మద్‌నగర్‌లో తనిఖీలు చేపట్టి నాసిక్‌కు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు పెట్టారు. ఎలాంటి అనుమతుల్లేకుండా విక్రయిస్తున్నట్లు అతను తెలిపాడు. అతని నుంచి 40 దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్, ఢిల్లీలోని కొందరు వ్యక్తులకు ఈ ముఠాతో సంబంధం ఉందని అనుమానిస్తున్నారు. వీరంతా బహిరంగ మార్కెట్‌లో పెద్దఎత్తున విక్రయాలకు సిద్ధమవుతున్నట్లు విచారణలో తేలింది. సైన్యం కోసం 2022 జనవరి 15న కొత్త యూనిఫాంను డిజిటల్ ఫార్మాట్‌లో రూపొందించారు.

శ్రీదేవి మృతిపై యూట్యూబ్‌లో తప్పుడు చర్చ

- మహిళపై సీబీఐ చార్జిషీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ప్రముఖ నటి శ్రీదేవి మరణంపై దర్యాప్తు చేశానంటూ చెప్పుకొన్న ఓ మహిళపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. తన దర్యాప్తునకు ఆధారాలంటూ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల పేరున ఫోర్జరీ పత్రాలు సృష్టించినట్టు ఆరోపించింది. ఇన్వెస్టిగేటర్‌నంటూ తనకు తాను చెప్పుకొన్న భువనేశ్వర్‌కు చెందిన మహిళ దీప్తి రాణి పిన్నిటి, ఆమెకు సహకరించిన న్యాయవాది భరత్ సురేష్ కామత్‌పై చార్జిషీట్ దాఖలు చేసినట్టు ఆదివారం సీబీఐవర్గాలు తెలిపాయి. దీనిపై తొలుత ముంబైకి చెందిన న్యాయవాది చాందినీ షా ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. పీఎంవో నుంచి వచ్చిన లేఖ ఆధారంగా సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. బాలీవుడ్ నటులు శ్రీదేవి, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ల మరణంపై సామాజిక మాధ్యమాల్లో జరిగిన చర్చల్లో దీప్తి చురుగ్గా పాల్గొన్నారు. 2018 ఫిబ్రవరిలో శ్రీదేవి దుబాయ్‌లో మరణించగా దీనిపై యూట్యూబ్‌లో జరిగిన చర్చలో ఆమె భాగస్వాములయ్యారు. శ్రీదేవి మరణాన్ని యునైటెడ్ ఎమిరేట్స్, భారత్ ప్రభుత్వాలు కలిసి కప్పిపుచ్చుతున్నాయని, ఇది తన 'దర్యాప్తు'లో తేలిందని చెప్పారు. ఇందుకు ఆధారంగా మోదీ, అమిత్ షా పేరుతో ఉన్న నకిలీ లేఖలను చూపారు.

అమెరికాలో 'కాండిడా ఆరిస్' కలకలం

వాషింగ్టన్, ఫిబ్రవరి 4: అగ్రరాజ్యం అమెరికాను 'కాండిడా ఆరిస్' అనే ప్రాణాంతక ఫంగల్ ఇన్ఫెక్షన్ కలవరపెడుతోంది. వాషింగ్టన్‌లో నెల రోజుల వ్యవధిలోనే నలుగురు వ్యక్తులకు ఈ ఇన్ఫెక్షన్ సోకింది. ఈ అరుదైన ఫంగస్ అత్యంత హానికరమని, దీని బారినపడిన వారిలో మరణాల రేటు అధికంగా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువున్నవారికి ఇది తొందరగా సోకుతుందని, పలు ప్రభావవంతమైన యాంటీ ఫంగల్ ఔషధాలు సైతం దీని చికిత్సలో ప్రభావం చూపలేకపోతున్నాయని చెబుతున్నారు. దీనికి సులభంగా వ్యాప్తిచెందే లక్షణాలు ఉండడంతో.. చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

మెట్రోలో అసభ్యంగా ప్రవర్తిస్తే రూ.10 వేల ఫైన్

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రయాణికులపై లైంగిక వేధింపులను నియంత్రించేందుకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) ప్రత్యేక చర్యలకు సిద్ధమైంది. లైంగిక వేధింపులకు పాల్పడితే రూ.10 వేలు జరిమానా విధించనున్నారు. గతంలో రూ.500 ఉన్న జరిమానా మొత్తాన్ని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. మెట్రోలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న క్రమంలో మహిళా ప్రయాణికులపై వేధింపులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవల ఓ మహిళ పట్ల ఓ వ్యక్తి అనుచితంగా ప్రవర్తించిన అంశం వెలుగులోకి వచ్చింది. దీంతో మెట్రో రైలు, స్టేషన్లలో అనుచితంగా ప్రవర్తించేవారికి తగిన గుణపాఠం చెప్పాలనే ఈ నిర్ణయం తీసుకున్నారు.

జేఈఈ మెయిన్ రెండో సెషన్ దరఖాస్తులు షురూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన జేఈఈ-మెయిన్ రెండో సెషన్ పరీక్షలకు దరఖాస్తు స్వీకరణ ఆదివారం ప్రారంభమైంది. దరఖాస్తు సమర్పణకు మార్చి 2వ తేదీ తుది గడువు. జేఈఈ మెయిన్-2024 రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 4-15 తేదీల్లో జరగనున్నాయి. జేఈఈ-మెయిన్ తొలి సెషన్ పరీక్షలకు విజయవంతంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రెండో సెషన్ పరీక్షను రాయాలనుకుంటే కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. సెషన్-1 రిజిస్ట్రేషన్ అప్పటి లాగిన్ వివరాలతో దరఖాస్తు పూర్తి చేయాలి. సెషన్-1 పరీక్షలకు దరఖాస్తు చేసుకోని వారు రెండో సెషన్ పరీక్ష రాయాలనుకుంటే తొలుత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి దరఖాస్తు రుసుము చెల్లించాలి.

రాష్ట్ర హోదా కోసం లద్దాఖ్ వాసుల భారీ ర్యాలీ

లేహ్, ఫిబ్రవరి 4: భారీగా కురిసిన మంచుతో గడ్డకట్టిన లేహ్ నగరం వీధుల్లో కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ వాసులు ఆదివారం ఆందోళన చేశారు. మహిళలతో సహా వేలాది మంది పాల్గొన్నారు. తమ ప్రాంతానికి రాష్ట్ర హోదా ఇవ్వాలని, ఈశాన్య రాష్ట్రాలకు మాదిరిగానే రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌ను వర్తింపజేసి తమ భాష, సంస్కృతులను కాపాడాలని, తమ కోసం ప్రత్యేకంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో లద్దాఖ్.. జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలో అంతర్భాగంగా ఉండేది. ఆర్టికల్ 370ని రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చారు. కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చిన తరువాత తమ ప్రాతినిధ్యం తగ్గినట్టు లద్దాఖ్ వాసులు భావిస్తున్నారు. జమ్మూ-కశ్మీర్ రాష్ట్రంగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండేవారు. ఇప్పుడు ప్రజాప్రతినిధులంటూ లేకుండా పోయారని అంటున్నారు.



జనంలోకి వెళ్లాల్సిందే!

హ్యాట్రిక్ ఖాయమంటూ ఏమరుపాటు వద్దు.. రాజకీయ విశ్లేషణలు నమ్మొద్దు

- మంత్రులు, నేతలకు మోదీ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అయోధ్యలో రామాలయ ప్రారంభం.. బాలక్‌రాం ప్రాణప్రతిష్ఠతో లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారీ గెలిచి హ్యాట్రిక్ కొడతామంటూ ఊహాలోకాల్లో విహరించవద్దని బీజేపీ నేతలకు ప్రధాని మోదీ గట్టి హెచ్చరిక చేశారు. అన్నీ చేసేశామని అలసత్వంతో ఉండొద్దని, ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, గత పదేళ్లలో ప్రభుత్వం ఏం చేసిందో ప్రచారం చేయాల్సిందేనని కేంద్ర మంత్రులకు ఇటీవల స్పష్టం చేశారు. టీవీ స్టూడియోల్లో కూర్చుని రాజకీయ విశ్లేషణలు చెప్పేవారి మాటలు విని మోసపోవద్దని.. ఎన్నికల్లో విజయానికి శాయశక్తులా కృషిచేయాలని హితవు పలికారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఇలాగే గెలుపు ఖాయమన్న అతివిశ్వాసంతో ఉన్నామని.. ఆ ఏమరుపాటే దెబ్బతీసిందని గుర్తుచేశారు. ప్రజలు కేంద్రప్రభుత్వానికి సానుకూలంగా ఉన్నారన్న సంతృప్తి తగదని.. విజయం లభించేదాకా అది దక్కనట్లేనని స్పష్టం చేశారు. గెలుపుపై అతిధీమాతో 2004 ఎన్నికల చివరి అంకంలో బీజేపీ నేతలు ఏమీ చేయకుండా చేతులు కట్టుకుని కూర్చున్నారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఎన్డీఏ గెలుపు ఖాయమన్న సర్వేల విశ్లేషణలు, అంచనాలు తారుమారయ్యాయి. కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటైంది. విపక్ష ఇండియా కూటమిలో విభేదాలు, రామాలయ నిర్మాణంతో బీజేపీపై జనంలో అభిమానం తమకు ఓట్లు కురిపిస్తాయని కమలనాథులు కొందరు భావిస్తున్నారు. 'ఈ దఫా 400 సీట్లు గెలుస్తాం (అబ్‌కీ బార్ 400 పార్)' అని ఊరూవాడా తెగ ప్రచారం చేస్తున్నారు. అయితే అదంత తేలిక కాదని మోదీ-కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. నేలకు దిగి లెక్కలు వేస్తున్నారు. ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన జేడీయూ అధినేత నితీశ్‌కుమార్‌ను తిరిగి ఎన్డీఏలోకి తీసుకురావడంలోని ఉద్దేశం అదే.

దక్షిణాదిలో కష్టమే

హిందీ బెల్టులో.. ఈశాన్య భారతంలో బీజేపీకి తిరుగులేకున్నా.. దక్షిణాదిన అంత బలం లేదని మోదీ-షాకు తెలుసు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో సొంతంగా వేళ్లూనుకోవడం తేలిక కాదని, కర్ణాటకలో ఈ దఫా సీట్లు తగ్గవచ్చని, తెలంగాణలోనూ పెద్దగా పెరగవని వారికి అర్థమైంది. అంతేకాదు.. బెంగాల్లో గత ఎన్నికల్లో బీజేపీ 18 ఎంపీ స్థానాలు గెలుచుకున్నా.. ఈ సారి వాటిని తగ్గించేందుకు టీఎంసీ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శాయశక్తులా ప్రయత్నిస్తారనీ తెలుసు. అందుకే 400 స్థానాలంటూ నేలవిడిచి సాము చేయకుండా.. లోక్‌సభలో ఎన్డీఏకి ఇప్పుడున్న 339 సీట్లను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. మోదీ మూడోసారీ గెలుస్తారని ప్రచారం చేయడం కాకుండా.. ప్రజలను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడమే ముఖ్యమని మోదీ-షా పార్టీ శ్రేణులకు స్పష్టం చేస్తున్నారు. రామాలయ నిర్మాణం కూడా మైనారిటీలకు వ్యతిరేకం కాదని చాటుకోవడానికి బీజేపీ ప్రయత్నాలు ప్రారంభించింది.



గువాహటిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మోదీ

నవీన్‌తో మోదీ చెలిమి!

ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒడిసాలో బీజేపీ పాగా వేయలేకపోతోంది. ఈ ఏడాది జరిగే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ పరిస్థితిలో పెద్దగా తేడా ఉండదని ప్రధాని మోదీ-అమిత్‌షా అంచనా వేస్తున్నారు. అందుకే సీఎం నవీన్ పట్నాయక్‌కు స్నేహహస్తం అందిస్తున్నారు. శనివారం రాష్ట్ర పర్యటనకు వెళ్లిన మోదీ సంబల్‌పూర్ ఐఐఎంలో జరిగిన సభలో.. నవీన్‌ను మిత్రుడిగా పేర్కొనడం విశేషం.

న్యాయ్ యాత్రకు పిలవలేదు: అఖిలేశ్

కాంగ్రెస్ తీరుపై సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరోసారి మండిపడ్డారు. రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'కు తమకు ఆహ్వానమే రాలేదని చెప్పారు. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. యూపీలో యాత్ర తాలూకు తుది రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదన్నారు.

'సున్నా' కరెంటు బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ 'గత పదేళ్లుగా దేశంలోని ప్రతి ఇంటికీ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు మేం ఉద్యమించాం. ఇప్పుడు విద్యుత్ బిల్లు సున్నా చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం. ఇళ్ల పైకప్పుపై సౌర విద్యుత్ పలకలు అమర్చే భారీ పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించాం. తొలి దశలో కోటి కుటుంబాలకు ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సాయం చేస్తుంది. ప్రతి పౌరుడి జీవితాన్ని సౌకర్యవంతం చేయడమే మా లక్ష్యం. బడ్జెట్‌లో దీనిపై స్పష్టంగా దృష్టి పెట్టాం. బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11 లక్షల కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా శంకుస్థాపన చేస్తున్న ప్రాజెక్టుల వల్ల అసోంకు ఇతర దక్షిణాసియా దేశాలతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి' అన్నారు. కాగా, అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ తదితరులను ఆహ్వానించినప్పటికీ వారు హాజరుకాకపోవడాన్ని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. 'దురదృష్టవశాత్తూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దీర్ఘకాలం అధికారంలో ఉన్నవారు మన పవిత్ర స్థలాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేకపోయారు. రాజకీయ లబ్ధి కోసం సొంత సంస్కృతి పట్ల సిగ్గుపడే పద్ధతిని వారు అలవాటు చేసుకున్నారు' అని విమర్శించారు. అయోధ్యకు సందర్శకులను అనుమతించడంతో గత 12 రోజుల్లోనే 24 లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారని మోదీ చెప్పారు.

లోకం తీరు



గమనిక

వైఎస్ జగన్ మేనత్త వైఎస్ విమలా రెడ్డి దళితుడిని వివాహం చేసుకున్నారని ఆదివారం నాటి 'కొత్త పలుకు' కాలమ్‌లో ప్రచురితమైంది. కానీ, ఆమె వివాహం చేసుకున్నది రెడ్డి కులస్థుడినే. సమాచార లోపంతోనే ఇది జరిగింది. పొరపాటుకు చింతిస్తున్నాం.

మథురలో ఆ మసీదు.. గుడిని కూల్చి కట్టిందే

(మొదటి పేజీ తరువాయి)

మహేంద్రప్రతాప్ స్పందించారు. పురావస్తు శాఖ తెలిపిన ఈ సమాచారాన్ని.. ఈ కేసులో సాక్ష్యంగా హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు సమర్పిస్తామని పేర్కొన్నారు. మథురలో శ్రీకృష్ణుడు పుట్టిన చోట ఉన్న పురాతన ఆలయాన్ని ఔరంగజేబు కూల్చివేసి.. ఆ స్థానంలో షాహీ ఈద్గా మసీదును నిర్మించాడని, ఆ మసీదును తొలగించి, ఆ స్థలాన్ని తిరిగి తమకు అప్పగించాలని కోరుతూ హిందువులు కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అక్కడ మొత్తం 13.37 ఎకరాల స్థలం వివాదంలో ఉంది. అందులో 10.9 ఎకరాల్లో ఆలయం ఉండగా.. రెండున్నర ఎకరాలపై మసీదుకు హక్కులున్నాయి. ఆ స్థలం కూడా ఆలయానిదేనన్నది హిందువుల వాదన.

బలమున్నా.. భయమే!

చంపయ్ సోరెన్ సర్కారుకు నేడు విశ్వాస పరీక్ష

రాంచీ, హైదరాబాద్, ఫిబ్రవరి 4: రాజకీయ సంక్షోభంతో హైదరాబాద్‌కు చేరుకున్న ఝార్ఖండ్ రాజకీయ క్యాంపు తిరుగుముఖం పట్టింది! చంపయ్ సోరెన్ నేతృత్వంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం సోమవారం ఝార్ఖండ్ అసెంబ్లీలో బలపరీక్షను ఎదుర్కోనుంది. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు రిసార్టులో బస చేసిన దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు ఆదివారం వారి రాష్ట్రానికి చేరుకున్నారు. మొత్తం 81 మంది సభ్యులు ఉండే ఆ రాష్ట్ర అసెంబ్లీలో.. ఝార్ఖండ్ ముక్తి మోర్చా(28), కాంగ్రెస్(16), ఆర్జేడీ(1) కూటమికి 45 సీట్లు ఉన్నాయి. సీపీఐ(ఎంఎల్) ఏకైక ఎమ్మెల్యే ఆ కూటమికి బయటి నుంచి మద్దతిస్తుండగా.. బీజేపీతో కూడిన విపక్ష కూటమికి 29 మంది ఎమ్మెల్యేలున్నారు. బలపరీక్షలో గెలవాలంటే జేఎంఎం కూటమికి 41 ఓట్లు వస్తే సరిపోతుంది. సంఖ్యాపరంగా ఆ కూటమికి బలపరీక్షలో నెగ్గే బలం ఉన్నప్పటికీ.. పరిస్థితి అంత సజావుగా ఏమీ లేదు. సీనియర్ ఎమ్మెల్యే లాబిన్ హెమ్‌బ్రామ్ ఈ బలపరీక్షలో ఓటు వేయడానికి పలు డిమాండ్లను పార్టీ చీఫ్ శిబు సోరెన్ ముందుంచారు. మద్య నిషేధం, అటవీ సంరక్షణకు, నీటి సంరక్షణకు కఠినమైన చట్టాల్లాంటి 2019 ఎన్నికల హామీలను అమలు చేయలేదని ఆయన మండిపడుతున్నారు. ఇక విష్ణుపూర్ ఎమ్మెల్యే చమ్రా లిండా ఇటీవల జేఎంఎం నిర్వహించిన పార్టీ సమావేశానికి రాలేదు. ఆయన అనారోగ్యం బారిన పడినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నప్పటికీ.. ఆయన అసలు ఎవరికీ అందుబాటులో లేనట్టు తెలుస్తోంది. సోమవారం విశ్వాసపరీక్షకు ఆయన గైర్హాజరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్ రిసార్ట్‌కు 40 మంది ఎమ్మెల్యేలు రాగా.. వీరిద్దరినీ కలిపితే 42 మంది. మిగతా నలుగురి సంగతేంటో తెలియదు. జేఎంఎం వర్గాలు మాత్రం.. తమకు 43 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని చెప్తున్నాయి. కాగా.. సోమవారం నాటి పరీక్షలో హేమంత్ సోరెన్ ఓటు వేసేందుకు రాంచీలోని ప్రత్యేక కోర్టు అనుమతిచ్చింది.



రాంచీకి వెళ్లే విమానంలో ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు

ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు ఔట్.. బిహార్ ఎమ్మెల్యేలు ఇన్

(మొదటి పేజీ తరువాయి)

కొత్త సీఎం చంపయ్ సోరెన్.. సోమవారం శాసనసభలో తన బలాన్ని నిరూపించుకోనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు వారు బయలుదేరి వెళ్లారు. తాజాగా బిహార్‌లో నితీశ్‌కుమార్ ఈ నెల 12న విశ్వాస పరీక్షను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముందు జాగ్రత్తగా హైదరాబాద్ తరలించారు. శంషాబాద్ విమానాశ్రయంలో 5.30 గంటలకు ఝార్ఖండ్ ఎమ్మెల్యేలను రాంచీ విమానం ఎక్కించిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు... 6 గంటల దాకా అక్కడే ఉండి పాట్నా నుంచి శంషాబాద్ చేరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రిసీవ్ చేసుకున్నారు. వారందరినీ ఇబ్రహీంపట్నం శివారులోని సిరి నేచర్స్ వ్యాలీ రిసార్టుకు తరలించారు. ఈ నెల 11వరకూ వారు ఈ క్యాంపులోనే ఉండనున్నట్లు తెలిసింది.

రాహుల్‌తో న్యాయ్ యాత్రకు రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఝార్ఖండ్ రాష్ట్రానికి వెళ్లనున్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం రాంచీకి వెళ్లనున్న రేవంత్.. రాహుల్‌తో పాదయాత్రలో పాల్గొంటారు. ఆ రాష్ట్ర కొత్త సీఎం చంపయ్‌ను కలిసి అభినందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు ఆయన తిరుగు ప్రయాణం కానున్నారు.

భారత దౌత్య కార్యాలయంలో.. ఐఎస్ఐ ఏజెంట్ సత్యేంద్ర

- మేరఠ్‌లో అరెస్టు చేసిన యూపీ ఏటీఎస్



లఖ్‌నవూ, ఫిబ్రవరి 4: భారత విదేశాంగ శాఖలో పనిచేస్తూ.. పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్న ఓ భద్రత అధికారిని ఉత్తరప్రదేశ్ యాంటీ-టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితుడిని యూపీలోని హాపుర్ జిల్లా షమాహియుద్దీన్‌పూర్‌కు చెందిన సత్యేంద్ర సివాల్‌గా గుర్తించినట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఏటీఎస్ తెలిపింది. భారత విదేశాంగ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులు, సిబ్బంది పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ తరఫున గూఢచర్యం చేస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెట్టినట్లు తెలిపింది. "ఈ క్రమంలో సత్యేంద్రకు వ్యతిరేకంగా భౌతిక, డిజిటల్ ఆధారాలను సేకరించాం. మేరఠ్‌లోని ఏటీఎస్ కార్యాలయానికి విచారణకు పిలిచాం. అతను తొలుత డొంకతిరుగుడు సమాధానాలిచ్చినా ఆ తర్వాత నేరాన్ని అంగీకరించాడు. ఐఎస్ఐ తరఫున పనిచేస్తున్నట్లు ఒప్పుకొన్నాడు" అని ఆ ప్రకటన స్పష్టం చేస్తోంది. సత్యేంద్ర 2021 నుంచి మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ఇండియా-బేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్(ఐబీఎస్ఏ)గా పనిచేస్తున్నాడు. భారత్-రష్యా మధ్య సంబంధాలకు సంబంధించిన వివరాలతోపాటు ఆర్మీకి చెందిన కీలక రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేసినట్లు ఏటీఎస్ గుర్తించింది. ఐఎస్ఐకు సత్యేంద్ర చేరవేసిన సమాచారం భారత్‌కు భారీ ముప్పుగా పరిణమించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. ఐఎస్ఐ నుంచి సత్యేంద్రకు డబ్బు అందుతున్నట్లు గుర్తించామని పేర్కొంది. కాగా, ఐఎస్ఐ నెట్‌వర్క్‌లో సత్యేంద్ర కీలక వ్యక్తి అని అధికారులు అనుమానిస్తున్నారు. మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో తన హోదాను అడ్డుపెట్టుకుని, కీలక పత్రాలను సంపాదించి, పాక్‌కు చేరవేసినట్లు భావిస్తున్నారు. వీటిల్లో రక్షణ, విదేశాంగ శాఖ నిర్ణయాలు, సైన్యం రోజువారీ కదలికలు వంటి వివరాలున్నట్లు చెబుతున్నారు.

'రామమందిరం' కవరేజీలో బీబీసీ పక్షపాతం

బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ మండిపాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అయోధ్య రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం కవరేజీలో బీబీసీ పక్షపాత ధోరణితో వ్యవహరించిందని బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ మండిపడ్డారు. తాజాగా హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఆయన మాట్లాడుతూ... అయోధ్యలో రామాలయం ప్రారంభం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. అయితే బీబీసీ మాత్రం 'ఇది ఒక మసీదు విధ్వంసం జరిగిన ప్రదేశం' అని తన కవరేజీలో నివేదించిందని ఆరోపించారు. మసీదు కంటే 2వేల సంవత్సరాలకు ముందు అక్కడ దేవాలయం ఉందన్న విషయాన్ని బీబీసీ మర్చిపోయిందన్నారు. మసీదు నిర్మాణం కోసం ముస్లింలకు ఐదెకరాల స్థలం కేటాయించారని చెప్పారు. బీబీసీ నిష్పక్షపాతంగా రిపోర్టింగ్ చేయడంలో వైఫల్యంపై చర్చకు సమయం కేటాయించాలని ఇతర ఎంపీలను బ్లాక్‌మన్ కోరారు.

'ట్రాఫిక్ బెంగ'ళూరు

- దేశంలోనే ట్రాఫిక్ కష్టాల్లో తొలిస్థానం

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ట్రాఫిక్ ఇబ్బందులు అత్యధికంగా ఎదుర్కొనే నగరాల జాబితాలో బెంగళూరు ఆరో స్థానంలో నిలిచింది. అలాగే, మనదేశంలో ట్రాఫిక్ కష్టాలు పరంగా తొలిస్థానంలో బెంగళూరు నిలిచింది. లండన్‌కు చెందిన టామ్‌టామ్ అనే సంస్థ 2023 సంవత్సరంలో అత్యధికంగా ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొన్న నగరాల జాబితాను తాజాగా విడుదల చేసింది. మనదేశంలో బెంగళూరు తర్వాతి స్థానాల్లో పుణె, ఢిల్లీ, ముంబై నగరాలు ఉన్నాయి. ప్రపంచ జాబితాలో తొలి మూడు స్థానాలో లండన్, డబ్లింగ్, టోరంటో నగరాలు ఉన్నాయి. టామ్‌టామ్ సంస్థ ప్రతినిధులు 55 దేశాల్లోని 387 నగరాల్లో అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించారు. కాగా, 2022లో ట్రాఫిక్ కష్టాల పరంగా ప్రపంచంలో రెండోస్థానంలో ఉన్న బెంగళూరు ఇప్పుడు ఆరో స్థానానికి చేరడం గమనార్హం.

పలుచబడ్డ పార్లమెంట్!

ఎన్నికల పర్యటనల్లో పార్టీల పెద్దలు

లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్..

- బోసిపోయి కనిపిస్తున్న ఉభయ సభలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..! తమ ప్రభుత్వాన్ని సమర్థించుకునేందుకు అధికారపక్షం.. ప్రజలకు బడ్జెట్‌లో మొండిచేయి చూపడంపై విపక్షాలు వాగ్వాదాలు.. ఆరోపణలు-ప్రత్యారోపణలు.. సవాళ్లు-ప్రతిసవాళ్లు చేసుకునే సెషన్స్..! కానీ, ఈ సారి అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. అందుక్కారణం.. ఢిల్లీ అధిష్ఠానం పెద్దల మూడ్ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలపై ఉండడమే..! ఓవైపు ప్రధాని మోదీ.. మరోవైపు విపక్ష నేత రాహుల్‌గాంధీ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మిగతా పార్టీల నేతలు, ఎంపీలు కూడా తమ రాష్ట్రాలపై ఫోకస్ చేయడంతో.. పార్లమెంట్ ఉభయ సభల్లో సభ్యులు పెద్దగా కనిపించడం లేదు. పార్లమెంట్ సెషన్స్ పూర్తవ్వగానే ఏ క్షణాన్నైనా భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ రెండు నెలలుగా పలు రాష్ట్రాల్లో పర్యటనలు చేస్తున్నారు. ఆదివారం వరకు ఆయన 11 రాష్ట్రాలను చుట్టివచ్చారు. ఆయా రాష్ట్రాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులను ప్రారంభించారు. శని, ఆదివారాల్లో ఒడిసా, అసోంలలో సుడిగాలి పర్యటన చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోపు.. ఆయన ఈశాన్యంతోపాటు.. పలు రాష్ట్రాల్లో పర్యటించనున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. నిన్నమొన్నటి వరకు మీడియాతో అంటీముట్టనట్లు వ్యవహరించిన ఇక కేంద్ర మంత్రులు సైతం ఇప్పుడు తమంతట తాము ఇంటర్వ్యూలు ఇవ్వడానికి ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఇప్పుడు యాత్రల్లో బిజీగా ఉన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రను ఈశాన్యంలో ప్రారంభించి, ముంబై వరకు కొనసాగించనున్న విషయం తెలిసిందే.

ఎండ ప్రచండమే..

(మొదటి పేజీ తరువాయి)



కూడా ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదయ్యాయి. ప్రస్తుతం ఎల్‌నినో తీవ్రంగా ఉన్నందున దాని ప్రభావంతో వేసవి హాట్‌గా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ తరువాత ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడే క్రమంలో పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా వాతావరణ పరిస్థితులు మారి సెప్టెంబరు నాటికి లానినా పరిస్థితులు నెలకొంటాయని విశ్లేషించారు. ఎల్‌నినో మే, జూన్ నుంచి బలహీనపడి ఈ ఏడాది చివరికల్లా లానినా దశకు చేరుకుంటుందని స్కైమెట్ అంచనా వేసింది. గతం(2015)లో తొలుత ఎల్‌నినో బలపడటంతో తీవ్రమైన వేసవి, పేలవమైన నైరుతి రుతుపవనాలు కొనసాగాయని, అటు పిమ్మట 2016లో బలహీనపడి తటస్థంగా మారాయని స్కైమెట్ గుర్తుచేసింది. అటువంటి పరిస్థితులు ఈ ఏడాది పునరావృతం కానున్నాయని, దీనివల్ల ఈ వేసవి వేడిగా ఉంటుందని, తరువాత వచ్చే నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని, గతేడాది కంటే మంచి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కాగా, ఈ వేసవి తీవ్రంగా ఉంటుందని, అయితే, వచ్చే నైరుతి సీజన్‌లో వర్షాలపై ఇప్పుడే పూర్తిగా చెప్పలేమని ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్ రాజీవన్ వివరించారు. ఈ ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో 60% లానినా పరిస్థితులు ఏర్పడతాయని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్(నోవా) అంచనా వేసింది. అయితే రానున్న సీజన్‌లో ఎండలపై వచ్చే నెలలో పూర్తిస్థాయిలో అంచనా నివేదిక విడుదల చేస్తామని వాతావరణ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రెండు నెలల తరువాత ఎల్‌నినో తీవ్రత తగ్గి తటస్థ పరిస్థితులు నెలకొంటాయన్నారు.

రాష్ట్రంలో భానుడి సెగలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో ఎండల సెగ మొదలైంది. ఏటా ఫిబ్రవరి ఆఖరి వారంలో పెరిగే ఉష్ణోగ్రతలు.. ఈసారి తొలి వారం నుంచే పైపైకి చేరుతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల ప్రారంభమైన మూడ్రోజులకే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు దాటడం గమనార్హం. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం.. శనివారం భద్రాద్రి కొత్తగూడెంలో 36.1, ఖమ్మంలో 36, రంగారెడ్డి జిల్లాలో 35.6 డిగ్రీలుగా రికార్డయింది. ఇక ఆదివారం వనపర్తి జిల్లా వెల్గొండలో 35.1, మెదక్ జిల్లా పాపన్నపేటలో 34.6, సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 34.5, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలో సగటున 34 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 32.1 డిగ్రీలుగా నమోదైంది. ఏజెన్సీతో పాటు పలు ప్రాంతాల్లో రాత్రిళ్లు కూడా సాధారణం కంటే కాస్త ఎక్కువ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నా చలి తీవ్రత కొనసాగుతోంది. రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరగవచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఖమ్మంలో బంగ్లాదేశీయులు!

- 19 ఏళ్ల క్రితం దేశంలోకి అక్రమంగా చొరబాటు
- ఇళ్లు కట్టుకుని, వివాహాలు చేసుకుని జీవనం
- ఆపరేషన్ స్మైల్‌లో వారి పిల్లల గుర్తింపు
- విచారణతో వెలుగులోకి.. నలుగురి అరెస్టు
- కొన్నేళ్ల కిందటే వెళ్లిపోయిన కీలక నిందితురాలు

ఖమ్మం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను గుర్తించేందుకు చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ఖమ్మంలో బంగ్లాదేశీయుల గుట్టు విప్పింది. 19 ఏళ్ల క్రితం భారత్‌లోకి అక్రమంగా వచ్చి కోల్‌కతా, ముంబై, బెంగళూరుల్లో ఉండి చివరకు ఖమ్మం చేరుకున్న నలుగురి బాగోతం బయటపడింది. వీరంతా పెళ్లిళ్లు చేసుకుని పిల్లలను కనడమే కాక.. ఆధార్, పాన్ కార్డులతో పాటు పాస్‌పోర్టులను కూడా పొందడం గమనార్హం. ఈ వివరాలను ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నగరంలో ఇటీవల కూలీ పనులు చేస్తున్న కొందరు పిల్లలను గుర్తించిన అధికారులు వారి తల్లిదండ్రుల వివరాలను కనుక్కునే ప్రయత్నం చేశారు. ఈ విచారణలో.. వారు బంగ్లాదేశ్‌లోని శ్యాంకూర్ యూనియన్ జెనైదా జిల్లా గుర్దహ పోస్ట్, డకాటియా గ్రామం నుంచి భారత్‌లోకి వచ్చినట్టు తేలింది. తొలుత శాగురి ఖాతూన్ అలియాస్ శిల్ప కోల్‌కతాకు వచ్చి అనంతరం ముంబైలో బోడ రాములు అనే వ్యక్తితో సహజీవనం చేసింది. తర్వాత ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చేరుకుని వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగించింది. ఈ క్రమంలో ఆమె సోదరులు మహ్మద్‌నూర్ నబీ, మహ్మద్ సాగర్, షేక్ జమీర్ కూడా భారత్‌లోకి ప్రవేశించి ఖమ్మంలోని ఖాతూన్ ఇంటికి చేరుకున్నారు. వర్తక సంఘం భవనంలో ఎటువంటి డాక్యుమెంట్లు ఇవ్వకుండా, తప్పుడు సమాచారంతో మహ్మద్ నూర్ నబీ తన పేరును షేక్ నూర్ నబీగా, మహ్మద్ సాగర్ తన బావ బోడ రాములును తండ్రిగా, అక్క ఖాతూన్‌ను తల్లిగా, మహ్మద్ జమీర్ తన పేరును షేక్ జమీర్‌గా చూపించి ఆధార్ కార్డులను పొందారు. తర్వాత మహ్మద్ అమినూర్ మండల్ కూడా బంగ్లాదేశ్ నుంచి బెంగళూరు వచ్చి అక్కడ ఆధార్‌కార్డులు పొంది సెంట్రింగ్ పనులు చేశాడు. ఆరేళ్ల క్రితం కోల్‌కతాకు చెందిన మిత్రుడి ద్వారా ఖమ్మం చేరాడు. ఆధార్ కార్డును ఉపయోగించి పాన్, ఇతర గుర్తింపు కార్డులను పొందడమే కాకుండా పాస్‌పోర్టులను కూడా తీసుకున్నారు. మహ్మద్ నూర్ నబీ 2018లో ఖమ్మంలోని సుందరయ్యనగర్‌కు చెందిన దుగ్గిరాల కుమారిని పెళ్లి చేసుకుని ఆమె పేరును షేక్ సోఫియాగా మార్చాడు. శ్రీనివాసనగర్‌లో సొంత ఇల్లు కట్టుకుని సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. మహ్మద్‌సాగర్ సెంట్రింగ్ పనులకు బెంగళూరు వెళ్లి షేక్ రిమను పెళ్లి చేసుకుని ఖమ్మం తీసుకొచ్చాడు. నగరంలో పండ్ల వ్యాపారం చేస్తూ నాయుడుపేటలో ఉంటున్నాడు. షేక్ జమీర్ కోల్‌కతా యువతి మనీషాను వివాహమాడి ఖమ్మంలో స్థిరపడ్డాడు. కాగా, నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. అయితే, ఖాతూన్ కొన్నేళ్ల క్రితమే వెళ్లిపోయిందని, ఆమె గురించి తెలియదని నిందితులు చెప్పడం గమనార్హం.

ఒక్కో స్థానానికి ముగ్గురు నుంచి ఐదుగురు!

- లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై రేపు ప్రదేశ్ ఎన్నికల కమిటీ భేటీ
- ఆశావహుల ప్రాథమిక వడపోత.. పాల్గొననున్న స్ర్కీనింగ్ కమిటీ

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల అభ్యర్థుల ఎంపికకు సంబంధించి టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రదేశ్ ఎన్నికల కమిటీ మంగళవారం గాంధీభవన్‌లో సమావేశం కానుంది. దక్షిణాది రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపిక కోసం హరీశ్ చౌదరి చైర్మన్‌గా.. విశ్వజిత్ కదమ్, జిగ్నేశ్ మేవానీ సభ్యులుగా ఏర్పాటైన స్ర్కీనింగ్ కమిటీ కూడా ఈ భేటీలో పాల్గొననుంది. మొత్తం 17 స్థానాలకు 309 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. నియోజకవర్గాల వారీగా ఆశావహుల ప్రాథమిక వడపోతను భేటీలో చేపట్టనున్నారు. నియోజకవర్గాల వారీగా దరఖాస్తు దారుల జాబితాలను పరిశీలించనున్న కమిటీ సభ్యులు.. ఒక్కో స్థానానికి ముగ్గురు నుంచి ఐదుగురి పేర్లను షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిటీ సభ్యుల అభిప్రాయాలనూ తీసుకోనున్నారు. స్ర్కీనింగ్ కమిటీ చైర్మన్, సభ్యులు వారి అభిప్రాయాలను నమోదు చేసుకుంటారు. ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశం అనంతరం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి తదితర పార్టీ ముఖ్యులతోనూ అదేరోజున స్ర్కీనింగ్ కమిటీ.. విడిగా సమావేశం కానుంది. ఆ తర్వాత ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ.. స్ర్కీనింగ్ నివేదికను పరిశీలించి అభ్యర్థులను ఖరారు చేయనుంది. ఈనెల మూడో వారం కల్లా అభ్యర్థుల ఎంపికను అధిష్ఠానం పూర్తి చేసే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, రాజ్యసభ ఎన్నికలపైనా ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. ఎన్నికలు జరగనున్న 3 రాజ్యసభ సీట్లకూ పోటీ చేయాలా.. లేక శాసనసభలో సంఖ్యాబలం ఆధారంగా 2 సీట్లకు మాత్రమే అభ్యర్థులను నిలపాలా అన్నది భేటీలో చర్చిస్తారని పార్టీ వర్గాల సమాచారం.

కాంగ్రెస్ పెద్దల జేబులు నింపుతున్నారు

- రాహుల్ యాత్రకు బస్సు పంపిన రేవంత్ : తరుణ్‌చుగ్

భగత్‌నగర్(కరీంనగర్)/మనోహరాబాద్, ఫిబ్రవరి4: తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ జాతీయ నాయకుల జేబులు నింపుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ విమర్శించారు. రాహుల్ యాత్ర కోసం రేవంత్ రూ.కోట్ల విలువైన బస్సును కొనుగోలు చేసి ఇచ్చారని తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ సర్కారు కాంగ్రెస్ జాతీయ నాయకులకు నిధులు సమకూరుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వం పోయి కాంగ్రెస్ అవినీతి సర్కారు వచ్చిందన్నారు. తెలంగాణ సంపదను నాడు బీఆర్ఎస్ దోచుకుంటే నేడు రేవంత్ సర్కారు దోచుకునే పనిలో ఉందన్నారు. కాంగ్రెస్ ఎంపీ సురేశ్ దేశ విభజన వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలనుకున్న కేసీఆర్ అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పారని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మనోహరాబాద్ మండలం దండుపల్లిలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఈటల మాట్లాడారు. గజ్వేల్‌లో తనపై కక్షతో కేసీఆర్ రూ.600 కోట్లు ఖర్చు చేశాడని.. అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఎంతమంది పీకేలు, ఏకేలు వచ్చినా మూడోసారి మోదీ ప్రభుత్వ ఏర్పాటును ఎవరూ ఆపలేరని మాజీ ఎమ్మెల్యే రఘునందన్ అన్నారు. త్వరలో మెదక్ నుంచి అయోధ్యకు రైలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎడారి చెరసాలలో ఆగిన ప్రవాసీ గుండె!

- సౌదీలో గతేడాది నవంబరులో మరణించిన సిద్దిపేట జిల్లా వాసి
- చాలా ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- గడువు ముగిసిన వీసాతో స్వదేశానికి వచ్చేందుకు యత్నించి జైలుపాలు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

ఎడారి దేశంలో మరో ప్రవాస భారతీయుడి గుండె ఆగిపోయింది. వీసా ఉల్లంఘన నేరంపై కటకటాలపాలైన తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి గత ఏడాది నవంబరులో మరణించాడు. కానీ, ఆ విషయం కుటుంబసభ్యులకు ఇటీవల తెలిసింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూరుకు చెందిన చిలుమల కొమరయ్య సౌదీ అరేబియాలో 20 ఏళ్లకు పైగా డ్రైవర్‌గా పని చేశాడు. యజమానితో వచ్చిన విభేదాల వల్ల అతని వీసా రెన్యువల్ కాలేదు. ఉద్యోగం లేకపోవడంతో అనారోగ్యానికి కూడా గురయ్యాడు. అయితే, స్వదేశానికి తిరిగి వెళ్లిపోదామనే ప్రయత్నంలో ఉండగా వీసా తనిఖీల సందర్భంగా పోలీసులకు పట్టుబడి జైలు పాలయ్యాడు. జైలులో ఉన్నప్పుడు కొమరయ్య ఆరోగ్యం మరింత క్షీణించింది. 2023 నవంబరు 10న కొమరయ్య చివరి సారిగా తన భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. తన ఆరోగ్య పరిస్థితిని వివరించాడు. ఆ తర్వాత అతని నుంచి కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. కొమరయ్య ఆచూకీ కోసం అతని భార్య రెండు నెలల పాటు తీవ్రంగా ప్రయత్నించింది. అనారోగ్యానికి గురైన కొమరయ్యను జైలు నుంచి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నవంబరు 11నే మరణించాడని కొద్ది రోజుల క్రితం తెలిసింది. కొమరయ్య తన దగ్గర నుంచి పారిపోయాడని అందువల్ల అతని మృతదేహాన్ని స్వదేశానిక పంపనని యజమాని తేల్చిచెప్పాడు. దీంతో భారత కాన్సులేట్ అధికారులను సంప్రదించిన కొమరయ్య భార్య జరిగిన ఉదంతాన్ని తన నిస్సహాయ స్థితిని వారికి వివరించింది. స్పందించిన కాన్సులేట్ కార్యాలయం కొమరయ్య మృతదేహాన్ని భారత్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మృతదేహాన్ని దేశం నుంచి బయటకు పంపేందుకు కావాల్సిన ఆమోదం కోరుతూ గవర్నర్ వద్దకు ఫైలు పంపామని అధికార వర్గాలు వెల్లడించాయి.

టెక్ 'అన్న'లతో ఆందోళన?

సొంతంగా గ్రనేడ్ లాంచర్ల కర్మాగారాలు.. అడవుల్లో సొంతంగా రాకెట్ల తయారీలు

- ప్రస్తుతానికి వాటి వైఫల్యాలు ఎక్కువే
- వైఫల్యాల రేటు తగ్గితే..

కూంబింగ్ భద్రతా దళాలకు ముప్పే!

చర్ల, ఫిబ్రవరి 4: మావోయిస్టులు అప్‌గ్రేడ్ అవుతున్నారా? టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ.. సొంతంగా ఆయుధాలు తయారు చేస్తున్నారా? ఈ ప్రశ్నలకు ఇటీవలి ఘటనలు ఔననే సమాధానం చెబుతున్నాయి. ఇటీవల సీఆర్పీఎఫ్, డీఆర్జీ పోలీసులు ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో మావోయిస్టుల ఆయుధ కర్మాగారాన్ని ధ్వంసం చేశారు. అక్కడ ఏకంగా బ్యారెల్ గ్రనేడ్ లాంచర్ల(బీజీఎల్)ను మావోయిస్టులు సొంతంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఒడిసాలోనూ ఇదే తరహాలో మావోయిస్టుల రాకెట్ లాంచర్ల కర్మాగారం వెలుగులోకి రావడం గమనార్హం..!

ఫెయిల్యూర్ రేటు ఎక్కువే.. అయినా..!

మావోయిస్టులు సొంతంగా ఆయుధాలను తయారు చేసుకోవడం పాత విషయమే అయినా.. గ్రనేడ్ లాంచర్లు, రాకెట్లను కూడా వారు దేశవాళీ పద్ధతిలో రూపొందిస్తుండడం ఆందోళనకరమని విశ్రాంత పోలీసు అధికారులు చెబుతున్నారు. పామేడు/ధర్మారం సీఆర్పీఎఫ్ క్యాంపులపై దాడి సమయంలో ప్రత్యక్ష సాక్షులు చెప్పిన దాన్ని బట్టి.. 2-3 వేల మంది మావోయిస్టులు రాకెట్ లాంచర్లు, బీజీఎల్స్‌తో దాడులు చేశారు. అయితే.. సింహభాగం గ్రనేడ్లు, రాకెట్లు పేలకుండా మిగిలిపోయాయి. బీజాపూర్-దంతేవాడ సరిహద్దుల్లోని టేకులగూడెం వద్ద ఇటీవల ఇలాంటి ఘటనే చోటుచేసుకోగా.. పోలీసులు పేలకుండా మిగిలిన మావోయిస్టుల రాకెట్లు, గ్రనేడ్లను వందల్లో సీజ్ చేశారు. ఒకవేళ అన్నీ సక్రమంగా పనిచేసి ఉంటే.. ఈ రెండు ఘటనల్లో ప్రాణనష్టం తీవ్రంగా ఉండేదని అభిప్రాయపడుతున్నారు. టేకులగూడెం, ధర్మారం/పామేడు ఘటనల్లో మావోయిస్టులు 80% రాకెట్ లాంచర్లు, జీబీఎల్స్‌ను వాడగా.. 20% మాత్రమే తుపాకులను వినియోగించారు. "మావోయిస్టులు సాంకేతికతను పెంచుకుంటూ.. ఫెయిల్యూర్స్ నుంచి పాఠాలను నేర్చుకుంటే.. సక్సెస్ రేటు పెరిగే ప్రమాదం ఉంది. అదే జరిగితే.. భద్రతాబలగాలకు పెనుముప్పు లాంటిదే" అని విశ్రాంత అదనపు ఎస్పీ భుక్యా రెడ్డన్న 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. భద్రతాబలగాలు ఈ రెండు ఘటనలను ఉదాహరణలుగా తీసుకుని, కూంబింగ్‌లో ముందుకు సాగాలని, శత్రువు బలాన్ని అంచనా వేయకుంటే ఇబ్బందులు తప్పవని అభిప్రాయపడ్డారు.



ధర్మారంలో పేలకుండా మిగిలిన మావోయిస్టుల రాకెట్లను సీజ్ చేసిన పోలీసులు

టన్నెల్స్‌పై విశ్లేషణలేవి?

ఇటీవల ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టులు టన్నెల్స్‌ను నిర్మించుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. అయితే.. ఈ ఘటన నుంచి భద్రతాబలగాలు గుణపాఠాలు నేర్చుకోవడం లేదని రెడ్డన్న ఆవేదన వ్యక్తం చేశారు. "సాధారణంగా మావోయిస్టులు, గెరిల్లా దళాల సభ్యులు ఎత్తైన ప్రాంతాల్లో ఉంటారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చే వారి కదలికలను పసిగట్టేస్తారు. ఇక టన్నెల్స్ అడపాదడపా బయటపడుతున్నా.. వాటిపై విశ్లేషణలు జరగడం లేదు. ఎత్తు ప్రాంతాల్లో ఉండే మావోయిస్టులు.. మైదాన ప్రాంతాల్లో పోలీసుల కళ్లుగప్పేందుకు, అగ్ర నాయకులను తప్పించేందుకు మాత్రమే టన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి టన్నెల్స్ ఉండే ప్రాంతాలపై పోలీసుల సెర్చింగ్ లేకపోవడం గమనార్హం..! శత్రువు వ్యూహం కంటే ఒక అడుగు ముందు ఉండాల్సిన బాధ్యత భద్రతాబలగాలపైనే ఉంటుంది" అని రెడ్డన్న వివరించారు. నిజానికి సీఆర్పీఎఫ్ బలగాల వద్ద అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా..వారికి సరైన శిక్షణ లేకపోవడం వల్లే మావోయిస్టులు పైచేయి సాధించే యత్నాలు మొదలు పెట్టారని అభిప్రాయపడ్డారు.

ఫెయిల్యూర్ రేటు ఇలా..

ఏ దేశ సైన్యం కూడా 100% కచ్చితత్వంతో తమ ఆయుధాలను వాడలేదు. ఉక్రెయిన్‌పై రష్యా వేస్తున్న రాకెట్లలో సక్సెస్ రేటు 60% మాత్రమే. హమాస్‌పై ఇజ్రాయెల్ రాకెట్ దాడుల్లో ఫెయిల్యూర్ రేటు 30శాతమే. 15% ఫెయిల్యూర్ రేటు ఉంటే.. అది మంచి సక్సెస్ రేటు అని అంతర్జాతీయ ప్రమాణాలు చెబుతున్నాయి. ఇప్పుడు మావోయిస్టులు సొంతంగా తయారు చేస్తున్న రాకెట్లు, జీబీఎల్‌లో ఫెయిల్యూర్ రేటు చాలా ఎక్కువే..! అయితే.. వారు క్రమంగా టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసుకుంటే.. భద్రతా బలగాలకు ముప్పు తప్పదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మూడో స్థానమే

- కేటీఆర్ కండకావరమే ఆ పార్టీ కొంప ముంచింది
- హామీలను అమలుచేయని కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేయాలి?
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న బండిసంజయ్, పక్కన డీకే అరుణ, తదితరులు

మహబూబ్‌నగర్, న్యూటౌన్, ఫిబ్రవరి 4: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి మూడో స్థానమే వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. కేటీఆర్ కండకావరమే ఆ పార్టీ కొంప ముంచిందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. ప్రజలు బీఆర్ఎస్‌ను ఇంటికి పంపినా కేటీఆర్‌కు బుద్ధిరాలేదన్నారు. ఇంకా తన తండ్రి కేసీఆరే సీఎం అనుకుంటున్నారని, ఆయనకు అహంకారం తగ్గలేదని మండిపడ్డారు. కేసీఆర్ బండారాన్ని ఆనాడే ఆధారాలతో సహా బీజేపీ బయటపెట్టిందని, కాంగ్రెస్ అప్పుడెందుకు స్పందించలేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఓ మాట, ఎన్నికల తర్వాత ఓ మాట మాట్లాడుతున్నారని.. కేంద్రం లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించాలని రేవంత్ కోరడం వింతగా ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు అధికారంలోకి వచ్చే అవకాశంలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ 10కి పైగా పార్లమెంట్ స్థానాలను గెలవడం ఖాయమని, నరేంద్ర మోదీని మూడోసారి కూడా ప్రధానిని చేయాలని దేశ ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంజీ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూ ధర్మం విశ్వవ్యాప్తం చేసేందుకు పీఠాధిపతులంతా ఏకం కావాలి

- ధార్మిక సదస్సులో స్వామీజీల అనుగ్రహభాషణం

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు దేశంలోని పీఠాధి, మఠాధిపతులందరూ ఏకం కావాలని, దీనికోసం టీటీడీ ముందు వరుసలో ఉంటుందని స్వామీజీలు తెలిపారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో జరుగుతున్న ధార్మిక సదస్సులో రెండో రోజైన ఆదివారం ఉదయం 17 మంది స్వామీజీలు నేరుగా, మరో 16 మంది వర్చువల్‌గా పాల్గొన్నారు. రవిశంకర్ గురూజీ వర్చువల్‌గా మాట్లాడుతూ.. యువతను ధర్మంవైపు నడిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ధర్మ పరిరక్షణలో యువత ప్రాధాన్యం ఎంతో ఉందన్నారు. పట్టణాలు, మారుమూల ప్రాంతాల్లో జానపద గీతాలు, యక్షగానం, భజనలు, కీర్తనల ద్వారా విస్తృతంగా ధర్మప్రచారం జరిగేలా టీటీడీ చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నమయ్య కీర్తనలు, భక్తి గీతాలాపన ద్వారా నాస్తికులు.. ఆస్తికులుగా మారడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ.. ఉత్తరదేశంలోని ప్రాచీన ఆలయాల్లో కూడా ధార్మిక ప్రచారం జరగాలన్నారు. ఉత్తరాదిమఠాధిపతి మాట్లాడుతూ.. వేదపరిరక్షణ చేస్తే ధర్మ పరిరక్షణ జరుగుతుందన్నారు. అహోబిలంమఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ మాట్లాడుతూ.. వేదాల్లో పేర్కొన్న విషయాలను పరిచయం చేయాలన్నారు. శ్రీవారు ధర్మస్థాపన కోసమే తిరుమలలో వెలిశారని దత్తపీఠాధిపతి విజయదత్తానంద స్వామీజీ అన్నారు. దేశవ్యాప్తంగా ఐదు కోట్ల గీతా పుస్తక ప్రసాద పంపిణీ జరగాలన్నారు. సనాతన ధర్మానికి హాని కలిగించడం అంటే తమకు తాము హాని చేసుకున్నట్టే అని శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ తీర్థస్వామీజీ అన్నారు. సనాతన ధర్మాన్ని ఆచరించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ఇతర మతాలకు చెందిన వారిని స్వాగతిస్తున్నామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు.

గిరిజనులు, యువతకు అండగా ఉంటాం: రాహుల్

- 'మోదానీ-కరణ' వల్లే దేశంలో 'ఉద్యోగాల కరువు': జైరాం

ధన్‌బాద్, ఫిబ్రవరి 4: గిరిజనుల 'జల్-జంగిల్-జమీన్' (నీరు-అడవి-భూమి)కి అండగా ఉంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా ఆదివారం ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌లో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయకుండా కాపాడడం, దేశ యువతకు, గిరిజనులకు న్యాయం జరిగేలా చూడడమే తన యాత్ర ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆర్థిక అసమానతలు, నోట్ల రద్దు, జీఎస్టీ, నిరుద్యోగిత దేశ యువత భవిష్యత్తును నాశనం చేశాయన్నారు. రాహుల్ శనివారం రాత్రి ధన్‌బాద్ జిల్లా టుండీలో బస చేశారు. ఆదివారం ధన్‌బాద్ నగరంలోని గోవింద్‌పూర్ నుంచి తన యాత్ర కొనసాగించారు. మధ్యాహ్నం భోజన విరామం కోసం బొకారో స్టీల్ సిటీలో ఆగారు. కాగా, నిరుద్యోగ సమస్యపై మోదీ సర్కారును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. 'మోదానీ-కరణ' వల్లే దేశంలో 'ఉద్యోగాల కరువు' ఏర్పడిందని జైరాం రమేశ్ 'ఎక్స్'లో మండిపడ్డారు. మోదీ సృష్టించిన ఈ ఉద్యోగాల కరువు గత పదేళ్ల 'అన్యాయ కాలా'నికి పరాకాష్ఠ అని వ్యాఖ్యానించారు. దేశంలో నిరుద్యోగ సమస్యపై తాజా నివేదికను ఆయన ప్రస్తావించారు.

రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లో బేకరీపై ఉక్రెయిన్ దాడి!

- ఒక చిన్నారి సహా 28 మంది మృతి

మాస్కో, ఫిబ్రవరి 4: రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లోని లిసిచాన్స్క్ ప్రాంతంలో ఓ బేకరీపై బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో ఓ చిన్నారి సహా 28 మంది మృత్యువాత పడ్డారని రష్యా అధికారులు వెల్లడించారు. భవనాల శిథిలాల కింద చిక్కుకున్న మరో 10 మందిని రక్షించి, ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఉక్రెయినే ఈ దాడికి పాల్పడిందని రష్యా ఆరోపించింది. అయితే, దీనిపై ఉక్రెయిన్ స్పందించ లేదు. కాగా, మొదలయి రెండేళ్లు గడుస్తున్నా రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడడం లేదు.

ముగ్గురు రోహింగ్యాలపై ఎన్ఐఏ ఛార్జిషీటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో అక్రమంగా ప్రవేశించారన్న ఆరోపణలతో మయన్మార్‌కు చెందిన ముగ్గురు రోహింగ్యాలపై ఎన్ఐఏ ఛార్జిషీటు దాఖలు చేసింది. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులుగా గుండా అక్రమంగా ప్రవేశించడంతో పాటు, పెళ్లి ఆశ చూపి అక్కడి మహిళలను కూడా తీసుకుస్తున్నారని ఆరోపించింది. చొరబాట్లకు సహకరిస్తున్నారని పేర్కొంది. అక్రమ మార్గాల్లో ఆధార్ కార్డులు పొంది వాటి ఆధారంగా బ్యాంకు ఖాతాలు తెరవడంతో పాటు సిమ్ కార్డులు కూడా పొందారని తెలిపింది.

వివిధ

బొమ్మలు: అక్బర్



నగరంలో

ఏ సందులో చూసినా ఊపిరాడని బత్కులే
ఏ ఖాళీ దేహాలను కదిలించినా గాయాల బరువులే
కొన్ని ఆకలికడుపులు పొట్టకుట్టుకోడానికి
పట్నం తోవకు దారులడుగుతున్నాయి!

పేదరికం మోస్తున్న ఈ దుఃఖపుగంపలను
యాడ దించాలో తెల్వక
ఈ నాల్గురోడ్ల తోవలో నిలబడ్డాయి!

కొన్ని చిన్గిపోయిన బత్కులకు
బట్టలు కూడా తోడులేవు
కొన్ని అనాథ శిల్పాలు గాలిపలక మీద
ఆకలిలిపి రాస్తూ నన్ను చూస్తూ నవ్వుకుంటున్నాయి!

చనుబాలు దొర్కని పసిపిల్లలు
అమ్మ భుజాలకు శిలువేయబడ్డారు
దారులు అడగకుండా సాగే వాళ్ళ ప్రయాణం
బహుదూరమని మనకెప్పుడు తెలుస్తుంది!

అర్ధరాత్రి దాక సిన్మ చూసి
ఇసుక బొడ్య మీద నిద్రరాక
బీడి మీద సూర్యున్ని ముట్టించి
పిల్లల భవిష్యత్తును కలగంటున్నాడొకడు!

రోడ్డుకు ఎడమవైపు, కుడివైపు
కొన్ని దేహపుతోటలకు పూసిన
బరువైన ఈ దుఃఖపుగంపలను
ఎవరైనా దించుకుంటారని
ఇంకొందరు దీనంగా ఎదురుచూస్తున్నారు!

చెత్తకుండీ పక్కకు విసిరేయ్యబడ్డ
ఊపిరున్న ఈ చిన్గిన బట్టలను
ఎవరు తొడుక్కుంటారు!
అక్షరాలు తప్ప!

చిగురాల్‌పల్లి ప్రసాద్
80742 72531

యువ నాటిక రచనల పోటీలు

తెలుగు రంగస్థలంపై యువత ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఈ నాటిక పోటీలకు లబ్ధప్రతిష్ఠులైన నాటక రచయితలతోపాటు ఔత్సాహిక రచయితలను, ప్రత్యేకించి రచనాసక్తి ఉన్న విద్యార్థి రచయితలను రచనలు చేయాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.7,500, రూ.5వేలు, రూ.2500. ప్రదర్శనా కాల పరిమితి 25 నుంచి 30 నిమిషాల మధ్య ఉండేలా సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యారంగ విధానాల వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకొని రాయాలి. రచనలో ఎక్కువ యువ పాత్రలు ఉండాలి. నాటిక ప్రతిపై నాటిక పేరు మాత్రమే ఉండాలి. రచన మూడు ప్రతులను ఫిబ్రవరి 29లోగా చిరునామా: కందిమళ్ల సాంబశివరావు, 3-391, పండరీపురం, 9వ లైను, చిలకలూరిపేట - 522616, పల్నాడు జిల్లా. ఫోన్: 98483 51517.

సగ్రాజు బాలచందర్

ఉగాది కవితల పోటీ

శ్రీకార్తీక డెవలపర్స్ సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది కవితల పోటీకి ఏ అంశంపైన అయినా 20 పంక్తులకు తక్కువ కాకుండా 30 పంక్తులు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా: రూ.2500, రూ.2000, రూ.1500. రెండు ప్రత్యేక బహుమతులు: ఒక్కొక్కటి రూ.1000. కవితలు ఫిబ్రవరి 29 లోగా చిరునామా: ఎడిటర్, సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్ - 500102. ఫోన్: 94907 51681.

సాహితీకిరణం



పదిహేనేళ్ళ ప్రరవే

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఏర్పడి పదిహేనేళ్ళు. 2024 ఫిబ్రవరి 10, 11 తేదీలలో 'స్త్రీలపై ట్రోలింగ్' అంశంగా ఖమ్మంలో ఏడవ మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సమాజ చలనంలో ప్రరవే నిర్వహించిన పాత్రని మదింపు వేసుకోవడానికి మిత్రసంస్థల ప్రతినిధుల నుంచి కొన్ని అభిప్రాయాలూ సూచనలు తీసుకున్నాము.

కె. ఎన్. మల్లీశ్వరి
జాతీయ కార్యదర్శి ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

చురుకుగా పని చేస్తున్న సంస్థ



ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఇప్పుడు చాలా చురుకుగా పనిచేస్తున్న సంస్థ. నిర్మాణాత్మకమైన ప్రణాళిక, ఆచరణలతో ముందుకు నడుస్తున్నది. ప్రరవే జిజ్ఞాసతో కలిసి ప్రజ్ఞ పేరుతో కొన్ని నెలల తరబడి స్త్రీవాద సాహిత్య విమర్శ మీద నిర్వహించిన అంతర్జాల కార్యక్రమాలు చారిత్రాత్మకమైనవి. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అనారోగ్యకర ట్రోలింగులు వస్తువుగా ఖమ్మం మహాసభలు సదస్సు జరపడం, పుస్తకం తీసుకు రావడం సమయోచితంగా ఉంది. ఈ సభ మాధ్యమాలను దుర్వినియోగం చేసేవారికి కనువిప్పు కావాలని ఆకాంక్షిస్తున్నాను. మహిళలను ఎవరు ఏ రూపంలోనైనా అవమానిస్తున్నంత కాలం, ఇతర రంగాలలో ఎన్ని విజయాలు సాధించినా, వెనకబడి ఉన్నట్లే. ఈ మహాసభలు ఆ మానసిక దుర్బలులను మార్చగలవని ఆశిస్తున్నాను.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
అభ్యుదయ రచయితల సంఘం

సంస్థల నిర్వహణ ఒక సృజన కలాపం



రచయిత్రులు ఒక వేదికగా ఏర్పడి ఇన్నేళ్లుగా కొనసాగుతున్నారంటే ప్రరవే నిర్దేశించుకున్న ప్రజాస్వామ్యం పట్ల వాళ్లందరూ ఏకాభిప్రాయం సాధించినట్లే. ఇది ఆ వేదిక విజయమే కాదు. మన సాంస్కృతిక వికాసంలో ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా భావించవచ్చు. ప్రరవే ఈ పదిహేనేళ్లలో సమాజ సాహిత్యాలకు నేర్పిస్తూ, తాను నేర్చుకుంటూ సాధించిన పరిణతికి కూడా ఇది నిదర్శనం. ఇందులోని రచయిత్రులు తమ రచనలతో, ఆచరణతో తమ వ్యక్తిత్వాన్నేగాక ప్రరవే వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్ది ఉంటారు. అందువల్ల స్త్రీల భాగస్వామ్యంతో, నాయకత్వంతో నడుస్తున్న ప్రరవే అరుదైన ఉదాహరణని ఆశించవచ్చు. సంస్థలను నిర్మించి, కొనసాగించడంలోని ఒత్తిళ్ల, వ్యథలు, అనివార్యతలు మనుషులను ప్రజాస్వామికీకరిస్తాయి. ఇదొక సాంస్కృతిక, మేధో అనుభవం. సృజనాత్మక రచనా నిర్మాణం వలె సంస్థలను నడపడం ఒక సృజన కలాపం. ఇన్నేళ్ల పాటు ఈ వేదిక ఉన్నదంటే అందులోని రచయిత్రులు దాని నుంచి ఈ సృజనాత్మక, ఉద్వేగపూరిత అనుభవాలను గడించి ఉంటారు. తిరిగి దాన్ని వేదికకు అందించి ఉంటారు. ఈ సమాజంతో సన్నిహిత సంబంధమున్న సంస్థలకే అది సాధ్యం.

పాణి
విప్లవ రచయితల సంఘం

మనలో మనం నుంచి ప్రరవేగా



'మనలో మనం' నుండి తమ అనుభవాల సారంగా 2010లో ఆవిర్భవించిన ప్రరవే గత పదిహేనేళ్ళుగా తాము నిర్దేశించుకున్న లక్ష్యాలకనుగుణంగా చురుకుగా పనిచేస్తుండటం సాహిత్య సంఘాల చరిత్రలో అరుదైన విశేషం. ప్రరవే రెండు తెలుగు రాష్ట్రాలలో దళిత, ముస్లిం మైనారిటీ, బీసీ, క్రైస్తవ, మైనారిటీ, ఆదివాసీ స్త్రీల జీవితాలను అధ్యయనం చేస్తూ వారి సాహిత్య కృషిని సమాజానికి అందిస్తుంది. బడిపిల్లలకు, కళాశాల విద్యార్థులకు సాహిత్య కార్యశాలలు నిర్వహించింది. సాహిత్య యాత్రలను చేసింది. క్షేత్ర పర్యటనల ద్వారా సామాజిక సమస్యలను అవగాహనలోకి తెచ్చుకుంది. కరోనాకాలంలో "స్త్రీ వాద సిద్ధాంతం - సాహిత్య విమర్శ/ ఆధునిక తెలుగుసాహిత్యం - స్త్రీ చైతన్యం" అనే అంశంపై (35 వారాలపాటు 2021 జూన్ నుండి 2022 అక్టోబర్ వరకు) ఉపన్యాసాలను, ప్రజాస్వామిక చర్చను నిర్వహించింది. నిరక్షరాస్యుల వద్దకు సాహిత్యాన్ని మౌలిక పద్ధతుల ద్వారా, వివిధ కళారూపాల ద్వారా తీసుకుపోవాలన్న లక్ష్యంతో ఇంకా ముందుకు సాగాల్సిన అవసరముంది.

కొత్తపల్లి రవిబాబు
జనసాహితి

అందరితో సంభాషణ



అర్థ శతాబ్దం పైబడిన 'వికాసం' బరంపురం నేపథ్యంగా ప్రగతి పథంలో నడిచే సంస్థ. అందుకుగానూ తన సంవిధానంలో స్పష్టంగా జెండర్ సమస్యని కూడా గుర్తించి ఆ దిశగా అడుగులు వేసింది. బరంపురానికి- స్త్రీల సమస్యలు, వాటి పట్ల అవగాహన పెంచే రచనలను వికాసం పరిచయం చేసింది. ఆ విధంగా ఎంతో మంది స్త్రీవాద రచయితల్ని వికాసం వేదికకు ఆహ్వానించాం. అందులో భాగంగా ప్రరవే వారు వికాసం సభలకి అతిథులుగా వచ్చారు. కేవలం జెండర్ సమస్యలే కాక అట్టడుగు వర్గాల సమస్యలు కూడా పరిగణనలోకి తీసుకుని విస్తృతమైన కృషి చేస్తున్నది ప్రరవే. ప్రజాస్వామ్య ధోరణిలో ఆలోచిస్తున్న ప్రతీవారితో సంభాషణ చేస్తూ ఉండటం వల్ల పదిహేనేళ్లుగా చైతన్యవంతంగా ముందుకు నడుస్తున్నది. ప్రరవేకి అభినందనలు. వారు చేస్తున్న మంచి పనులకి వికాసం సహకారం ఎప్పుడూ ఉంటుంది.

మండపాక కామేశ్వరరావు రాజు
వికాసం

పదిహేనేళ్ల ప్రరవే ప్రస్థానం స్ఫూర్తివంతం



ప్రరవేకు జేజేలు. మీరంతా కలిసి నడవడమనేది సామాన్యమైన విషయం కాదు. అలా అని అసామాన్యమూ కాదు. కల్మషం, అధికారం, దర్పం చూపకుండా అందరితో ఆత్మీయంగా కలగలసిపోయే గొప్ప మనసున్న రచయిత్రులు ఇందులో పని చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. నాలుగు కొప్పులు కలిస్తే అంతే, ఆడవాళ్లకు ఆడవాళ్లే శత్రువులన్న వాటిన్నింటినీ ప్రరవే తుడిచి పడేసింది. నలుగురు ఆడవాళ్లు కలిస్తే తమ గురించే కాకుండా ఎదుటివారి గురించి తమ చుట్టూ ఉన్న జనం గురించీ సాహిత్య వనంలో ఉన్న మహిళ, మొత్తం సమాజాన్ని వికసింప జేయడానికే పూనుకుంటారు. ప్రరవే అదే చేసింది. అలా రెండు రాష్ట్రాల్లో కొన్ని సాహిత్య కుసుమాలు వికసితమై తమ సాహిత్య పరిమళాలు వెదజల్లుతున్నాయి. ప్రరవే తన చుట్టూ సమాజం గురించి ఆలోచిస్తూ ఆచరణాత్మకంగా అనేక కార్యక్రమాలు చేస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతోంది. కోవిడ్ కాలాన్ని సైతం అధిగమించి ఆన్‌లైన్‌లో ప్రస్థానం కొనసాగించింది. పిల్లల నుండి యువతరం, పురుషులు ఈ కార్యక్రమాల్లో నిత్యం పాల్గొనడం పరిపూర్ణంగా సమాజం మొత్తం సమాయత్తమైనట్లు చేయడమే. అది ప్రరవే సుసాధ్యం చేసింది.

శాంతిశ్రీ
సాహితీ స్రవంతి

కల్లోలకాలపు కదలిక - ప్రరవే కార్యాచరణ



కల్లోల వర్తమానంతో సంభాషిస్తూ కొల్లగొడుతున్న హక్కులకు గొడుగు పడుతూ స్త్రీలపై జరుగుతున్న అనేక రకాల హింసల్ని నిరసిస్తూ, మహిళల జీవితం నిండా ఆవరించి ఉన్న సమస్త సంవేదనలను చర్చకు పెడుతూ ప్రరవే కార్యాచరణను కొనసాగిస్తున్నది. ముఖ్యంగా మహిళల కోణంలోంచి గత వర్తమాన సాహిత్యాలను వివేచన చేస్తూ, నవల, కథ, కవిత, వ్యాసం మొదలైన అన్ని సాహిత్య ప్రక్రియల్లో ప్రజాస్వామిక విలువల్ని ప్రతిపాదిస్తూ వస్తున్నది. సదస్సులు, సమావేశాలు, క్షేత్ర పర్యటనలు, పుస్తకాల ప్రచురణలతో జ్ఞానరంగంలో చేస్తున్న కృషి ప్రరవేను ప్రత్యేక స్థానంలో నిలిపింది. తమ రచనల ద్వారా అంతరాలు లేని ఆధునిక జీవిత నమూనాను సమాజానికి అందిస్తున్నది. రానున్న సభల్లో ఎంచుకున్న అంశమైన 'మహిళలపై ట్రోలింగ్' ఆలోచనాత్మకమైనది. మహిళలకు సమాన గౌరవం దక్కని నాడు మనది నాగరిక సమాజంగా మనజాలదు. ఇందు కోసం చేస్తున్న కృషి మునుముందూ కొనసాగి, దగా పడుతున్న మహిళా లోకానికి ప్రరవే దారి దీపం కావాలి.

గాజోజు నాగభూషణం
తెలంగాణ రచయితల వేదిక

ప్రజాస్వామిక వేదికల నిర్వహణకు ఆదర్శం



నిర్దిష్టలక్ష్యంతో నిర్దేశిత కర్తవ్యాలతో సంఘాలు, పార్టీలూ నడపటం సులువు. కానీ, విభిన్న లక్ష్యాలు విభిన్న కర్తవ్యాల కార్యాచరణ కలిగినవారితో ఉమ్మడి లక్ష్యం కోసం ఐక్యమై, వేదికగా నిర్మాణమయి పనిచేయటం చాలా కష్టం. అలాంటి వేదికలు తక్షణ సమస్యల పరిష్కారాలకై ఏర్పడినవి కొద్దికాలం వుండినాయేమో గానీ, సాహిత్య, సాంస్కృతిక రంగాన, యితర ప్రజాజీవన రంగాల్లో రాష్ట్ర జాతీయస్థాయిలో లేవు. సాహిత్యరంగాన శ్రీకాకుళ సాహితీ వేదిక వంటి స్థానికమైనవి కొన్ని వుండొచ్చు. ఆ లోటును పూరిస్తూ, పదిహేనేళ్ళుగా ప్రజాస్వామిక విలువలు, జీవన విధానం, పాలనారీతుల కోసం మహిళలతో, మహిళల కోసం నిర్విరామంగా కృషిచేస్తోంది ప్రరవే. కేవలం మహిళా సాధికారిత కోసం, మహిళలు మాత్రమే పనిచేసే సంస్థలా కన్పిస్తుంది గానీ, పురుషులకోసం, పురుషులతో కలసి కూడా పనిచేస్తోంది. స్త్రీ పురుషుల ఉమ్మడి ప్రజాస్వామిక విలువలకోసం సాహిత్య రంగాన యేమేమి చేయగలదో, అవన్నీ చేయడానికి ప్రయత్నిస్తూ వచ్చింది. ఐతే, ఈ ప్రయత్నాలు పట్టణాలనూ నగరాలనూ దాటి పల్లెలకూ బస్తీలకూ చేరలేదు. మధ్యతరగతి కిందకి చేరినట్లుగా కూడా లేదు. పాలనా విధానాల ఫలితంగా కార్పొరేటీకరణ, కాషాయీకరణా జరుగుతోంది. అడవి, సముద్రతీరం, మైదానపల్లెలూ విధ్వంసానికీ, అక్కడి ఆదివాసీలు, మత్స్యకారులు, బహుజనులు విస్తాపనకు గురవుతున్నారు. అందునా ఉత్తరాంధ్ర ప్రాంత మహిళలు అధికశాతం గురవుతున్నారు. సాహిత్యం- గురజాడ మధురవాణిని ఇష్టపడేట్టు, చర్చించేట్టు, రావిశాస్త్రి ముత్తేలమ్మను ఇష్టపడదు, చర్చించదు. ప్రరవే ఈ లోటుని పూరించాలని కోరుకుంటున్నాను.

అట్టాడ అప్పల్నాయుడు
ఉత్తరాంధ్ర రచయితల, కళాకారుల వేదిక

వివక్షలు లేని సమాజ స్థాపన కోసం



తెలుగు నేలమీద పదిహేనేళ్ళుగా స్త్రీల సాహిత్యాన్ని వృద్ధి పరుస్తున్న చైతన్య శీల సంస్థ ప్రరవే. వివిధ భావాల, వివిధ ప్రాంతాల, వివిధ నేపథ్యాల రచయిత్రుల్ని సమీకరించి భావాల ఘర్షణ ఉన్నా, సాహిత్యపరంగా ఐక్యత సాధిస్తూ ప్రజాస్వామిక స్ఫూర్తితో పురోగమిస్తున్నది. స్త్రీలపై జరుగుతున్న రకరకాల హింసల్ని ఎప్పటికప్పుడు ఎండగడుతూ సదస్సులు నిర్వహించి హింసకున్న వివిధ పార్శ్వాల్ని విశ్లేషించింది. కథ, నవల, కవిత, విమర్శలపై లోతైన అధ్యయనాలు చేసి సాహిత్యంలో స్త్రీల కోణాన్ని స్థిరపర్చటానికి విశేష కృషి చేసింది. ఆ వరుసలో ఇరవై మూడు పుస్తకాలు ప్రచురించింది. సామాజిక నిబద్ధతకు కట్టుబడి నిర్వాసిత, అభివృద్ధి, రాజ్య, కుల, మతాధిపత్య బాధిత స్త్రీలను పరామర్శించి వాళ్ళ ఉద్యమాలకు సంఘీభావం తెలిపింది. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి విస్తరించింది. వివక్షలు లేని సమాజ స్థాపన కోసం, ప్రజాస్వామిక వాతావరణం కల్పన కోసం, స్త్రీల సాహిత్య వికాసం కోసం పనిచేసే పదిహేనేళ్ళ ప్రరవే, ఏడవ మహాసభలకు జేజేలు.

నందిని సిధారెడ్డి
మంజీరా రచయితల సంఘం

ప్రజాస్వామిక వాదుల చారిత్రక బాధ్యత



మహిళా సాధికారత దిశగా భావజాల రంగంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక చేస్తున్న కృషికి అభినందనలు. కార్పొరేట్ శక్తులు తమ వ్యాపార ధనదాహంలో భాగంగా మరోసారి స్త్రీల హక్కులను కాలరాస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రరవే ఈసారి తీసుకున్న థీమ్ బాగుంది. సోషల్ మీడియా వేదికగా ప్రజాస్వామిక గొంతులపై తిరోగమన మనువాద శక్తుల దాడులు పెరిగిపోతున్న తరుణంలో సోషల్ మీడియాలో ట్రోలింగ్ అనే అంశం ప్రస్తుత సందర్భానికి సరిగ్గా సరిపోయే అంశం. ముఖ్యంగా మహిళా హక్కులకు, స్వేచ్ఛకు భంగం కలుగుతుంటే రాజ్యం కూడా తన వంతు గాయం చేస్తున్నది. తెలంగాణలో మరియమ్మ, టేకు లక్ష్మీ, బంజార లక్ష్మీ వంటి మహిళలపై జరిగిన అమానుష దాడులకు పౌర సమాజం పెద్దగా స్పందించిందే లేదు. ఇటువంటి దళిత, బహుజన స్త్రీలపై నిత్యం పెరిగిపోతున్న దాడులకు చెక్ పెట్టాలి. బాధితులకు అండగా నిలవాలి. అందుకు ఈ పురుషాధిపత్య సమాజాన్ని మానసిక పరివర్తన దిశగా నడిపించేందుకు ప్రరవే వంటి సంఘాలు మరింత ఉద్యమించాల్సిన చారిత్రిక సందర్భం ఇది.

పసునూరి రవీందర్
సమూహ

'నేతికుండపై యెలుక'

తెలుగులో మనకు పూర్వం వ్యవహారంలో ఉండిన పదబంధాలలో, జాతీయాలలో ఎన్నెన్నింటిని మనం పోగొట్టుకున్నామో అలా పోగొట్టుకున్నవి ఒక్కొక్కటిగా తెలుస్తున్నకొద్దీ ఆశ్చర్యం వేస్తుంది. అర్థంపరంగా అవి తెలియజేసే సంగతిని వివరంగా మాటలలో చెప్పాలంటే ఒక్కొక్క పదబంధానికి లేదా జాతీయానికి కనీసం రెండు మూడు వందల మాటలున్న ఒక పేరా అన్నా పడు తుంది. అటువంటిదే తిక్కన కాలంలో (13వ శతాబ్దం) తప్పనిసరిగా సామాన్యజన వ్యవ హారంలో ఉండి, ఆ తరువాత ఎప్పుడో మనకు తెలియకుండానే జారిపోయిన ఒక అర్థవంతమైన, అందమైన, హాస్యస్ఫోరకమైన పదబంధాన్ని గురించి ఈ చిన్న వ్యాసంలో ఇప్పుడు చర్చ.



రావణునికి కుంభీనస వరసకు చెల్లెలవుతుంది. రావణుడు లంకలో లేని సమయం చూసి మధువనే రాక్షసుడే ఒకడు ఆమెను బలవంతంగా తీసుకెళ్ళిపోతాడు. విభీషణుని ద్వారా ఈ సంగతిని తెలుసుకున్న రావణుడు అదివిన్న వెంటనే అగ్గి మీద గుగ్గిలమే అవుతాడు. "మన కన్నుగప్పి, మన ఇంట్లోంచే మన ఆడపడుచును తీసుకొని వెళ్ళడానికి వీడికి ఎన్ని గుండెలు వుండాలి? వీడిని ఇలా వదిలేస్తే, మనమంటే ఎవరికైనా, అం దునా ముఖ్యంగా ఆ దేవతలకు ఇక భయం అనేది వుంటుందా? ముల్లోకాలలో మరి మనల్ని లక్ష్యపెట్టేవాడు వుంటాడా? వాడి సంగతి చూడాల్సిందే!" అని ససైన్యంగా బయలుదేరి మధువనే వాడి ఇంటిపై విరుచుకు పడతాడు. ఈ విషయం తెలుసుకున్న కుంభీనస పరుగున వచ్చి అన్న కాళ్ళపై పడి "అన్నా, జరిగినదేదో జరిగిపోయింది. అతడిపుడు నా భర్త. వివాహ పద్ధతులలో రాక్షసమనే మార్గం కూడా ఒకటి వున్నది కాబట్టి, మా వివాహం ధర్మబద్ధంగా జరిగినదనే అనుకోవాలి. అందువలన కోపం తగ్గించుకుని, చెల్లెలినైన నా అభ్యర్థనను మన్నించి, నా భర్తను ఏమీ చెయ్యకుండా విడిచిపెట్టి, మఱిదిగా గౌరవించు"మని ప్రాధేయపడి, వేడుకుంటుంది. ఆమె మాటలకు రావణుని సమాధానం ఈ క్రింది పద్యం. తిక్కన రచించిన 'నిర్వచనోత్తర రామాయణము' షష్ఠాశ్వాసంలోనిది.

అలంతులం బోవు తప్పె
యిది యైనను నాతండు
నేతికుండపై
యెలుక నలంబుం బోవి
డిచి యేను భవత్పతిం
గాచితిన్ మనం
బలరంగం బోయి నిద్ర
దెలియంగ నుపాయము సేయు నాకు
నె
చ్చెలి యగుం దోడితెమ్మనినం
జేడియ సమ్మద మంది క్రమ్మఱన్.

- "చిన్నదిగా భావించి మన్నించాల్సిన తప్పా ఇది? అయినా అతడు నేతి కుండపై కూర్చునున్న ఎలుక చందమై ఉన్నాడు. నీ పతిని మన్నించానులే. ఈ సమయంలో సుఖంగా నిద్రిస్తూ ఉన్నాడని చెప్పావు కదా, వెళ్ళి అతగాడిని నిద్ర లేపి, సంగతిని చెప్పి నీ వెంట తీసుకొనిరా. నాకు తోడైనవాడిగా చేసుకుని గౌరవంగా చూసుకుంటాను" అని రావణుడు కుంభీనసతో చెప్పిన మాటలు పై పద్యం భావం.

ఇందులో మనకు కావలసింది 'నేతికండపై యెలుక' అనే పదబంధం గురించే. ఒకడు చేసిన అకార్యానికి వాడిని చితక కొట్టాలన్నంత కోపం మనసులో వుంటుంది. అయినప్పటికీ ఆ పని చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రత్యర్థి పడిపోయి ఉంటాడు. దానికి కారణం ఏమిటంటే, వాడిని అలా చితక తన్నడానికే గనుక పూనుకుంటే, ఆ క్రమంలో, వాడు ఎవరినైతే ఆశ్రయించి ఉన్నాడో వాళ్ళకు తప్పనిసరిగా చాలా గొప్ప హాని జరిగే ప్రమాదం వుంటుంది. అందువలన, ఇష్టంలేకపోయినా,

> తెలుగులో మనకు పూర్వం వ్యవహారంలో ఉండిన పదబంధాలలో, జాతీయాలలో ఎన్నెన్నింటిని మనం పోగొట్టుకున్నామో అలా పోగొట్టుకున్నవి ఒక్కొక్కటిగా తెలుస్తున్నకొద్దీ ఆశ్చర్యం వేస్తుంది. అర్థంపరంగా అవి తెలియజేసే సంగతిని వివరంగా మాటలలో చెప్పాలంటే ఒక్కొక్క పదబంధానికి లేదా జాతీయానికి కనీసం రెండు మూడు వందల మాటలున్న ఒక పేరా అన్నా పడుతుంది.

యేవిధమైన తొందరపాటు పని చెయ్యకుండా, చేతులు కట్టేసుకుని సౌమ్యంగా వాడికి నచ్చచెప్పి దారి మళ్ళించడం ఒకటే మిగిలివుండే మార్గం - అన్నది సందర్భానికి తగి వుండి పై పదబంధం (లేదా నానుడి) సూచించే అర్థం. ఇక్కడ రావణుడే గనుక చెల్లెలి మాటను వినకుండా తన పని తాను చేసుకుపోతే నష్టపోయేది తన చెల్లెలే, ఫలితంగా తాను కూడా- అన్నది స్పష్టపడుతున్న విషయం. ఇదిలా ఉండగా- 'పదబంధ పారిజాతము' ఈ పదబంధానికి 'రుచి మరిగి వదలనివాడు' అనే అర్థాన్ని చెప్పింది (ద్వితీయ సంపుటము, పే.318). 'నిర్వచనోత్తర రామాయణం' లోని పై సందర్భాన్నే ఉదాహరిస్తూ ఈ అర్థాన్ని పేర్కొన్నారు కాని, అది సందర్భానికి సరిపోయే అర్థంలా మాత్రం అనిపించదు. కారణం యేవిటంటే ఆ మాటలను చెప్పినది రావణుడు. పైగా అన్నది తన చెల్లెలైన కుంభీనసతోనే. ఆ అర్థాన్నే అన్వయించుకుంటే "నేతికుండవంటి నిన్ను రుచి మరిగి వదలలేక వున్నాడు వాడు. కనుక వాడిని నీవు కోరుకుంటున్నట్లుగానే క్షమించి వదిలి పెడుతున్నాను" అని ఒక అర్థరహితమైన, హేయమైన అర్థాన్ని చెప్పుకోవలసి వుంటుంది. అందువలన, ఆ అర్థాన్ని వదిలి "దండనార్హుడైనప్పటికీ, ప్రత్యర్థికి అందుకు వీలుపడనీయని స్థితియందున్నవాడు" అని సవరించడం ఉచితమని నేను భావిస్తాను.

భట్టు వెంకటరావు

అమీబాలమ్!

యూట్యూబ్ కామెంట్ బాక్సులో మాట్లాడుకున్న ప్రేమజంట రూపంలా వుంది భవిష్యత్తు స్వప్నం.
అస్పష్టాకార రూపం
దేనికీ ఒక రూపం లేదు. కానీ రూపం మారుతుంది

పొద్దుగాల నిమ్మలంగా ఉన్న ఆకాశం సాయంకాలానికి రక్తం స్రవిస్తూ కత్తుల్ని ప్రసవిస్తున్నట్లుంది
శాంతి అశాంతిగా ముగుస్తుంది, అశాంతి శాంతిగా మొదలవుతుంది
ప్రేమ రోజాలు విషాద శవయాత్రలో శోకిత పుష్పాలై రూపం మారుతుంది
అన్న తగిలించుకున్న స్విగ్గీ, జుమోటో బ్యాగుల గత రూపం
మద్దినేల అమ్మ తెచ్చే గడ్డిమోపుల్లాగా తోస్తుంది
నాణెంనుండి డిజిటల్లోకి జారిన రూపాయి
బ్రతుకు భాషకి కొత్త లిపి రాస్తుంది
లేఔట్ మింగిన చెరువు స్విమ్మింగ్‌పూల్ అవతారం
మహానగర ఉద్యానవనాల వెనకాతల తరిగిన అడవి ఆనవాళ్ళు
కరిగిన కొండరాయి శకలాలు ప్రకృతి కొత్త ప్రదర్శనశాలలు
రూపం మాత్రం స్పష్టంగా మారుతుంది
మేకవన్నె పులి, పులివన్నె మేకల మూక రూపం కూడా
మారుతుంది
ఓటుకు ముందు తెల్లటోపి తర్వాత కుచ్చుటోపీ అవతారం

పూలమాటు ముళ్లని ప్రేమించే సుపరిచిత రూపాలు
నవ్వులమాటు విషాన్ని చిలికే అపరిచిత రూపాలు
ముందొకటి లోపలొకటి
రూపం స్పష్టంగా మారుతుంది

ఏమి నిశ్చలమిక్కడ? ఎవడు నిశ్చలమిక్కడ?
ఈ నిరాకార మనోవికార నిరర్థక నిర్దయ జీవజాడలో
భౌతికంగా మనమేకానీ సాంకేతికంగా మనం కాదు
కాలవాహినిలో నెరుపుకుపోతున్న ఏకకణ జీవజాలం అమీబాలమ్!
మన రూపం మారుతుంది
స్పష్టంగా మారుతుంది



వెంకటేష్ పువ్వాడ
72047 09732

పుస్తక ప్రదర్శనకు పుస్తకాలు

ఫిబ్రవరి 9 నుంచి జరిగే హైదరాబాద్ బుక్ ఫెయిర్లో తెలంగాణకు సంబంధించిన సాహిత్యాన్ని ప్రదర్శించేందుకు రచయితలు వారి పుస్తకాలను తెలంగాణ పబ్లికేషన్స్ కార్యాలయానికి పంపించగలరు. చిరునామా: కోయ చంద్రమోహన్, తెలంగాణ పబ్లికేషన్స్, హౌస్.నెం.1-1-80/15, ఆర్టీసి క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్ - 500020. ఫోన్: 863997216.

కోయ చంద్రమోహన్

వచన కవితా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం' కోసం 2023లో ప్రచురించిన వచన కవితా సంపుటాలు నాలుగు ప్రతులను ఫిబ్రవరి 29 లోపు చిరునామా: కొండి మల్లారెడ్డి, ఇం.నెం.19-61/5/సి, విద్యా నగర్, రోడ్‌నెం. 3, మిలన్ గార్డెన్ రోడ్, కుశాల్ నగర్, సిద్దిపేట - 502103. ఫోన్: 9652199182.

పర్కపెల్లి యాదగిరి

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం

రంగినేని సుజాతా మోహన్ రావు ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా రంగినేని ఎల్లమ్మ పేర ఇచ్చే సాహిత్య పురస్కారానికి కవితా పురస్కారం కోసం 2023 సంవత్సరానికి వంశీకృష్ణ కవితా సంపుటి 'రెప్ప వాలని రాత్రి'ని ఎంపిక చేశారు. మార్చ్ 2024లో జరిగే కార్యక్రమంలో కవికి రూ.25వేలు నగదు, జ్ఞాపిక, పురస్కార పత్రం అందజేయబడతాయి.

రంగినేని మోహన్ రావు

మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం

మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 10 సా.4 గంటలకు గుంటూరులోని గుర్రం జాషువ విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. మద్దూరి విజయశ్రీ గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. సభలో శిఖామణి, జి.లక్ష్మీనరసయ్య, ప్రసాదమూర్తి, చల్లపల్లి స్వరూపరాణి, యం.యం. వినోదిని, కత్తి కల్యాణ్, ఖాజా, కోయి కోటేశ్వరరావు, జి.వి. రత్నాకర్, నూకతోటి రవికుమార్, కాకాని సుధాకర్ తదితరులు వక్తలుగా పాల్గొంటారు.

పల్నాటి శ్రీరాములు


కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు

భక్తజన హోరు

వనదేవతల సన్నిధిలో కిక్కిరిసిన జనం

- వారాంతపు రోజు భక్తుల కిటకిట
- భారీగా ముందస్తు మొక్కులు




మేడారం కిక్కిరిసిపోయింది. వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహా జాతరకు ముందుగానే సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంతపు సెలవు కావడంతో కుటుంబ సమేతంగా మేడారం చేరుకున్నారు. ముందుగా జంపన్నవాగులో స్నానాలు ఆచరించారు. కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించి వనదేవతల గద్దెల వద్దకు క్యూలైన్ల ద్వారా చేరుకొని మొక్కులు చెల్లించారు. సుమారు ఐదు లక్షల మంది తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. - మేడారం

7


భక్తులతో కిక్కిరిసిపోయిన వనదేవతల గద్దెల ప్రాంగణం

కొత్త పనులకే సీడీఎఫ్



- నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున కేటాయింపు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.120కోట్ల విడుదల
- పాఠశాలల్లో సౌకర్యాలకు 10శాతం..
- తాగునీటి అవసరాలకు 30 శాతం..
- కార్యాలయాల నిర్వహణకు 5 శాతం..
- మిగతా 65శాతం సంక్షేమ, అభివృద్ధి పనులకు కేటాయింపు..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో ఖర్చు చేసేలా ఉత్తర్వులు

వరంగల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నియోజకవర్గాల అభివృద్ధి నిధుల (సీడీఎఫ్) వినియోగంపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నిధులు గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పను లకు మళ్లించకుండా ప్రభుత్వం దృష్టిసారించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల అనుమతితో సీడీఎఫ్ ఖర్చు చేయాలని ఉత్తర్వులు జారీ చేస్తూనే.. కొత్త పనులకు మాత్ర మే వినియోగించాలని ఆదేశించింది. ఇటీవల ప్రతీ నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున ప్రభుత్వం సీడీఎఫ్ కేటాయించింది. ఈ నిధుల్లో 35శాతం వివిధ శాఖలకు ఖర్చు చేయాలని ప్రభుత్వం పేర్కొనగా, మిగతా 65శాతం అభివృద్ధి, సంక్షేమ పనులకు ఖర్చు చేసేందుకు ఎమ్మెల్యేలకు వీలు కల్పించింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నియోజకవర్గాల్లో కొత్తగా చేపట్టాల్సినపనులను గుర్తించే పనిలో పడ్డారు.

ప్రభుత్వ బడులపై ప్రత్యేక నజర్

సీడీఎఫ్ నిధుల్లో 20శాతం సర్కారు పాఠశాలలను బలోపేతం కోసం వినియోగించనున్నారు. ప్రస్తుతం ఉన్న బడులను బలోపేతం చేయటం, శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను మరమ్మతులు చేయటం, ప్రహరీ నిర్మాణం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంట గదుల నిర్మాణం, క్రీడా సామగ్రి కొనుగోలు, తదితర అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిం చారు. ప్రతీ నియోజకవర్గంలో ప్రభుత్వ బడి కోసం ఖర్చు చేసేందుకు రూ.2కోట్లు కేటాయించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.24కోట్లు పాఠశాలల అభివృద్ధికే ఖర్చు చేయనున్నారు. ఇందుకోసం విద్యాశాఖలోని ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఎక్కడెక్కడ నిధులు అవసరమో మండలాల వారిగా నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా ప్రైవేటు పాఠశాల లకు దీటుగా విద్యా బోధన జరిగేలా ప్రభుత్వం దృష్టిసారిస్తోంది.

తాగునీటికి కేటాయింపులు

నియోజకవర్గాల అభివృద్ధి నిధుల్లో 10శాతం తాగునీటికి కేటాయించింది. ప్రతీ నియోజకవర్గంలో రూ.కోటి చొప్పున ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.12కోట్లు కేటాయించింది. ఈ నిధులతో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రధానంగా చేతి పంపుల మరమ్మతులు, నల్లా లీకేజీలు, పైపులైన్ నిర్మాణం, మంచి నీటి బావుల పూడిక తదితర పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాలకు మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. అయితే లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతున్నాయి. వీటిపై దృష్టిపెట్టడంతో పాటు మిషన్ భగీరథ నీళ్లురాని ప్రాంతాలకు కొత్తగా పైపులైన్ నిర్మాణంపై చర్యలు తీసుకోనున్నారు.

కార్యాలయాల నిర్వహణకు..

ప్రతీ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు రూ.50లక్షల నిధులను వినియోగించను న్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.6కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. మండలస్థాయి ప్రభుత్వ కార్యాలయాల నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఈ నిధులను ఖర్చు చేస్తారు. కార్యాలయాల మరమ్మతులతోపాటు ఇతర సామగ్రి కొనుగోలు, నిర్మాణాలకు నిధులను ఖర్చు చేసే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాల కోసం..

ప్రభుత్వం మంజూరు చేసే ప్రత్యేక పనులు, సంక్షేమ పథకాల కోసం ఈ మిగతా 65శాతం నిధులను ఖర్చు చేయనున్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.6.50కోట్ల నిధులు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేసే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.78కోట్ల నిధులు ఎమ్మెల్యేలు అభివృద్ధి పనుల కోసం వినియోగించేలా ప్రభుత్వం వీలు కల్పించింది. అయితే ఈ నిధులను ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో అధికారులు అభివృద్ధి పనులను గుర్తించి, ఎంత ఖర్చుఅవుతుంతో అంచనాలు తయారు చేసి సంబంధిత శాఖ జిల్లా అధికారికి పంపిస్తారు. సదరు జిల్లా అధికారి సంబంధిత జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తారు. వీటిని కలెక్టర్లు పరిశీలించి ప్రణాళిక శాఖ ద్వారా ఇన్‌చార్జి మంత్రికి పంపిస్తారు. ఆయన ఆమోదంతో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. దీంతో ఈ నిధులను పాత పనులకు మళ్లించకుండా చెక్ పెట్టడంతోపాటు అధికార పార్టీ కనుసన్నుల్లో పనులు జరిగే అవకాశం ఉంది.

రూ.10కోట్లకు పెంపు

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గాల అభివృద్ధి నిధుల (సీడీఎఫ్)ను భారీగా పెంచింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. ప్రతీ నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం రూ.3కోట్లు కేటాయించింది. 2020-21 ఆర్థిక సంవ త్సరంలో కరోనా కారణంగా ఈ నిధులు కూడా ప్రభుత్వం కేటాయించలేదు. ఆ తరువాత 2021-22ఆర్థిక సంవత్సరంలో సీడీఎఫ్ నిధులను రూ.3కోట్ల నుంచి ప్రభుత్వం రూ.5కోట్లకు పెంచింది. ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలకు కూడా సీడీఎఫ్ కేటాయించింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీడీఎఫ్‌ను రెండింతలు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి కోసం రూ.120కోట్లు విడుదల చేసింది. గత ప్రభుత్వం ఎమ్మెల్సీలకు కూడా ఎమ్మెల్యేలతో సమానంగా సీడీఎఫ్ విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీకి శాసనమండలిలో ఎమ్మెల్సీల సంఖ్య తక్కువగా ఉండటంతో వారికి నియోజకవర్గాల అభివృద్ధి నిధులు కేటాయింపులు ఉంటాయా? అనేది చర్చనీయాంశంగా మారింది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్సీ కూడా లేరు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు
వెంటనే చెల్లించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 4: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హంటర్‌రోడ్‌లోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో హనుమకొండ జిల్లా కమిటీ విస్తృత సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఉపాధ్యాయుల పీఆర్‌సీ, ఏరియర్స్, సరెండర్ తదితర బిల్లులను వెంటనే క్లియర్ చేసి, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. కోర్టు కేసులను పరిష్కరించి ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని అందుకు ఆటంకంగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాల, కళా శాల విద్య ప్రైవేట్ రంగంలోకి వెళ్లిపోయిందని, ప్రభు త్వ విద్యను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన గుర్తుచేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు అయిపోగానే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో పత్రికా సంపాదక వర్గ సభ్యురాలు ఎ.విద్యాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు బద్దం వెంకట్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, ఉపాధ్యక్షులు సీహెచ్.రవీందర్‌రాజు, ఎస్.జ్యోతి, వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.కుమార్, సుజన్ ప్రసాద్ రావు, డి.కిరణ్ కుమార్, సీఎస్ ఆర్.మల్లిక్, స్టాలిన్‌బేగ్, చంద్రయ్య, శశిధర్‌రెడ్డి, మోజెస్, నవీన్ కుమార్, కుమార్ రాజారాం, సదానందం, భాస్కర్‌రావు వివిధ మండలాల బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.


ఐనవోలు ఆలయ ప్రాంగణంలో నజర్‌పట్నాల్లో నిమగ్నమైన భక్తులు

పట్నాలు వేసి.. మొక్కులు సమర్పించి..

- ఐనవోలులో వారాంతపు జాతర
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 4: ఐనవోలు మల్లికార్జున స్వామి 3వ ఆదివారం వారాంతపు జాతరకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. ఆదివారం ఉదయం స్వామి వారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి అమ్మవార్లకు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వికులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామాగ్రిని ముట్టచెప్పారు. మరి కొందరు రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టు లాగుతూ ప్రదిక్షణలు చేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

- కమిటీల నిర్మాణంతో మహిళా కాంగ్రెస్ బలోపేతం
- ప్రధాని మోదీ హయాంలో మహిళలకు కరువైన రక్షణ
- మహిళా కాంగ్రెస్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సునితారావు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు లోకసభ స్థానాలను పార్టీ కైవసం చేసుకునేందుకు మహిళా కాంగ్రెస్ నాయకులు అంకితభావంతో కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల క్రమంలో వరంగల్ సెగ్మెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం జరిగింది. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి సునితారావు మాట్లాడుతూ.. కమిటీల నిర్మాణంతో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, ఈ మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలో వార్డు స్థాయి నుంచి జిల్లా కమిటీల వరకు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ చర్యలు చేపట్టాలని జిల్లా అధ్యక్షులను ఆదేశించారు. నామి నేటెడ్ పోస్టుల్లో మహిళా కాంగ్రెస్ నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరనున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం జరపాలని సునితారావు సూచించారు. గ్యారంటీల ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనాలపై మరింత అవగాహన కల్పించా లన్నారు. ఎమ్మెల్సీ కవిత తన స్థాయిని మించి మా ట్లాడుతోందని సునితారావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, అధినేత్రి ప్రియాంక గాంధీ గురించి ఇష్టారీతిలో మాట్లాడడం అనైతికమన్నారు. సోని యాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందనేది కవిత మరి చిందని, ఆమెకు మతిభ్రమించిందని మండిపడ్డారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేబోమని స్పష్టం చేశారు. మోదీ హయాంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రగల్భాలతోనే మోదీ ప్రజల ను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు.

మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకం

లోక్‌సభ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లి మహిళలకు వివరించాలన్నారు. ఇప్పటికే ప్రకటించిన రెండు గ్యారంటీలతో మహిళలు సంతోషంగా ఉన్నారని, త్వరలో మరో రెండు గ్యారంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించనున్న క్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం జరపాలని సూచించారు. వరంగల్‌లోని రెండు లోక్‌సభ స్థానాల్లో పార్టీ విజయానికి అండగా నిలవాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు.

సమష్టిగా కృషి చేద్దాం..

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు స్వప్న, సుగుణ, స్రవంతి, గ్రామ, మండల, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైష్టవి, భవ్యల మృతి దిగ్భ్రాంతికరం

- విద్యార్థినుల కుటుంబాలకు అండగా ఉంటాం..
- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు

7

మళ్లీ 'పైరవీ' బదిలీలు

- హాట్ టాపిక్‌గా మారిన 'చెక్ స్లిప్ ట్రాన్స్‌ఫర్స్'
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదుల సంఖ్యలో సిఫారసులు
- ఆరోగ్య సమస్యలంటూ కొందరు ఉపాధ్యాయుల ఆర్జీ
- డీఎస్ఈ నుంచి డీఈవోలకు ఫైళ్లు

వివరాలు : 7లో..



వరంగల్, హనుమకొండ నగర శివార్లలో కొంత కాలంగా లంపెన్ గ్యాంగులు, నకిలీ పోలీసుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. తాగుడు తదితర జల్సాలు, విలాసవంతమైన జీవితాలకు అలవాటు పడి ఒళ్లు వంచి పనిచేయ చేతకాని కొందరు యువకులు అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. తప్పులు చేస్తూ దొరికేవరకు దొరల్లా తిరిగి దొరికిన తర్వాత దొంగల్లా జైలు జీవితం అనుభవిస్తున్నారు. నగర శివార్లలో ఉన్న వ్యభిచారగృహాలు, ఒంటరి మహిళలు, ప్రేమ జంటలను టార్గెట్ చేసి అందినకాడికి దోచుకుంటున్నారు. రోజు రోజుకూ నగర శివార్లలో నకిలీ పోలీసులు, దోపిడీ గ్యాంగుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయే తప్ప తగ్గడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'చిల్లర' గ్యాంగులు!

- నగర శివార్లలో రెచ్చిపోతున్న ఆకతాయిలు
- వ్యభిచార గృహాలు, ప్రేమ జంటలే లక్ష్యంగా దోపిడీ పర్వం
- వంగపహాడ్‌లో పోలీసులమంటూ బెదిరింపులు, దాడులు
- అరెస్టు చేసి జైలుకు తరలించిన పోలీసులు
- మిగతా ప్రాంతాలపై కూడా దృష్టి సారించాలంటున్న జనం



హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 4: హనుమకొండ, వరంగల్, కాజీపేట శివారు గ్రామాల్లో చిల్లర గ్యాంగులుగా ఏర్పాటు చేసుకున్న యువకులు రెచ్చిపోతున్నారు. నగరం నుంచి ఒంటరిగా గ్రామాలకు వెళ్లే మహిళలను, అమాయకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేస్తున్నారు. ముందుగా ఆటోలో కానీ.. ద్విచక్రవాహనంపైగానీ వెళ్లే వారిని వెంబడించి మార్గమధ్యలో అడ్డుకుని బంగారం, నగదును లాక్కొని వెళుతున్నారు. కొందరైతే ఈ ప్రాంతంలో దొంగలుగా సంచరిస్తున్నారు. మెడలో ఉన్న సొమ్ములు తీసిదాచుకోమని చెప్పి మాటలతో మభ్యపెట్టి బంగారం దోచుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఇంకా కొన్నిచోట్ల నకిలీ పోలీసులు, జులాయిలు శివారు గ్రామాల రహస్య ప్రదేశాలలో మద్యం తాగుతూ ప్రేమ జంటల కోసం కాచుకుని కూర్చుంటారు. ప్రేమజంటలు, కళాశాల విద్యార్థులు అటువైపు రాగానే తొలుత యువకుడి వద్ద నుంచి బైక్ తాళాన్ని లాక్కుంటారు. ఐడీ కార్డును తీసుకుని వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లలో వారి ఫొటోలు, వీడియోలు చిత్రీకరిస్తారు. తల్లి దండ్రుల ఫోన్ నెంబర్లు ఇవ్వాలని బెదిరిస్తారు. ఆ తర్వాత తాము పోలీసులమని, స్టేషన్‌కు తీసుకెళతామంటూ భయభ్రాంతులకు గురిచేయడంతో ఏటీఎంల నుంచి డబ్బులు డ్రా చేసి మరీ ఇచ్చిన జంటలున్నట్టు సమాచారం.

గతంలో కేయూ, హసన్‌పర్తి, ధర్మసాగర్, విఎల్స్‌కాలనీ పీఎస్‌ల పరిధిలో ప్రేమజంటలను చితకబాది దోపిడీ చేసి జైలుకు వెళ్లిన ఘటనలున్నాయి. అదే విధంగా పెద్దమ్మగడ్డ, రంగశాయిపేటకు చెందిన కొందరు యువకులు ఇదే తరహా దారి దోపిడీలకు పాల్పడి జైలుకు వెళ్లారు. ఆత్మకూరు మండలానికి చెందిన మరో యువకుడు ఒగ్లాపూర్‌సైలానీబాలా సమీపంలో మహిళలను, ప్రేమ జంటలను అడ్డగించి పోలీసులమని అటకాయించి బైకులు, డబ్బులు, బంగారు ఆభరణాలు, విలువైన సెల్‌ఫోన్లు లాక్కుని పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. అలాగే ఇలాంటి ఘటనలు ఎక్కువగా కేసీ కెనాల్ ప్రాంతం, కొత్తపేట, దామెర, ఓగ్లాపూర్, అనంతసాగర్, బొల్లికుంట, వంగపహాడ్, గొర్రెకుంట, ఆటోనగర్, శివనగర్, జక్కలొద్ది, కొండపర్తి, సింగారం, గవిచర్ల, కడిపికొండ, ప్రకాశ్‌రెడ్డిపేట, మడికొండ, ఉనికిచెర్ల, భీమారం, చింతగట్టు, కోమటిపల్లి, పలివెల్పుల, పెగడపెల్లి, రెడ్డిపురం గ్రామ శివార్లలో జరుగుతున్నట్టు సమాచారం. తాజాగా నగరానికి అనుకుని ఉన్న వంగపహాడ్ గ్రామంలో వ్యభిచార గృహాలకు వచ్చిన విటుల నుంచి నగదు, బంగారం, వాహనాలను దోపిడీ చేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు.

బ్లాక్‌మెయిల్

హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో కొన్నేళ్లుగా కొన్ని కుటుంబాలు పడుపు వృత్తిని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నాయి. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అదే గ్రామానికి చెందిన యువకులు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు రాత్రి సమయాల్లో వ్యభిచార గృహాల వద్దకు వచ్చే వారిని అడ్డుకుని హల్‌చల్ చేస్తున్నారు. విటుల ఫొటోలు, వీడియోలు తీస్తూ బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు, బంగారం లాక్కుంటున్నారని ఆవేదన చెందారు. కొందరిపై భౌతికదాడులు చేస్తూ డబ్బుల కోసం హింసిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడగా, ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి.

పట్టించుకోని పోలీసులు

నగర శివారు ప్రాంతాల్లో చాలాచోట్ల చిల్లర గ్యాంగులు నకిలీ పోలీసులుగా చెలామణి అవుతూ దొంగతనాలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నా పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫ్రెండ్లీ పోలీసులని నమ్మకంతో కొందరు బాధితులు, విద్యార్థులు ఫిర్యాదు చేస్తే యేడాది దాటుతున్నా కేసులు నమోదు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాల్సిన పోలీసులు.. విస్మరించడంతోపాటు లంపెన్ గ్యాంగులకు సహకరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. వంగపహాడ్, సిద్ధాపూర్, గీసుగొండ, హసన్‌పర్తి, చలపర్తి, ల్యాదెళ్ల గ్రామాలను ఆనుకుని ఉన్న కొన్ని వ్యభిచార గృహాల నిర్వాహకులకు నకిలీలు, లంపెన్ గ్యాంగుల నుంచి దోపిడీకి గురికాక తప్పడం లేదని వాపోతున్నారు.

పోలీస్ బాస్‌లు శ్రద్ధ కనబర్చాలి

పోలీసు బాస్ అంబర్ కిశోర్ ఝా నగర శివార్లలో కలకలం రేపే నకిలీ పోలీసులు, చిల్లర గ్యాంగులపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కమిషనరేట్‌లో పోలీసు నిఘా వ్యవస్థ నిద్రమత్తులో ఉండడం, టాస్క్‌ఫోర్స్ టీమ్స్ అప్రమత్తంగా లేకపోవడం, పోలీసు పెట్రోలింగ్ బందాలు గస్తీ నిర్వహించకపోవడం వల్లనే కొందరు ఆకతాయిలు నకిలీ పోలీసుల అవతారం ఎత్తి శివార్లలో రెచ్చిపోతున్నారని అంటున్నారు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని, ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నకిలీలను ఏరివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా నకిలీలపై దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మళ్లీ 'పైరవీ' బదిలీలు

హాట్ టాపిక్‌గా మారిన 'చెక్ స్లిప్ ట్రాన్స్‌ఫర్స్' ● ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదుల సంఖ్యలో సిఫారసులు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 4: మళ్లీ చెక్ స్లిప్(పైరవీ) బదిలీలు తెరపైకి వస్తున్నాయి. పైరవీల బదిలీల కోసం అనారోగ్య సమస్యలంటూ కొంతమంది ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీల కోసం పైరవీలు షురూ చేస్తున్నారు. గత ఏడాది ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కంటే ముందుగానే కొంతమంది ఉపాధ్యాయులు చెక్ స్లిప్ బదిలీలతో ఇతర జిల్లాలకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగానే పైరవీల బదిలీలు జరగగా, ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఉపాధ్యాయులు ఈ నేపథ్యంలోనే బదిలీ అయ్యారు. అప్పుడది విద్యాశాఖలో పెద్ద దుమారం లేపడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చెక్ స్లిప్ బదిలీలకు చెక్ పెట్టింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా పాలకవర్గ నేతలు సిఫారసులు చేస్తుండటంతో విద్యాశాఖలో బదిలీల పరంపరకు తెరతీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ (డీఎస్ఈ) కార్యాలయం నుంచి డీఈవోలకు కొంత మంది ఉపాధ్యాయుల బదిలీల కోసం రిమార్కులు అడుగుతున్నట్లు సమాచారం.

చెక్ స్లిప్ బదిలీలన్నీ అక్రమ బదిలీలే..

చెక్ స్లిప్ పేర్లతో వస్తున్న బదిలీలన్నీ అక్రమ బదిలీలే అంటూ ఉపాధ్యాయ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గాలను ప్రసన్నం చేసుకుంటూ కొంతమంది ఉపాధ్యాయులు అక్రమబదిలీలు చేయించుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనారోగ్య కారణాల పేరుతో అధికారులను బురిడీ కొట్టిస్తూ రిమోట్ ఏరియాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చేందుకు కొంతమంది ఉపాధ్యాయులు పావులు కదుపుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలు వస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని హెచ్ఆర్ఏ సౌకర్యం ఉన్న పాఠశాలలనే ఎంపిక చేసుకుంటూ పైరవీ బదిలీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిజంగా అనారోగ్య కారణలుంటే సాధారణ బదిలీల్లో వారికి ప్రిఫరెన్షియల్ కేటగిరీల్లో పాయింట్లు వస్తాయని, అప్పుడు వారు పట్టణ ప్రాంతాల్లోకే బదిలీలు అవుతారని, అలా కాకుండా అనారోగ్య కారణాలు చూపుతూ లక్షల రూపాయలు లంచాలు అందజేస్తూ అక్రమ బదిలీలు చేయించుకుంటున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

సిఫారసుల్లో హుకుం

సాధారణంగా ప్రజాప్రతినిధులు ఎవరికైనా ఉద్యోగికి సిఫారసు చేస్తే సందర్భాన్ని బట్టి తాము సిఫారసు చేసిన పనులు చేయాల్సిందిగా అధికారులను ప్రజాప్రతినిధులు కోరుతారు. అయితే ఉపాధ్యాయుల పైరవీ బదిలీలకు సిఫారసులు చేస్తున్న ప్రజాప్రతినిధులు మాత్రం పని తప్పకుండా చేయాలంటూ సిఫారసు లేఖల్లోనే హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గ ప్రజాప్రతినిధుల నుంచి హుకుంతో కూడిన సిఫారసు లేఖలు అందుతుండడంతో అధికారులు సైతం ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది ఉన్నతాధికారులు సైతం హుకుంతో కూడిన సిఫారసు లేఖలతో ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా నుంచి పలువురి సిఫారసు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సుమారు 10 మంది ఉపాధ్యాయులకు పైగా సిఫారసు లేఖలతో హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగానే సిఫారసు లేఖలు సమర్పించిన కొంత మంది ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఫైళ్లు సంబంధిత డీఈవోలకు వివరణ కోసం పంపించినట్లు సమాచారం. ఖాళీల వివరాలతోపాటు, సంబంధిత ఉపాధ్యాయులు కోరుకుంటున్న పాఠశాలల్లో ఖాళీల వివరాలు సమర్పించి సమగ్ర సమాచారం అందజేయాలని డీఈవోలకు సంబంధిత ఉన్నతాధికారి లేఖలు పంపించినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా నుంచి హనుమకొండ జిల్లాకు ఒకరు, ములుగు జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు ఒకరు, మహబూబాబాద్ జిల్లా నుంచి జనగామ జిల్లాకు ఒకరు, ఆసిఫాబాద్ జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు బదిలీ కోసం దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయులకు సంబంధించిన ఫైళ్లు ఆయా జిల్లాల డీఈవోలకు చేరుకున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

డిప్యూటేషన్ల కోసం యత్నాలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఈనెల 2న డిప్యూటేషన్ల బదిలీల ఉత్తర్వులు జారీ కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొంత మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్ బదిలీల కోసం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది వరంగల్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సర్దుబాట్లు జరిగిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సైతం ఈ జిల్లా నుంచి జోరుగానే అక్రమ డిప్యూటేషన్లకు తెరతీసేందుకు ఇక్కడి అధికారులు సైతం సిద్ధం అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ అక్రమ డిప్యూటేషన్ బదిలీల కోసం కొంత మంది ఉపాధ్యాయులు అధికారులను, మరికొంత మంది ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అక్రమ బదిలీలపై సీఎం దృష్టిపెట్టాలి

చెక్ స్లిప్ పేర్లతో ప్రజాప్రతినిధుల సిఫారసులతో అధికారులు చేపడుతున్న అక్రమ బదిలీలపై ముఖ్యమంత్రి చొరవ తీసుకొని అక్రమ బదిలీలను నిరోధిస్తూ చర్యలు తీసుకోవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో పాటు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే అక్రమార్కులకు కొమ్ముకాస్తూ సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలంటూ కోరుతున్నారు. సాధారణ బదిలీలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పర్యవేక్షణాధికారుల కొరత, ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న విద్యారంగాన్ని గాడిన పెట్టాలని కోరుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నల్లా భాస్కర్‌రెడ్డి మృతదేహం

నయీంనగర్, ఫిబ్రవరి 4: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నక్కల గుట్ట వద్ద గల హరిత కాకతీయ హోటల్‌లో నల్లా భాస్కర్‌రెడ్డి(35) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సుబేదారి ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన నల్లా భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఓ ప్రయివేటు చిట్‌ఫండ్స్ కంపెనీలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేసేవాడు. భాస్కర్‌రెడ్డి చిట్‌ఫండ్స్‌లో చాలా మంది ఖాతాదారులతో దాదాపు రూ.5 కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించినట్లు ఎస్ఐ తెలిపారు. చిట్‌ఫండ్స్ యజమానులు ఖాతాదారులకు వారి డబ్బు ఇవ్వకపోవటంతో ఖాతాదారులు భాస్కర్‌రెడ్డిపై ఒత్తిడి చేసేవారు. అలాగే ఆరు నెలలుగా చిట్‌ఫండ్ కంపెనీ వారు జీతాలు ఇవ్వడం లేదు. దీంతో భాస్కర్‌రెడ్డి చాలా రోజుల నుంచి ఒత్తిడికి లోనై తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడని తన భార్య శామిలి తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ క్రమంలో శుక్రవారం భాస్కర్‌రెడ్డి తన భార్యకు బయటికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి ఫోన్ కాల్ లిఫ్ట్ చేయకపోవడంతో తన భార్య భాస్కర్‌రెడ్డి స్నేహితులకు ఫోన్ చేసి చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. భాస్కర్‌రెడ్డి ఆచూకీ కోసం అతడి స్నేహితులు అన్ని ప్రాంతాలు వెతకగా మృతుడి కారు హరిత కాకతీయ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే హోటల్ సిబ్బందిని విచారించగా రెండు రోజుల నుంచి హోటల్‌లో ఉంటున్నట్లు సిబ్బంది తెలిపినట్లు వారి స్నేహితులు తెలిపారు. హోటల్ గదికి వెళ్లగా లోపలి నుంచి గడియ పెట్టుకుని ఉందని, హోటల్ సిబ్బంది గది తలుపులు తెరిచి చూడగా భాస్కర్‌రెడ్డి గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఎస్ఐ సుమన్ తెలిపారు. మృతుడు భాస్కర్‌రెడ్డికి భార్య శామిలి, ఇద్దరు కుమారులు మణికంఠరెడ్డి, విద్యావన్‌రెడ్డి ఉన్నారు. మృతుడి భార్య శామిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపారు.

తెలుగులో పద్మకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 4: కేయూ తెలుగు విభాగం పరిశోధకురాలు జక్కం పద్మ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం పద్మకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. తిక్కన మహాభారతం -మౌసల నుంచి స్వర్గరోహణ పర్వాములు- విమర్శనాత్మక పరిశీలన ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ లభించింది. తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్, కేయూ ఆర్ట్స్ తెలుగు మాజీ డీన్, రిటైర్డు ప్రొఫెసర్ కొంకా యాదగిరి పర్యవేక్షణలో పద్మపరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగులకు చెందిన పద్మ నల్లగొండలోని టీఎస్‌టీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన పద్మను పలువురు అభినందించారు.

నవోదయలో ఖాళీల భర్తీకి సన్నాహాలు

- **9, 11వ తరగతిలో ప్రవేశాలకు 2,980 దరఖాస్తులు**
- **ఈనెల 10న ప్రవేశ పరీక్ష : ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ**



జఫర్‌గడ్, ఫిబ్రవరి 4: జవహర్ నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి అధికారులు సన్నాహాలు చేపట్టారు. 2024-25 విద్యా సంవత్సరానికి మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,980 దరఖాస్తులు రాగా, ఇందులో 9వ తరగతికి 1,480, 11వ తరగతికి 1,500 చొప్పున వచ్చాయన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణకు 9వ తరగతి అభ్యర్థులకు వరంగల్‌లో నాలుగు, మామునూరులోని నవోదయ విద్యాలయంలో ఒకటి చొప్పున 5 పరీక్షా కేంద్రాలు, 11వ తరగతి అభ్యర్థులకు వరంగల్‌లో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష ఆయా కేంద్రాల్లో ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకునిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుల (హాల్ టికెట్లు)ను నవోదయ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అయితే సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో పొందుపరిచిన వివరాలకు. అడ్మిట్ కార్డుల్లో గల వివరాలకు ఏదేని తేడా కనిపిస్తే, ఇందుకు తగిన ధ్రువపత్రాలతో ఈనెల 7వ తేదీ వరకు మామునూరులోని నవోదయ విద్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

భక్తజన సందోహం

● వనదేవతల సన్నిధిలో కిక్కిరిసిన జనం ● కిటకిటలాడిన గద్దె ప్రాంగణం



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 4: తాడ్వాయి మండలం మేడారంలో కొలువైన సమ్మక్క - సారలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు ప్రవాహంలా తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రవాప్యంతా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈనెల 21 నంచి 24 వరకు మహాజాతర జరగనుండగా ఆ సమయంలో కోటిన్నర మందికి పైగా భక్తులు తరలి వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. ఈ నేపథ్యంలో అధిక మంది భక్తులు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. తిరిగి మహా జాతరలో తల్లులకు ఎదురు మొక్కులు సమర్పించుకుంటామని అంటున్నారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

మేడారం వనదేవతలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి ఐటీ కమిషనర్ బాలకృష్ణ, ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, హైకోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్, ఉట్నూరు రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్‌రెడ్డి వేర్వేరుగా మొక్కులు చెల్లించుకున్నారు.

కట్టుదిట్టంగా ట్రాఫిక్ నియంత్రణ

మహాజాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తుల వాహనాలతో మేడారం కిక్కిరిసిపోయింది. హరితహోటల్, చిలకలగుట్ట, శివరాంసాగర్, ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు, వీవీఐపీ పార్కింగ్ పరిసరాల్లో భక్తులు విడిది చేయడంతో వేల సంఖ్యలో వాహనాలు చేరుకున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. వాహనాలను రూట్ మొబైల్ పార్టీలు రోడ్డుపై నిమిషం ఆగకుండా పార్కింగ్‌లకు తరలించాయి. భక్తులు సులువుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, గద్దెల సమీపానికి చేరుకునేలా ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన సుమారు వెయ్యి మంది పోలీసులు సేవలు అందించారు. భక్తుల భద్రత, వీవీఐపీ, వీఐపీ దర్శనాలతో పాటు క్యూలైన్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆర్టీసీ సేవలు

భక్తులను మేడారం చేర్చడానికి వివిధ జిల్లాల ఆర్టీసీ డిపో సర్వీసులను అధికారులు వినియోగించారు. హనుమకొండ నుంచి మేడారం వరకు 67ట్రిప్‌లు, తిరిగి హనుమకొండకు 67 ట్రిప్‌లు నడిపినట్టు 52 సర్వీసులతో 5800 మందికి రవాణా సౌకర్యాలు కల్పించినట్లు ఆర్టీసీ ప్రత్యేక పర్యవేక్షణాధికారి శివప్రసాద్ తెలిపారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నారని అన్నారు.




వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గద్దెల ప్రాంగణంలో గంట కొడుతున్న భక్తులు

భారత రాజ్యాంగంలో మార్పు రావాలి..

సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్ రావు



మాట్లాడుతున్న నాగేశ్వర్ రావు

హనుమకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలో మౌలికమైన కొన్ని మార్పులు రావలసిన అవసరం ఉందని సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్ రావు అభిప్రాయపడ్డారు. ఆదివారం హనుమకొండ లస్కర్‌బజార్ హైస్కూల్‌లో 'శ్రీ శారదా కృష్ణ సాహితీ సామాజిక సాంకేతిక ట్రస్ట్ భారత రాజ్యాంగం, సాంస్కృతిక వికాసం, పరిపాలనా ధోరణలు' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అల్ప సంఖ్యాక వర్గాలకు కల్పిస్తున్న రక్షణలు అధిక సంఖ్యాక వర్గాలకు కల్పించలేదన్నారు. అందువల్ల దేశంలో హిందూ మతం నానాటికీ పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, పర్యవసానంగా మత మార్పిడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ పరిస్థితి రాకుండా రాజ్యాంగ రక్షణలు ఉండాలన్నారు. రాజాశ్రయం లేకుండా మతాలు మనుగడ సాగించలేవని, ప్రపంచంలో ఇతర పెద్ద మతాలను తమ అధికారిక మతాలుగా దేశాలు ప్రకటించడంవల్ల అవి విస్తృతమౌతున్నాయని, కానీ హిందూ మతానికి అలాంటి అవకాశం లేదన్నారు. కనుక భారత రాజ్యాంగం చట్టపరమైన సరైన రక్షణలు కల్పించాలని నాగేశ్వర్‌రావు కోరారు.

ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల రంగారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రముఖ అష్టావధాని చేపూరి శ్రీరాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజా మనోహర్ బాబు, ఎన్‌వీఎన్ చారి, వరికొండ కాంతారావు, పాలకుర్తి దినకర్, పల్లేరు వీరస్వామి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అమరవాది రాఘవ, క్రిష్టారావు, పరమేశ్వర్ రాజు, అడ్లూరి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి, భవ్యల మృతి దిగ్భ్రాంతికరం

విద్యార్థినుల కుటుంబాలకు అండగా ఉంటాం.. : మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4: యాదాద్రి భువనగిరి జిల్లా గురుకుల విద్యార్థినులు వైష్ణవి, భవ్యలు ఆత్మహత్యకు గురి కావడం దిగ్భ్రాంతికి గురి చేసిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు అన్నారు. విద్యార్థుల మృతికి మహిళా కాంగ్రెస్ సంతాపం ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం వరంగల్ పార్లమెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ అధ్యక్షతన హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా సునితారావుతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం మీడియా సమావేశంలో సునితారావు మాట్లాడారు.

గురుకుల పాఠశాల ఘటనపై విచారణ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పోలీస్‌అధికారులతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. విద్యార్థినులు తొందరపాటు నిర్ణయాలకు గురి కావొద్దని సూచించారు. సమస్యలను ఎదురించాలి తప్ప.. ఆత్మహత్యలు పరిష్కారమే కాదన్నారు. జరిగిన సంఘటనతో తీవ్ర వేదనకు గురైనట్లు చెప్పారు. వైష్ణవి, భవ్య కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఆత్మహత్యకు గురి కావడం విచారకరమన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ మాట్లాడుతూ.. ఆత్మహత్యే పరిష్కారం అనుకుంటే ఎవరూ ఉండరన్నారు. ప్రతి మహిళా సమస్యలకు దీటుగా పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు స్వప్న, సుగుణ, స్రవంతి తదితరలు పాల్గొన్నారు.



అలరించిన చిన్నారుల గాన కచేరి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 4: హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో సద్గురు త్యాగరాజ స్వామి 177వ సంగీత ఆరాధానోత్సవాన్ని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా భద్రకాళి ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వెంకటరమణ, చార్టెడ్ అకౌంటెంట్ త్రిపురనేని గోపిచంద్ హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కచేరిని ప్రారంభించారు సప్తస్వర మ్యూజిక్ అకాడమీ నిర్వాహకురాలు స్వరూపరాణి, లాయక్ అహ్మద్ పాల్గొన్నారు.


త్యాగరాజ కీర్తనలను ఆలాపిస్తున్న చిన్నారులు

ధరల నియంత్రణ కమిటీల్లేక మోసాలు

సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి

హనుమకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా ధరల నియంత్రణ కమిటీలు లేకపోవడంతో వ్యాపారులు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారని, వినియోగదారులు దారుణంగా అన్యాయాలకు గురవుతున్నారని కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఇఫ్ ఇండియా (సీసీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. ఆదివారం జాల్నాలో సీసీఐ, ఏఐడబ్ల్యుసీ సంయుక్తంగా నిర్వహించిన వినియోగదారుల ప్రతినిధుల జాతీయ సమావేశానికి చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరల నియంత్రణ కమిటీలు లేకపోవడం వల్ల ధరల పెరుగుదల అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో ఆహార భద్రతా కమిషన్ నామమాత్రంగా మారడం, విద్యుత్ రంగంలో మోనోపలి విధానాలు, అనుమతి లేని కాస్మోటిక్ క్లినిక్‌ల అక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. సీసీఐ చైర్మన్ డాక్టర్ అనంత శర్మ వినియోగదారుల హక్కుల సిటిజన్ చార్టర్‌ను విడుదల చేశారు. ఏఐసీడబ్ల్యుసీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవేంద్ర తివారీ, సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, వినియోగదారుల ప్రతినిధులు అన్నా ప్రగడ శివపార్వతి, దొంతి శిల్పారెడ్డి, న్యాయవాది కల్యాణ్ జ్యోతి, ఎస్ ప్రవీన్ పాల్గొన్నారు. అనంతరం సీసీఐ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని ప్రభుత్వ కాలేజీల్లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో క్లబ్బులను ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

సుబేదారి, ఫిబ్రవరి 4: సంత్ సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15ను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సంత్‌సేవాలాల్ ఉత్సవ కమిటీ నాయకులు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉత్సవ కమిటీ నాయకులు కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. స్పందించిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సెలవుదినంగా ప్రకటించేందుక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంత్ సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బానోతు నవీన్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్‌తో పాటు ఈశ్వర్ సింగ్ నాయక్, భూక్య బాబురావు, ఉదయ్ సింగ్ నాయకులు ఉన్నారు.

స్టేడియం నిర్మాణమే లక్ష్యం..

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 4: వర్ధన్నపేట నియోజకవర్గంలో స్టేడియం నిర్మించి క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ పరిధిలోని కోమటిపల్లి శివారు నిరూప్‌నగర్ తండాలో ఏర్పాటు చేసిన ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు దివంగత ప్రవీన్‌రాజ్ స్మారకార్థం ఆయన మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయనతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌డ్డి ముఖ్య అతిథుగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం విజేతలైన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, టోర్నమెంట్ నిర్వాహకులు బండారి ప్రభాకర్, మట్టెడ కుమార్, తాళ్లపల్లి జైపాల్, సాగర్, విజయ్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది ప్రవీన్, చాగంటి శ్రీనివాస్, వరంగల్ డీఎస్‌ఏ కోచ్ సుమన్, హనుమకొండ డీఎస్ఏ కోచ్ అబ్జల్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ముదిరాజ్‌లకు అండగా ఉంటా..

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్

సుబేదారి, ఫిబ్రవరి 4: ముదిరాజ్ కులస్తులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీ నాయకులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల నాయకులు ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని బండా ప్రకాశ్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు, ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీల నాయకుల సమష్ట కృషితో జాతిని బలోపేతం చేయాలన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో నూతన సభ్యత్వాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్లు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

నేడు బల్దియా ప్రజావాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 4: వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుంది. హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ప్రజావాణి ప్రారంభం కానుంది. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తదితర అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

అండర్ రైల్వే జోన్‌లో నీటి సరఫరా బంద్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 4: వరంగల్ అండర్ రైల్వే గేట్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్రా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్ఎండీ కరీంనగర్ పంప్‌హౌస్ వద్ద మరమ్మతు పనుల క్రమంలో నీటి సరఫరా ఉండదన్నారు. అండర్ రైల్వే జోన్ పరిధిలోని కరీమాబాద్, శివనగర్, రంగసాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశికుంట, ఎస్ఆర్ఆర్ తోట, ఏకశిలానగర్, కాశికుంట, ఖిలా వరంగల్, ధూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, నక్కలపల్లి, లక్ష్మీపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ, దేవన్నపేట ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ కవిత విమర్శలు హాస్యాస్పదం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీపై ఎమ్మెల్సీ కవిత విమర్శలు హాస్యాస్పదమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టరు రామగళ్ల పరమేశ్వర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కవితా వ్యాఖ్యలను ఖండించారు. తెలంగాణ ఇచ్చిందే సోనియాగాంధీ అన్నారు. కవిత మతితప్పి మాట్లాడుతోందన్నారు. ప్రొటోకాల్ గురించి కవిత మాట్లాడేందుకు అర్హతే లేదన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సురేఖకు వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న మీసాల ప్రకాశ్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 4: వరంగల్ మహానగర పాలకసంస్థలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మునిసిపల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయుసీ) ప్రతినిధులు మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండలోని మంత్రి నివాసంలో ఆమెను కలిసి విన్నవించారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో మంత్రి సురేఖను కలిసి తమ సమస్యలను తెలియచేశారు. ఉద్యోగ భద్రత కరువైందని, వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ శ్రీనివాస్, కొమ్ము తిలక్, కుమార్, ప్రసాద్, నరేశ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ప్రమాదం నుంచి బయటపడిన ప్రయాణికులు


ప్రమాదం నుంచి బయటపడిన బాధితులు, (ఇన్‌సెట్)లో కాల్వలో బోల్తాపడిన కారు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 4: అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పిల్ల కాల్వలోకి కారు దూసుకెళ్లిన సంఘటన ఎర్రగట్టుగుట్ట విహాన్ పబ్లిక్ స్కూల్ వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికూడ మండలం నర్సక్కపల్లికి చెందిన పాడి ప్రతాప్‌రెడ్డి వ్యవసాయదారుడు. రాజకీయనాయకుడు. ఇతడి భార్య పాడి కల్పనాదేవి పరకాల మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ. మనుమడు, మనుమరాలితో కలిసి వీరు కారులో నర్సక్కపల్లి నుంచి హనుమకొండకు బంధువుల వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎర్రగట్టుగుట్ట వద్ద గల విహాన్ పబ్లిక్ స్కూల్ వద్ద రోడ్డు పక్కన డీబీఎం 35 (పిల్లకాల్వ) కాల్వలో కారు అదుపుతప్పి పడింది. పరిస్థితిని గమనించిన అక్కడి రైతులు, బాటసారులు వచ్చి కారులోంచి వారిని సురక్షితంగా బయటకు తీశారు. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం నుంచి బయటపడ్డారు. అనంతరం వారు తన బంధువుల ఇంటికి వెళ్లిపోయారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయండి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 4: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతరాలు లేని విద్య ప్రజల హక్కు, ప్రభుత్వ బాధ్యత ప్రధాన అంశంగా, కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రభుత్వం వెంటనే ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఈ మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, విశిష్ట అతిథులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, బానోతు సేవా నాయక్, జి.జగపతిరావు, లక్ష్మయ్య, కుమారస్వామి, రాజేంద్రం, సారయ్య, భాస్కర్, సత్తార్, హరిశంకర్, శ్రీనివాస్, కొమురయ్య, శ్రీరాం, భిక్షపతి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాల రఘుపతి

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


టౌన్ హాల్‌లో మాట్లాడుతున్న లోకిని రాజు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 4: సామాజిక, రాజకీయ, ఆర్థికంగా వెనుకబడిన ఎరుకల కులస్తుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ. 500 కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్ హాల్‌లో తెలంగాణ ఎరుకల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తానని ప్రకటించిందని అన్నారు. పందుల పెంపకం దారుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీం కింద మంజూరైన రూ. 50 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కోనేటి రాజు, పల్లకొండ ప్రభాకర్, ఓని సదానందం, లోకిని సమ్మయ్య, మానుపాటి రమేష్, బూనాద్రి రంజిత్, మద్దెల శ్రీనివాస్, పులిచేరు చిన్నసారయ్య, మానుపాటి సురేందర్, లోకిని చందర్, బిజిలి ప్రశాంత్, ఎల్లేష్, రవీందర్ పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహ ఏర్పాటుకు సన్నాహక సమావేశం

కాజీపేట, ఫిబ్రవరి 4: ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహాన్ని హనుమకొండలో ఏర్పాటు చేయడానికి ఆదివారం కాజీపేటలోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సుమారు 20 ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమకారుడు సోమ రాంమూర్తి మాట్లాడుతూ.. గద్దర్ సమానత్వం ప్రాతిపదికన మానవీయ సమాజాన్ని నిర్మించడానికి జీవితాంతం పోరాడాడని అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో మొదలై మావోయిస్టు ఉద్యమంలో పనిచేసి, చివరికి బౌద్ధమార్గంలో పయనించాడని తెలిపారు. ఆయన విగ్రహం హనుమకొండలో ఏర్పాటు చేస్తే ప్రజలకు నిత్యం చైతన్యాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, కోండ్ర నర్సింగరావు, చింతం ప్రవీణ్ కుమార్, మచ్చ దేవేందర్, సుధాకర్‌రావు, గోవర్ధన్, జ్యోతి రమణి, భాస్కర్, లక్ష్మీనారాయణ, భిక్షపతి, అర్జున్, రాజయ్య, శ్రీనివాస్ నాయక్, రమేశ్, కృష్ణ, నల్లెల్ల రాజయ్య పాల్గొన్నారు.


సమావేశంలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

చెరువులో దూకి ఇద్దరి ఆత్మహత్య

అన్నారం షరీఫ్‌లో చెరువులో దూకి బలవన్మరణం

2న తల్లి, 4న కుమారుడి మృతదేహాలు లభ్యం

పర్వతగిరి/కరీమాబాద్, ఫిబ్రవరి 4 : అత్తింటి వేధింపులు తాళలేక ఏడు నెలల కుమారుడితో తల్లి చెరువులో దూకగా, తల్లి మృతదేహం 2న, కుమారుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఈ ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారంషరీఫ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం బాలుడి మృతదేహం లభ్యంకాగా, ఆ వివరాలను ఎస్సై వీరభద్ర రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శంభునిపేటకు చెందిన తస్లీం సుల్తానా(25) తన కుమారుడు తన్మూర్ (7 నెలలు) ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కనిపించడం లేదని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో 2న మండలంలోని అన్నారంషరీఫ్ దర్గా చెరువులో తస్లీం సుల్తానా మృతదేహం నీళ్లలో పైకి తేలి కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు అక్కడకి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు.

కాగా, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు మేరకు మృతురాలి కుమారుడి కోసం గజ ఈతగాళ్లతో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మామునూరు ఏసీపీ సతీష్ బాబు, పర్వతగిరి పోలీసుల సహకారంతో రెండు రోజుల పాటు గాలింపు చేపట్టగా ఆదివారం బాలుడి మృతదేహం లభ్యమైంది. దీంతో బాలుడి మృతదేహాన్ని మిల్స్ కాలనీ పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, తన కూతురు ఆత్మహత్య చేసుకునేలా వేధింపులకు గురిచేసిన భర్త తన్వీర్, అత్త, మామ, ఆడబిడ్డ తస్లీమా, ఆమె భర్త జాఫర్, బావ ఫారుక్, యారాలు షాజహాపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తండ్రి షేక్ అఫ్జల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ టి.సురేష్ తెలిపారు.


తస్లీం సుల్తానా, తన్మూర్ (ఫైల్), బాలుడి మృతదేహం

పురస్కారాలు కృషికి గుర్తింపుగా నిలుస్తాయి..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 4: ఒక సంస్థను ఏర్పాటు చేయడం సులువే కానీ.. దానిని సమర్థవంతంగా నిర్వహించడం ఎంతో కష్టసాధ్యమని, అలాంటిది యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి అద్భుతంగా నిర్వహించడం అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రసంశించారు. ఆదివారం హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చి, ఉత్తమ సేవలు అందించిన వారికి జాతీయ పురస్కారాలు అందించి సన్మానించుకోవడం శుభపరిణామం అన్నారు. పురస్కారాలు అందించడం మన సంప్రదాయాన్ని తెలియజేయడమే కాకుండా వారు చేసిన కృషికి గుర్తింపుగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని స్వచ్ఛంద సంస్థ సభ్యులు శాలువా, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాజుచారి, పోలోజు భాస్కరచార్యులు, పోలోజు రాజ్‌కుమార్, వంగాల శాంతికృష్ణ, పొడిశెట్టి విష్ణువర్ధన్, రంగిశెట్టి రమేశ్, సుబ్బారెడ్డి, కన్నె రాజు, సంగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 4: అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ క్రిష్ణకాలనీ, వాజ్‌పాయ్ కాలనీలలో రూ. 50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలపడమే తన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, మాజీ కార్పొరేటర్ ఎ. నాగరాజు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళా యాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి


ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 4: రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెవాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి ఆదివారం తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ నేతృత్వంలో వినతి పత్రాన్ని అందచేశారు. ఈ మేరకు హనుమకొండలోని యూటీఎఫ్ కార్యాలయంలో కలిసి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నాయకులు ఆర్టీ ప్రసాద్, జరుపుల చందూలాల్, డాక్టర్‌కుండ్లె మధుకర్‌రావు, డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిట్స్


ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్ జోసఫ్ సాంటోస్

సుబేదారి, ఫిబ్రవరి 4: కాజీపేటలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ ఎగ్జిబిట్స్‌లో చంద్రయాన్ రాకెట్, వీదుల్లో సోలార్ విద్యుత్, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత అనే అంశాలు ఆలోచింప జేసే విధంగా విద్యార్థులు ఎగ్జిబిట్లు తయారు చేశారు. కార్యక్రమంలో సెయింట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ జోసఫ్ సాంటోస్ విద్యార్థులను అభినందించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం


బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట, ఫిబ్రవరి 4: ఒత్తిడిని దూరం చేయడంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాజీపేటలోని తాళ్ల పద్మావతి ఇంటర్ నేషనల్ స్కూల్‌లో క్రీడా పోటీల ముగింపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. చదువు ఎంత ప్రధానమో క్రీడలు కూడా అంతే ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. భవిష్యత్‌లో కూడా మరింత పెద్దఎత్తున క్రీడా పోటీలు నిర్వహించాలని, తనవంతు సహకారం కూడా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్, తాళ్ల పద్మావతి పాఠశాల కరస్పాండెంట్ మల్లేశం, వంశీ, రమణారెడ్డి, వెంకటరమణ, టి.బుచ్చిబాబు, కార్పొరేటర్ సోదా కిరణ్, శంకర్, వేణుమాధవ్, వెంకట్‌రెడ్డి, సతీష్, రామారావు, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

జీవితం నేర్పే అనుభవాల నుంచి పాఠాలను చాలా మంది నేర్చుకుంటారు. నేర్చుకున్న పాఠాలను సమాజ హితం కోసం ఉపయోగించాలనుకొనేవారు కొద్దిమందే ఉంటారు. అలాంటి వారిలో మానసి పొద్దర్ కూడా ఒకరు. చిన్నతనంలో లైంగిక అత్యాచారానికి గురయిన మానసి తానే ఒక సైకాలజిస్ట్‌గా.. థెరపిస్ట్‌గా ఎదిగారు. హీల్ గ్రో థ్రైవ్ ఫౌండేషన్‌ను స్థాపించి అనేక మందికి సాయం చేస్తున్నారు. మానసి అనుభవాలు ఆమె మాటల్లోనే.



మానసి ప్రయాణం సమాజహితమే!

చిన్నప్పటి అనుభవాలు- పెద్దయిన తర్వాత మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. చిన్నప్పుడే లైంగిక అత్యాచారానికి గురి అయితే ఆ బాధ మనస్సులో ఎప్పటికీ ఉండిపోతుంది. జీవితంలో ఎవ్వరిని నమ్మలేని విధంగా తయారుచేస్తుంది. దాని నుంచి బయటకు రావటం అంత సులభం కాదు. నా జీవితంలో కూడా అలాంటి అనుభవాలు ఉన్నాయి. వాటి నుంచి నేను బయటకు రాగలిగాను. ఈ రోజున నేను నా అనుభవాలు పంచుకుంటున్నానంటే దానికి కూడా ఒక కారణం ఉంది. మన సమాజంలో లైంగిక అత్యాచారాలకు గురి అయినవారిపై సానుభూతి ఎక్కువగా ఉండదు. కుటుంబ సభ్యులు కూడా సాయపడలేరు. నాది కూడా ఆ విధమైన కథే! నేను పుట్టింది కోల్‌కత్తాలో. పెరిగింది ఒక ఉమ్మడి కుటుంబంలో. చిన్నప్పుడే మా తాతగారు చనిపోయారు. దీనితో నాయనమ్మకు ఆదరణ కరువు అయింది. కుటుంబంలో ఆమెకు ఉన్న స్థానం తగ్గిపోయింది. ఆ రోజులు తలుచుకుంటే- ఇప్పటికీ నాకు కళ్లలో నీళ్లు వస్తాయి. నేను పదేళ్ల వయస్సులోనే రజస్వల అయ్యాను. మా స్నేహితులందరి కన్నా పెద్దగా కనిపించేదాన్ని. నాకు 13 ఏళ్లు ఉన్నప్పుడు మా ఇంట్లో పనిచేసే ఒక వ్యక్తి నాపై లైంగిక అత్యాచారం చేశాడు. అతని ప్రవర్తన గురించి ఎవరితో చెప్పుకోవాలో తెలిసేది కాదు. అమ్మతో చెబితే తిడుతుందని భయం. నాన్నతో నాకు అంత సాన్నిహిత్యం లేదు. దాంతో నేను ఎవరితో మాట్లాడేదాన్ని కాదు. ఒంటరిగా రోజులు గడుపుతూ ఉండేదాన్ని. స్కూల్లో కూడా నాకు చేదు అనుభవాలే ఎదురయ్యేవి. ఇంట్లో పరిస్థితుల వల్ల స్కూల్లో సరిగ్గా చదవలేకపోయేదాన్ని. ఒకస్థితిలో అత్యాచారం అనేది అతి సాధారణమైన విషయమే అనుకొనేదాన్ని. 15 ఏళ్ల వయసులో ఒక రోజు ధైర్యం చేసి మా స్కూల్లో టీచర్‌కు నా కథ చెప్పాను. కానీ ఆవిడ నమ్మలేదు. నాకు మంచి మార్కులు రావటం లేదు కాబట్టి తిట్టకుండా ఈ కథను అల్లాననుకుంది. ఆ అనుభవంతో నేను మరింత కుంగిపోయాను. ఈ అనుభవాల వల్ల నాకు ఎక్కువ మంది స్నేహితులు ఉండేవారు కాదు.

మా ఇంట్లో వాళ్లకు ఈ విషయం తెలిసేలోపు నా కాలేజీ చదువు పూర్తయిపోయింది. నాకు పెళ్లి చేశారు. నా భర్త కూడా చాలా హింసాత్మకంగా ఉండేవాడు. అప్పటికే నాకు ఒక చిత్రమైన మానసిక పరిస్థితి ఏర్పడింది. ఎవరైనా నాతో తప్పుగా ప్రవర్తిస్తే- తప్పు వారిది కాదు.. నాదే అనుకొనేదాన్ని. ఎక్కడో తప్పు జరుగుతోందని తెలుసు. కానీ దానిని ఎలా సరిచేయాలో తెలిసేది కాదు. కొద్ది మంది స్నేహితులతో నా బాధలు చెప్పుకొనేదాన్ని. వారు చాలా పట్టుపట్టిన తర్వాత 2007లో నా భర్తకు విడాకులు ఇచ్చాను. ఆ సమయంలోనే నేను థెరపీకి వెళ్లాను. చాలా మంది థెరపీ వల్ల ప్రయోజనం ఏముంటుందనుకుంటారు. కానీ థెరపీ నా జీవితంలో చాలా పెద్ద పాత్ర పోషించింది. అప్పటి దాకా మనసులో ఉన్న బాధలు, బెంగలు అన్నీ బయటకు చెప్పగలిగాను. అంతే కాదు.. ఆ సమయంలోనే నేను ఇతరుల బాధలను అర్థం చేసుకోగలనని తెలిసింది. నా జీవితంలో జరిగిన సంఘటనల మాదిరిగా అనేక మంది జీవితాల్లో కూడా జరిగి ఉండవచ్చని అనిపించింది. ఆ సమయంలో నా స్నేహితులను కలిసినప్పుడు వారికి సంబంధించిన అనేక విషయాలు వినేదాన్ని. కానీ ఎప్పుడూ ఎవరికీ సలహాలు ఇవ్వలేదు. ఇతరులకు సాయపడటానికి సైకాలజీ చదివితే మంచిదనిపించింది. న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి అప్లై చేశా. సీటు రావటంతో అక్కడ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. రెండేళ్ల ప్రాక్టీసు చేశా. ఆ తర్వాత భారత్‌కు తిరిగి వచ్చేశా.

ఒక దశాబ్దం క్రితం థెరపీకి ఎక్కువగా డిమాండ్ ఉండేది కాదు. ఉద్యోగాలు ఎక్కువగా వచ్చేవి కావు. దాంతో నేను దాచుకున్న డబ్బులతో ఫౌండేషన్‌ను స్థాపించా. ఆ రోజు నుంచి ఇప్పటి దాకా అతి తక్కువ ఫీజు తీసుకొని థెరపీ సెషన్స్ ఇస్తూ ఉంటాం. ప్రస్తుతం మా దగ్గర 20 మంది పనిచేస్తున్నారు. మేము ఇప్పటి దాకా సుమారు 1000 మందికి పైగా సాయపడ్డాం. మా దగ్గరకు వచ్చే వారిలో ఎక్కువ మంది మధ్యతరగతి వారే ఉంటారు. వారికి మానసిక వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియదు. ఒక వేళ వెళ్లినా - డాక్టర్లు తీసుకొనే ఫీజును భరించలేరు. దానితో చాలా మంది వైద్యమే చేయించుకోరు. లైంగిక అత్యాచార బాధితురాలిగా నాకు నా పేషెంట్ల బాధ తెలుసు. అందుకే వారితో ఎక్కువగా కనెక్ట్ కాగలుగుతా. నాలా కాకుండా త్వరగా బయటపడమని సలహా ఇస్తూ ఉంటా. బయటకు రావటానికి అవసరమైన మార్గాలను సూచిస్తూ ఉంటా.

వాస్తవానికి ఇదంతా ఒక్క రోజులో జరిగే పని కాదు. మానసిక సమస్యలకు ఒక్క రోజులో పరిష్కారం దొరకదు. మనసులోని బాధను తొలగించటం అంత సులభం కాదు. కానీ ప్రయత్నం ఎక్కడో ఒకచోట మొదలవ్వాలి. ఆ ప్రయత్నంలో నాదొక చిన్న పాత్ర అనే విషయం ఎంతో తృప్తిని ఇస్తూ ఉంటుంది.



పిల్లలను తల్లితండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వారిలో ఎలాంటి మార్పులు వస్తున్నాయో గమనిస్తూ ఉండాలి. ఎప్పుడైనా సాయం కావాల్సి వస్తే- వారికి అవసరమైన సాయాన్ని అందించాలి. అవసరమైతే థెరపిస్ట్‌తో కూడా మాట్లాడించాలి. వీటన్నింటి కన్నా తల్లితండ్రులకు లైంగిక అత్యాచారాల పట్ల అవగాహన పెరగాలి. అప్పుడే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి.

అరటితో అసలైన లుక్!



- అరటిపండును గుజ్జుగా చేసుకోవాలి. బౌల్‌లో ఈ గుజ్జును వేసి అందులో టీస్పూన్ నారింజ రసం, టీస్పూన్ పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే యంగ్‌లుక్ వస్తుంది.
- బౌల్‌లో ఒక చిన్న అరటిపండు గుజ్జును వేసి అందులో రెండు టీస్పూన్ల అలొవెరా జెల్ వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా క్రష్ చేసి ఫేస్‌కు పట్టించాలి. మెడ చుట్టూ కూడా పట్టించుకోవాలి. ఆరిన తర్వాత చన్నీటితో ముఖాన్ని శుభ్రం చేయాలి. ఇలా చేస్తే చర్మంమీద ఉండే మంటలు తొలగిపోతాయి.
- అరటిపండులో సగం తీసుకుని మెత్తగా చూర్ణం చేసుకోవాలి. ఇందులోకి టీస్పూన్ వేపాకులతో చేసిన చూర్ణం, చిటికెడు పసుపు వేసి బాగా కలపాలి. దీన్ని ఫేస్‌ప్యాక్‌లా వేసుకోవాలి. ముప్పయి నిముషాల తర్వాత మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే మొటిమలు తగ్గిపోతాయి.
- బౌల్‌లో సగం అరటిపండుతో చేసిన గుజ్జు, టేబుల్ స్పూన్ తేనె వేసి మిశ్రమంగా కలపాలి. దీన్ని అప్లై చేస్తే ఫ్రెష్‌గా ఫీలవుతారు. ముఖ్యంగా అరటిపండులో ఎ,సి విటమిన్లు ఉండటం వల్ల హైపిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. నొప్పుల్లాంటివి తగ్గిపోతాయి.
- సగం అరటిపండు మిశ్రమాన్ని తీసుకుని అందులోకి రెండు చుక్కల నిమ్మరసం, టేబుల్ స్పూన్ శనగపిండి వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖంతో పాటు మెడచుట్టూ అప్లై చేయాలి. దీనివల్ల ముఖం మీద ఉండే నల్లటి వలయాలు తొలగిపోతాయి.
- పొడిచర్మం ఉండే వాళ్లు అరటిపండు చూర్ణానికి, రెండు టీస్పూన్ల కొబ్బరినూనె, టీస్పూన్ తేనె కలిపి చూర్ణం చేయాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషాల తర్వాత కడిగేస్తే చర్మంలో కాంతి వస్తుంది.
- సగం అరటిపండు మిశ్రమం, రెండు టేబుల్ స్పూన్లు ఓట్స్ తీసుకోవాలి. ఇందులోకి కొద్దిగా తేనెను కలిపి మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని అప్లయ్ చేసి ఇరవై నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. చక్కటి ఫలితం ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అరటిపండు గుజ్జు, టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, అర టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి పదిహేను నిముషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే చర్మంలో మెరుపు వస్తుంది.



ధైర్యం, ఆత్మవిశ్వాసం రెండు కళ్ళుగా...

యాసిడ్ దాడిలో చూపు పోగొట్టుకొని, ఎన్నోసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించిన గతం ఆమెది. ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో... మహిళా సాధికారతకు ఆమె బ్రాండ్ అంబాసిడర్. స్వయంకృషితో ఎదిగి, ఎందరికో చేయూత అందిస్తున్న ఉత్తరాఖండ్‌కు చెందిన కవితా బిస్త్ కథ ఇది.

"అవి నేను ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్న రోజులు. నా వయసు పంతొమ్మిదేళ్ళు. ఎన్నో కలలు. వాటిని నిజం చేసుకొనే ప్రయత్నాలు... చక్కగా సాగిపోతున్న నా జీవితం అనూహ్యంగా చీకటిమయమైపోయింది. అది 2008 ఫిబ్రవరి రెండో తారీకు. ఆఫీసుకు వెళ్ళడానికి బస్టాప్‌లో నిలబడి ఉన్నాను. బైక్ మీద ఇద్దరు వ్యక్తులు వచ్చి నా ముందు ఆగారు. వాళ్ళు ముఖానికి ముసుగులు వేసుకొని ఉన్నారు. ఏం జరుగుతోందో గమనించేలోపే... వాళ్ళు నా ముఖం మీద ఏదో ద్రవం పోసి పరారయ్యారు. ఆట పట్టించడానికి ఎవరో నీళ్ళు పోసి ఉంటారనుకున్నాను. హఠాత్తుగా ముఖమంతా మంట. ముఖం మీద చర్మం కరిగిపోతోంది. నేను పెద్దగా కేకలు పెట్టాను. "ఏదీ కనిపించడం లేదు. నన్ను కాపాడండి" అని అరిచాను. నాచుట్టూ కార్లు, వాహనాలు వెళ్తున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. జనం మాట్లాడుకుంటున్నారు. కానీ ఎవరూ సాయం చెయ్యడానికి ముందుకురాలేదు. అలాగే సొమ్మసిల్లిపోయాను. ఒక గంట తరువాత... అటుగా వెళ్తున్న మా పొరుగింటి వ్యక్తి నన్ను చూశారు. నా ముఖం మీద ఎవరో యాసిడ్ పోశారని స్థానికులు చెప్పడంతో... ఆయన నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. కానీ ఎఫ్ఐఆర్ లేకుండా అడ్మిట్ చేసుకోవడం కుదరదన్నారు. దాంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాం. తల్లితండ్రులు కానీ, సంరక్షకులు కానీ లేకుండా ఎఫ్ఐఆర్ ఫైల్ చెయ్యమని పోలీసులు చెప్పారు. ఇంతలో ఈ విషయం నేను పని చేస్తున్న కంపెనీలో తెలిసింది. నాకోసం అంబులెన్స్ పంపించారు. నన్ను సఫ్దార్‌జంగ్ ఆసుపత్రిలో చేర్చారు. ఇదంతా వాళ్ళూ వీళ్ళూ చెప్పిందే. ఎందుకంటే ఆ సంఘటన తరువాత ఆరు రోజులకు కాని నాకు స్పృహ రాలేదు. నేను మేలుకొనేసరికి మా అమ్మానాన్నా నా దగ్గరే ఉన్నారు. నా కళ్ళు బాగా దెబ్బతిన్నాయని వాళ్ళు చెబితే తెలిసింది. నాలుగు నెలలపాటు ఆసుపత్రిలోనే గడిపాను. వైద్యులు అనేక సర్జరీలు చేసినా, నా చూపు శాశ్వతంగా పోకుండా కాపాడలేకపోయారు. నామీద దాడి చేసిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అతను ఇంటికి దగ్గర్లోనే ఉండేవాడు. నన్ను పెళ్ళి చేసుకుంటానని నా రూమ్‌మేట్ ద్వారా కబురు పెట్టాడు. నాకు ఆ ఆలోచన లేదని చెప్పాను. అతను ఆ జవాబును భరించలేకపోయాడు. మరొకరి సాయంతో నా మీద యాసిడ్ దాడి చేశాడు. అరెస్టయిన ఆరు నెలల్లో జైలునుంచి బయటకు వచ్చేశాడు. కానీ నా పరిస్థితే నానాటికీ అధ్వాన్నమైపోయింది.



నా పేరు చెప్పి పిల్లల్ని భయపెట్టేవారు...

ఆసుపత్రినుంచి డిశ్చార్జి అయ్యాక... ఉత్తరాఖండ్‌లో నా స్వస్థలమైన కనాల్ గ్రామానికి వచ్చేశాను. అప్పుడే అసలు పోరాటం ప్రారంభమైంది. శరీరానికి అయిన గాయాలు ఎంతో కొంత కాలానికి ఏదో ఒక విధంగా మానిపోతాయి. మానసికమైన, భావోద్వేగపరమైన గాయాలు తగ్గడం అంత సులువు కాదు. రెండేళ్ళపాటు నా గదిలోంచి బయటకు రాలేదు. మా బంధువులు, ఇరుగుపొరుగువారు నన్ను హీనంగా చూశారు. "అల్లరి చెయ్యకుండా నిద్రపో.. లేకపోతే కవితా దీదీని పిలుస్తా" అంటూ వికృతంగా మారిన నా ముఖాన్ని గుర్తు చేసి పిల్లల్ని భయపెట్టేవారు. నాలో వేదన నానాటికీ పెరిగింది. అనేకసార్లు ఆత్మహత్యకు కూడా ప్రయత్నించాను. కానీ చావడం ఏ సమస్యకూ పరిష్కారం కాదనిపించింది. "ఎవరేమనుకున్నా సరే... నా బతుకు నాది. నా దుస్థితిని క్షణక్షణం గుర్తుచేసే మనుషులు, వాతావరణానికి దూరంగా వెళ్ళాలి. నా జీవితానికి ఒక అర్థం కల్పించుకోవాలి" అనుకున్నాను. 2011లో డెహ్రాడూన్‌లోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీకాప్డ్'లో చేరాను. కంప్యూటర్ల వినియోగం, కుట్టుపని, కొవ్వొత్తులు, ఎన్వలప్ కవర్ల తయారీ నేర్చుకున్నాను. ఆ సంస్థ నుంచి బయటకు వచ్చాక... కుట్లు, అల్లికలే నాకు జీవనోపాధి అయ్యాయి. అదే సమయంలో నాకు సందీప్ రావత్ పరిచయం అయ్యారు. ఆయన వివిధ వైకల్యాలున్న పిల్లల కోసం 'యుఎస్ఆర్ ఇందు సమితి స్కూల్' నడుపుతున్నారు. ఆ స్కూల్‌లో పిల్లలకు ఇంగ్లీష్, లెక్కలు నేర్పడం మొదలుపెట్టాను. నా ఆదాయంలో ఎక్కువ భాగం పొదుపుచేసి, ముప్ఫై మందికి పైగా పిల్లల్ని చదివిస్తున్నాను. అనేక మంది మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం, ప్రభుత్వ పథకాలు అందడం కోసం కూడా సాయపడ్డాను. ఆ తరువాత 'కవిత ఉమెన్ సపోర్ట్ హోమ్' పేరుతో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాను. దానికి అవసరమైన భూమినీ, మౌలిక సదుపాయాలను సందీప్ రావత్ సమకూర్చారు. ప్రస్తుతం గ్రామీణ మహిళలకు కుట్టుపని, బొమ్మల తయారీ తదితరాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వాళ్ళు తయారు చేసిన బొమ్మలు, కొవ్వొత్తులు, హ్యాండ్ బ్యాగ్స్‌లాంటి వస్తువులను విక్రయిస్తున్నాం. వాటివల్ల వారికి కొంత ఆదాయం లభిస్తోంది. నా గురించి తెలుసుకున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం నన్ను అభినందిస్తూ... 2015లో మహిళా సాధికారతకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ప్రస్తుతం నేను ఓపెన్ యూనివర్సిటీలో బిఎ సైకాలజీ, మరోవైపు టీచింగ్‌లో డిప్లమా చేస్తున్నాను. యాసిడ్ దాడి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. పదహారేళ్ళుగా అంధురాలుగానే జీవిస్తున్నాను. అయితే ఈ కాలంలో చాలా నేర్చుకున్నాను. నా కాళ్ళ మీద నేను నిలబడ్డాను. తోటివారికి నాకు వీలైనంత చేయూత అందిస్తున్నాను. ఇప్పుడు నా కుటుంబం నన్ను చూసి సంతోషపడుతోంది. సమాజం నన్ను గౌరవంగా చూస్తోంది. నేను నా ముఖాన్ని దాచుకోను, మేకప్ వేసుకోను, నా కళ్ళకు అద్దాలు తగిలించుకోను. 'నేను నేనుగా' ఉండడమే నాకు సంతృప్తినిస్తోంది. నేను సాధిస్తున్నవాటికి గర్వపడుతున్నాను. ధైర్యం, ఆత్మవిశ్వాసం... ఇప్పుడు అవే నా రెండు కళ్ళు."

నవ్య | చిత్రజ్యోతి



పవర్ ప్యాక్డ్ షెడ్యూల్ పూర్తి

సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'మాయావన్'. సీవీ కుమార్ దర్శకుడు. ఏకే ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేశ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. నీల్ తాజాగా తన ఫస్ట్ పవర్ ప్యాక్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్నారు. సందీప్ కిషన్, నీల్ ఈ చిత్రంలో యాక్షన్ ప్యాక్డ్ పాత్రల్లో కనిపించడానికి కొత్తగా మేకోవర్ అయ్యారు. ఆకాంక్ష రంజన్ కపూర్ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.

నిర్మాత అయిన మరో దర్శకుడు



'నేను లోకల్', 'సినిమా చూపిస్తా మావా', 'ధమాక' వంటి సూపర్ హిట్ చిత్రాలు అందించిన దర్శకుడు త్రినాథరావు నక్కిన ఇప్పుడు నిర్మాతగా మారారు. కొత్త వారిని ప్రోత్సహించడం కోసం, కొత్త టాలెంట్‌ను వెలుగులోకి తీసుకు రావడం కోసం ఆయన 'నక్కిన నరేటివ్స్' పేరుతో చిత్ర నిర్మాణ సంస్థ నెలకొల్పారు. ఈ బేనర్‌పై ఓ సినిమా కూడా ప్రారంభించేశారు. షూటింగ్ దాదాపు పూర్తయిందని నక్కిన చెప్పారు. 'న్యూ ఏజ్ కంటెంట్, అందించడంతో పాటు కొత్త వారిని ప్రోత్సహించడానికి స్థాపించిన సంస్థ ఇది. యంగ్ ట్యాలెంట్‌తో ఓ సినిమా తీశాను. త్వరలోనే టైటిల్, ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం' అని చెప్పారు.

మస్త్ షేడ్స్‌తో హలో అమ్మాయి



అభినవ్ గోమఠం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మస్త్ షేడ్స్ ఉన్నాయ్ రా'. వైశాలి రావు కథానాయిక. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి తిరుపతిరావు దర్శకుడు. భవాని కాసుల, ఆరీం రెడ్డి, ప్రశాంతి వి నిర్మాతలు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'హలో అమ్మాయి' అంటూ సాగే ఈ గీతాన్ని కిట్టు విస్సాప్రగడ రాశారు. టీ సంజీవ్ స్వరాలందించారు. సిడ్ శ్రీరామ్ అద్భుతంగా ఆలపించారు. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అలీరాజా కీలకపాత్రలు పోషిస్తున్నారు.



ఓటీటీలో రిలీజ్ చేస్కో అన్నారు

విధు వినోద్ చోప్రా

బాలీవుడ్‌లో ఇటీవల చిన్న సినిమాగా విడుదలై ఘన విజయం సాధించిన చిత్రం '12th ఫెయిల్'. పేదరికాన్ని అధిగమించి ఐపీఎస్ అధికారిగా ఎదిగిన మనోజ్‌కుమార్ శర్మ జీవిత కథ ఆధారంగా దర్శకుడు విధు వినోద్ చోప్రా రూపొందించిన సినిమా ఇది. రూ. 20 కోట్లతో నిర్మిస్తే ఇప్పటికి రూ 60 కోట్లు వసూలు చేసింది. పెద్ద చిత్రాల పోటీని తట్టుకుని బరిలో నిలిచింది. విక్రాంత్ మాస్సే, మేధా శంకర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విజయోత్సవంలో దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాను థియేటర్‌లో ఎవరూ చూడరు. మహా అయితే ఓపెనింగ్ కలెక్షన్లు ఏ రెండు లక్షలు, మొత్తం మీద రూ. 30 లక్షలు వస్తే గొప్పే. అందుకే థియేటర్‌లో కాకుండా ఓటీటీలో విడుదల చేసుకో అన్నారు చాలా మంది. వాళ్లలో నా భార్య కూడా ఉంది. అయినా కంటెంట్ మీద నమ్మకంతో నేను థియేటర్‌లోనే విడుదల చేశాను. నా సొంత డబ్బులతో పబ్లిసిటీ చేశాను. సినిమా ఫలితం ఏమిటన్నది మీ అందరికీ తెలిసిందే' అన్నారు.

హృదయానికి హత్తుకునే ట్రూ లవర్



మణికందన్, శ్రీ గౌరిప్రియ, కన్నరవి ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'ట్రూ లవర్'. నజరేత్ పసీలియన్, మగేశ్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేశన్ నిర్మించారు. ఓ విభిన్న ప్రేమకథగా దర్శకుడు వ్యాస్ రాజ్ మలిచారు. ఈ సినిమా తెలుగు వెర్షన్‌కు దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. హీరో మణికందన్ మాట్లాడుతూ 'యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ చిత్రం నచ్చుతుంది. తెలుగు నేర్చుకొని నా పాత్రకు డబ్బింగ్ చెప్పాను' అన్నారు. మారుతి మాట్లాడుతూ "ట్రూ లవర్' చూస్తుంటే నేను తీసిన 'ఈ రోజుల్లో', 'బస్టాప్' చిత్రాలు గుర్తుకొచ్చాయి. కథను హృదయానికి హత్తుకునేలా దర్శకుడు తెరకెక్కించాడు' అని చెప్పారు. ట్రూ లవర్స్ కోసం రెండు రోజులు ముందుగానే ప్రీమియర్ షోస్ వేస్తున్నామని ఎస్‌కేఎన్ తెలిపారు.



అయ్యో పాపం సారూ...

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్'. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్' అనేది ఉపశీర్షిక. దివ్య భారతి హీరోయిన్. 'పాగల్' ఫేమ్ నరేశ్ కుప్పిలి దర్శకుడు. చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా నుంచి 'అయ్యో పాపం సారూ' అంటూ సాగే గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. ఈ పాటకు సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించగా లియోన్ జేమ్స్ స్వరపరిచారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ప్రస్తుతం హీరో హీరోయిన్లపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నాం. యాక్షన్ ఎపిసోడ్స్ ఆకట్టుకుంటాయి. టెక్నికల్‌గా ఈ చిత్రం ఉన్నత స్థాయిలో ఉంటుంద'న్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రసూల్ ఎల్లోర్

మార్కెట్ మహాలక్ష్మి కథేంటి?



'కేరింత' ఫేమ్ పార్వతీశం, ప్రణీకాన్వికా జంటగా నటిస్తున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేష్ కలారు నిర్మిస్తున్నారు. హర్షవర్దన్, ముక్కు. అవినాశ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను రచయిత బీవీఎస్ రవి చేతుల మీదుగా యూనిట్ ఆవిష్కరించింది. పార్వతీశం ఈ సినిమాతో సక్సెస్ కొడతాడని దర్శకుడు తెలిపారు. మార్కెట్ మహాలక్ష్మీ అనే యువతి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా చిత్ర కథ సాగుతుందని నిర్మాత తెలిపారు.

చీటింగ్ కేసులో లంచం డిమాండ్

» 20 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహ్మదాబాద్ ఎస్సై

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4: ఓ చీటింగ్ కేసుకు సంబంధించి లంచం తీసుకుంటూ మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ ఎస్సై సురేశ్ ఏసీబీ వలలో చిక్కారు. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం పగిడ్యాల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిపై జనవరి 17న చీటింగ్ కేసు నమోదైంది. ఈ కేసు విషయంలో ఎస్సై డి.సురేశ్.. శ్రీనివాస్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డిని రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. అందుకు అంగీకరించిన కృష్ణారెడ్డి ముందుగా రూ.30 వేలు ముట్టజెప్పాడు. అయితే కొంతకాలంగా మిగతా రూ.20 వేలు ఇవ్వాలంటూ ఎస్సై బెదిరిస్తుండడంతో కృష్ణారెడ్డి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఆదివారం కృష్ణారెడ్డి రూ.20 వేలు తీసుకుని మహ్మదాబాద్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ కానిస్టేబుల్ ఇస్మాయిల్ అతణ్ని తీసుకొని, పక్కనే ఉన్న జిరాక్స్ సెంటర్‌కు తీసుకెళ్లాడు. పెండింగ్ బిల్లుల పేరిట నగదును అక్కడ ఇవ్వాలని సూచించాడు. జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడికి కృష్ణారెడ్డి డబ్బులిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ అనంతరం ఎస్సై సురేశ్‌తో పాటు కానిస్టేబుల్ ఇస్మాయిల్, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో వీఐపీ బ్రేక్ టికెట్ల విక్రయాలు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి కేటాయించే టికెట్లను భక్తులు ఇకపై ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేసేలా టీటీడీ చర్యలు తీసుకుంది. గతంలో వీఐపీ బ్రేక్ కోసం సిఫారసు లేఖలను జేఈవో కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నంలోగా అందజేస్తే అధికారుల పరిశీలన అనంతరం సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చేది. ఆ మెసేజ్‌ను ఎంబీసీ-34లోని కౌంటర్ వద్ద చూపితే నగదు తీసుకుని టికెట్ ప్రింట్ ఇచ్చేవారు. అయితే టికెట్ల కోసం భక్తులు అధిక సమయం క్యూలైన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటున్న క్రమంలో టీటీడీ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. సిఫారసు లేఖలు అందజేసిన భక్తుల సెల్‌ఫోన్‌కే ఓ లింక్‌తో కూడిన మెసేజ్‌ను పంపుతున్నారు. భక్తులు ఆ లింకు క్లిక్ చేస్తే పేమెంట్ ఆప్షన్ వస్తుంది. అక్కడ ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రెండ్రోజుల నుంచి టీటీడీ ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలుచేస్తోంది. కాగా, ఇప్పటికే ఆర్జితసేవలకు సంబంధించి టీటీడీ ఇలానే ఆన్‌లైన్ ద్వారా టికెట్లను కేటాయిస్తున్న విషయం తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 4: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్లో ఒక గుర్తు తెలియని మావోయిస్టు మృతిచెందాడు. బెజ్జి అటవీ ప్రాంతంలో కుంట ఏరియా కమిటీ ఏసీఎంలు సోడి గజేంద్ర, పొడియం హడమా, ఎల్ఓఎస్ కమాండర్ కోసీలతో కలిసి పదిహేను నుంచి 20 మంది మావోయిస్టులు సంచరిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ దళాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా నగరం-పంతాబేజీ అటవీప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. సంఘటనా స్థలంలో మావోయిస్టు మృతదేహంతోపాటు నాటు తుపాకీ, రైఫిల్, సామగ్రి దొరికాయి.

వీకెండ్ విహారం!



శని, ఆదివారాల్లో కుటుంబ సమేతంగా టూర్లకు ప్లాన్..

» యాదాద్రి, ఏడుపాయల.. తదితర పుణ్య క్షేత్రాల్లో పెరిగిన రద్దీ

» ఇదంతా మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ఫలితమే

» ఆధార్‌తో కొన్నిచోట్ల చిక్కులు.. త్వరలో 'గుర్తింపు కార్డులు'



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వారంలో ఐదు రోజులు గిర్రున తిరిగి.. శని, ఆదివారాలు వచ్చాయా? వీకెండ్‌లో మస్త్ మస్త్‌గా ఎంజాయ్ చేసేందుకు ఎక్కడికైనా వెళ్లాల్సిందే! ఇది.. బడా బాబుల్లో మామూలే. కొన్నాళ్లుగా ఈ ధోరణి మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లోనూ కనిపిస్తోంది. కారణం.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం పథకం అమల్లోకి రావడమే. శనివారం వచ్చిందంటే చాలు.. పిల్లాజెల్లాతో ఫ్యామిలీ అంతా ఇళ్లలోంచి బయటపడుతున్నారు. బస్సుల్లో ఆడవాళ్లకు ప్రయాణ ఖర్చులు లేకపోవడంతో సరదాగా సమీపంలోని పుణ్యక్షేత్రాలకో.. విహార స్థలాలకో లేదంటే పుట్టింటికో.. అత్తింటికో వెళ్లొస్తున్నారు. రెండు నెలలుగా ఉచిత ప్రయాణ టికెట్లు జారీ అవుతున్న తీరును పరిశీలిస్తే మిగతా రోజుల కన్నా మహిళల ఉచిత ప్రయాణాలు శని, సోమవారాల్లోనే భారీగా ఉంటున్నట్లు తేలింది. శనివారం ఇంట్లోంచి బయలుదేరి.. సోమవారం ఇంటికొచ్చేస్తున్నారు. భార్యాపిల్లలకు తోడుగా వెళుతుండటంతో మగవారి ప్రయాణాలూ శని, సోమవారాల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులైతే నేమీ.. చిరు వ్యాపారులైతేనేమీ.. తమ పనులకు పురుష పుంగవులు కాస్త విరామమిచ్చి కుటుంబం వెంట తరలుతున్నారు. మొత్తమ్మీద ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని రాష్ట్రంలోని మహిళలు చక్కగా వినియోగించుకుంటున్నారు. పథకం అమల్లోకొచ్చిన డిసెంబరులోనే ప్రయాణికుల సంఖ్య పెరిగితే జనవరిలో మరింత పెరిగింది. డిసెంబరు 9న నుంచి ఆ నెలాఖరు దాకా సుమారు 4కోట్ల మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. జనవరిలోనైతే ఏకంగా పది కోట్లకు పైగా ఉచిత టికెట్లు జారీ అయ్యాయి. పక్కింటి వాళ్లతోనో.. బంధువులతోనో కలిసి మహిళలు బృందాలుగా ఏర్పడి టూర్లకు బయలుదేరడంతో ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటక కేంద్రాల్లోనూ రద్దీ పెరుగుతోంది. యాదాద్రి, ఏడుపాయల, చెర్వుగట్టు, వికారాబాద్ తదితర ప్రాంతాలను సందర్శించేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో బంధు మిత్రుల ఇళ్లకు సైతం మహిళల రాకపోకలు భారీగా పెరిగాయి. ప్రధానంగా కరీంనగర్-వేములవాడ, కొండ గట్టు, గోదావరి ఖని, మంథని, కాళేశ్వరం, హైదరాబాద్-, వికారాబాద్, సంగారెడ్డి-చటాన్‌చెరు, సిద్దిపేట-హైదరాబాద్, చౌటుప్పల్-హైదరాబాద్, మహబూబ్‌నగర్-నారాయణపేట,గద్వాల్, ఆలంపూర్, హైదరాబాద్ తదితర రూట్లలో తిరిగే ఆర్టీసీ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. పెరిగిన ప్రయాణికుల డిమాండ్‌తో ఆయా ప్రధాన రూట్‌లలో ఆర్టీసీ అధికారులు అదనపు ట్రిప్పులు, ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

కొన్ని డిపోల్లో 105 శాతం ఆక్యుపెన్సీ



సాధారణ రోజుల్లో 20 లక్షల నుంచి 25 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వాడుకుంటుండగా పండుగలు, సెలవులకు ముందురోజు అమాంతంగా 30లక్షల నుంచి 32 లక్షలకు మించి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభించక ముందు అంటే 2023 డిసెంబరు 9తేదీకి ముందు ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు సగటు 65 శాతం వరకే ఉంది. ఆ తర్వాత నుంచి ఇది క్రమంగా పెరుగుతూ డిసెంబరు మూడో వారం నుంచి 85 నుంచి 90 శాతానికి చేరింది. కొన్ని డిపోల్లో 105 శాతానికి మించి నమోదైనట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. నిరుడు జనవరిలో రోజుకు సగటున 26లక్షల మందిని గమ్యస్థానాలకుచేర్చడం ద్వారా ఆర్టీసీకి సుమారు రూ.432 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ జనవరిలో రోజుకు సగటున 45 లక్షల మంది ప్రయాణించడం ద్వారా ఆర్టీసీకి రూ.584 కోట్లు వచ్చింది.



త్వరలో ఉచిత ప్రయాణ గుర్తింపు కార్డు

ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు రాష్ట్రానికి చెందిన మహిళలు విధిగా ఒరిజినల్ ఆధార్ కార్డు చూపాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేసినా కొందరు జిరాక్స్ కాపీలు, ఇతర గుర్తింపు కార్డులు చూపుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఒరిజినల్ ఆధార్‌కార్డు చూపని మహిళలు టికెట్ తీసుకోవాలంటూ కండక్టర్లు సూచిస్తే కొన్నిచోట్ల వారిని దూషిస్తూ నానాయాగీ చేస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఉచిత ప్రయాణం కోసం మహిళలకు ఆర్టీసీ.. 'ప్రత్యేక గుర్తింపు కార్డు'ను జారీ చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక సీట్లు, బస్సుల కోసం పురుషుల డిమాండ్....!

ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రావడం.. ఫలితంగా ఆర్టీసీ బస్సుల్లోని సీట్లలో మహిళలే అధిక శాతం ఆక్రమించడంతో దూర ప్రాంతాలకు వెళ్లే పురుషులకు సీట్లు దక్కడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో 33శాతం సీట్లు మహిళలకు కేటాయించినప్పటికీ 60 నుంచి 70 శాతానికి పైగా సీట్లలో మహిళలు ప్రయాణిస్తున్నారు. దీంతో పురుషులకు సైతం ప్రత్యే కించి సీట్లును రిజర్వ్ చేయాలనే ఒత్తిడి ఆర్టీసీ అధికారులపై పెరుగుతోంది. కొన్నిచోట్ల నుంచైతే పురుషులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

వ్యవసాయ శాఖలో 917 ఖాళీలు!

» కొత్త డివిజన్లు, మండలాల్లో ఇన్‌చార్జిలే దిక్కు

» ఐదేళ్లుగా కదలని పదోన్నతుల ప్రక్రియ

» పూర్తయితే మరో 539పోస్టులకు చాన్స్

» కాంగ్రెస్ పాలనలోనైనా మోక్షం కలిగేనా?

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో కొన్నేళ్లుగా పదోన్నతులు లేవు.. నియామకాలు లేవు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినా.. అందుకు తగ్గట్టుగా పోస్టుల భర్తీ చేపట్టకపోవడంతో క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 917 ఖాళీలు ఉండగా, పదోన్నతుల ప్రక్రియ పూర్తయితే మరో 539 పోస్టులు పెంచుకునే అవకాశం ఉంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పదోన్నతుల దస్త్రం ముందుకు కదల్లేదని, కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఉద్యోగులు కోరుతున్నారు. వాస్తవానికి వ్యవసాయ అనుబంధ శాఖలైన.. మార్కెటింగ్, ఉద్యాన, సహకార, పశుసంవర్థక శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ మూడేళ్ల క్రితమే పూర్తయింది. వ్యవసాయ శాఖలో మాత్రం ఈ ప్రక్రియ అటకెక్కింది. కేవలం పది రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేస్తామని, కొత్త పోస్టులు మంజూరు చేస్తామని 2021లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినా.. అది కార్యరూపం దాల్చలేదు. కనీసం సీనియారిటీ జాబితా కూడా తయారు చేయలేదు. రెండేళ్ల సర్వీసు నిండిన వారంతా ప్రమోషన్లకు అర్హులైనప్పటికీ.. ఐదేళ్లుగా ఎక్కడి వారక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతులు ఇస్తే.. 55 మందికి ఏవో నుంచి ఏడీఏగా, 47 మందికి ఏడీఏ నుంచి డీడీఏగా, 13 మందికి డీడీఏ నుంచి జేడీఏగా అవకాశం దక్కనుంది. నిబంధనల ప్రకారం ప్రతి జిల్లాకు డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారే డీఏవో (జిల్లా వ్యవసాయశాఖ అధికారి)గా ఉండాలి. కాని రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాలకు ఏడీఏ(డివిజన్)స్థాయి అధికారులే ఇన్‌చార్జి డీఏవోలుగా కొనసాగుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన వ్యవసాయ డివిజన్లకు ఏడీఏలను, కొత్తగా ఏర్పాటు చేసిన 128 మండలాలకు ఏవోలను నియమించలేదు. దీంతో అక్కడ కూడా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. వ్యవసాయశాఖలో 5,431 సాంక్షన్ పోస్టులు ఉండగా.. 4,514 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా 917 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడంతోపాటు కొత్తగా ఏర్పాటైన డివిజన్లు, మండలాలకు అధికారులను నియమిస్తే అదనంగా మరో 539 పోస్టుల భర్తీకి అవకాశం ఉంటుంది. మరోవైపు.. ఐదో జోన్, ఆరో జోన్, సూపర్ న్యూమర్ పోస్టుల సమస్య కూడా ఉంది. ఈ సమస్యలన్నీ పరిష్కరించి పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, కొత్త పోస్టులు మంజూరు చేయాలని అధికారులు కోరుతున్నారు.

చెల్లికే గౌరవం ఇవ్వని జగన్!

» అర్జునుడు ఎలా అవుతాడు?: పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): "తోడబుట్టిన సొంత చెల్లెలు వైఎస్ షర్మిలకే గౌరవం ఇవ్వలేని వాడు అర్జునుడు ఎలా అవుతాడు?" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ సీఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. చెల్లెలు షర్మిలను కొందరు నీచంగా తిడుతుంటే.. అన్నగా వారిని అడ్డుకోవాల్సింది పోయి, ఆయనే స్వయంగా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి మన ఇంట్లో ఆడపడుచులకు గౌరవం ఇస్తాడా? అని ప్రశ్నించారు. "జగన్ బాధ వర్ణనాతీతం. ఆయన్ని అందరూ ఇబ్బంది పెట్టేస్తున్నట్టు, ఆయన ఒక అర్జునుడిలాగా.. మేమంతా కౌరవుల్లాగ మాట్లాడుతున్నారు. ప్రజలే గాండీవం.. ప్రజలే ఆయుధాలు. ప్రజలే శ్రీకృష్ణుడని మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా ఉంది" అని పవన్ ఎద్దేవా చేశారు. ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమక్షంలో వైసీపీ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆయన తనయుడు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. జనసేనలో చేరిన వల్లభనేని బాలశౌరిని, ఆయన తనయుడు అనుదీప్‌ను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామన్నారు.

పాలేరు జలాశయం వద్ద ఉద్రిక్తత

» స్వయంగా గేట్లెత్తి పాతకాల్వకు నీటిని విడుదల చేసిన రైతులు..

» పోలీసుల సహకారంతో గేట్లు మూసిన అధికారులు



రైతులు బలవంతంగా గేట్లు ఎత్తడంతో పాలేరు పాతకాల్వకు వెళుతున్న సాగర్ జలాలు

కూసుమంచి, ఫిబ్రవరి 4: ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయం వద్ద ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. సాగునీటి అవసరాలకు పాలేరు నుంచి పాతకాల్వకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు నిరాకరించడంతో పెద్ద సంఖ్యలో రైతులు ఆందోళనకు దిగారు. నీటిపారుదల శాఖ సిబ్బంది నుంచి తాళాలు లాక్కొని రిజర్వాయర్ గేట్లు ఎత్తి పాత కాల్వలోకి నీటిని విడుదల చేశారు. నిజానికి, యాసంగిలో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు పాత కాల్వకు నీళ్ల విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ డ్యాం నుంచి పాలేరు జలాశయానికి ప్రస్తుతం నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాలేరు జలాశయం నీటిమట్టం 15 అడుగులకు చేరుకోగా పాతకాల్వ పరిధిలోని రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. రిజర్వాయర్ వద్దకు చేరుకుని పాతకాల్వకు నీటిని విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని నీటిపారుదల శాఖ అధికారులను హెచ్చరించారు. కానీ స్పందన లేకపోవడంతో సిబ్బంది నుంచి తాళాలు లాక్కొని స్వయంగా గేట్లెత్తి పాత కాల్వలోకి నీటిని విడుదల చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా రిజర్వాయర్ వద్దకు చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. రిజర్వాయర్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ఎత్తిన గేట్లను మూయించారు. కాగా, ప్రస్తుతం పాలేరు జలాశయం నుంచి ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు తాగు నీటిని అందిస్తున్నామని, అందువల్ల సాగునీటిని ఇవ్వలేమని అధికారులు తెలిపారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెండు, మూడు రోజుల్లో రైతుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. అయితే, పాలేరు పాతకాల్వ పరిధిలో సుమారు 15వేల ఎకరాల్లో వరి, చెరుకు సాగవుతోందని, ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉందని రైతులు తెలిపారు. తక్షణమే నీటిని విడుదల చేయకపోతే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యను అర్థం చేసుకుని నీటి విడుదలకు చొరవ తీసుకోవాలని కోరారు. పాత కాల్వకు నాలుగు రోజుల పాటు కనీసం 50 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేయాలని వేడుకున్నారు.

రాజకీయాల్లోకి వెళ్తున్నా

» త్వరలో ఉద్యోగానికి రాజీనామా.. ఇక ప్రజాసేవలోనే

» కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కాదు.. పార్టీలోనూ స్వేచ్ఛ: గడల

హైదరాబాద్/వేములవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇకమీదట ప్రజాసేవకే అంకితమవుతానని ప్రజారోగ్య శాఖ మాజీ సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు వెల్లడించారు. రాజకీయాల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నానని, త్వరలోనే ఉద్యోగానికి రాజీనామా చేస్తానని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సిరిసిల్ల జిల్లా వేములవాడలో మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్ర భవనం 11వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యానని.. ఆ పవిత్ర పుణ్య క్షేత్రంలోనే కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజన్న సన్నిధి నుంచి రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని ప్రకటించారు. రాజకీయ అరంగేట్రం గురించి ప్రకటించడానికి ఇదే మంచి సందర్భంగా భావించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కాదు.. పార్టీలో కూడా స్వేచ్ఛ, గౌరవం ఉంటాయని అన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంలో చాలా సంతృప్తి ఉంటుందన్నారు. కొత్తగూడెంలో తన తండ్రి పేరిట నెలకొల్పిన ట్రస్టు ద్వారా కూడా అనేక సేవ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని డాక్టర్ గడల గుర్తు చేశారు. ఖమ్మం లేదా సికింద్రాబాద్ ఎంపీ టికెట్‌కు కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తు చేసుకున్నానని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ భావజాలం, సిద్ధాంతాలపై నమ్మకం ఉందని.. టికెట్ వస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు చేయగానే తన నిబద్ధతను కొంతమంది ప్రశ్నిస్తున్నారని, తాను ఎక్కడున్నా విధేయతతోనే ఉంటానన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయడం ఉద్యోగ ధర్మం అని, ఇన్నాళ్లు తాను అదే చేశానని చెప్పారు. రాష్ట్రంలో మున్నూరు కాపు జనాభా పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, అసెంబ్లీలో ప్రాతినిధ్యం అత్యల్పంగా ఉండడం బాధాకరమన్నారు. బీసీలు సంఘటితమై రాజ్యాధికార సాధనకు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. కాగా, డాక్టర్ గడలకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తీన్మార్ మల్లన్న స్వాగతం పలికారు.

అర్ధరాత్రి హాస్టల్లోకి ఆటో డ్రైవర్లు!

విద్యార్థినులతో అనుచిత ప్రవర్తన.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని వార్డెన్

» భువనగిరిలో ఇద్దరు బాలికల ఆత్మహత్యపై అనుమానాలు

» ఆస్పత్రి వద్ద పార్టీల నేతలు, పలు సంఘాల ఆందోళనలు

» తీవ్రంగా హింసించడంతోనే మృతి

» నిర్వాహకుల్లో ఐదుగురిపై భవ్యశ్రీ, వైష్ణవి తల్లిదండ్రుల ఫిర్యాదు



ఆత్మహత్య చేసుకున్న భవ్యశ్రీ, వైష్ణవి (ఫైల్)

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 4: చక్కని వసతి.. కడుపునిండా భోజనం దొరికితే.. ఇంకా మంచిగా చదువు అబ్బుతుందనే ఆశతో తమ పిల్లల్ని హాస్టల్లో చేర్పిస్తే, నిర్వాహకులే తమ బిడ్డల ప్రాణాలు తీశారని కోడి భవ్యశ్రీ (15), గాదె వైష్ణవి (15) నిరుపేదలైన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులు, ఒకే గదిలో ఉంటున్న భవ్యశ్రీ, వైష్ణవి శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం సంచలనం సృష్టించింది. వీరి బలవన్మరణానికి తోటి విద్యార్థినులతో గొడవ పడటమే కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమైనా.. ఆ ఘటన జరిగి 15 రోజులవుతోందని.. ఆత్మహత్య వెనుక 'బలమైన వేరే కారణాలు' ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవ్యశ్రీ, వైష్ణవితో ఘర్షణ పడిన ఇతర బాలికలు ఇచ్చిన ఫిర్యాదుపై హాస్టల్ వార్డెన్ శైలజ, పీఈటీ ప్రతిభ శనివారం ఉదయం కౌన్సెలింగ్ చేయడం.. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడటం అనుమానాలకు తావిస్తోంది. వంట సిబ్బందిని కలిసే నెపంతో అర్ధరాత్రి వేళల్లో కొందరు ఆటోడ్రైవర్లు హాస్టల్లోకి చొరబడి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించేవారని ఆరోపణలున్నాయి. ఆటోడ్రైవర్ల జుగుప్సాకరమైన ప్రవర్తన గురించి భవ్యశ్రీ, వైష్ణవితో పాటు ఇతర విద్యార్థినులు ఫిర్యాదులు చేసినా వార్డెన్ పట్టించుకోలేదని, ఈ కారణంతోనే భవ్యశ్రీ, వైష్ణవి తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

భవ్యశ్రీ మృతదేహంపై గాయాలు

భవ్యశ్రీ.. హాస్టల్‌లో జరుగుతున్న ఘటనలపై 15 రోజుల క్రితం ఫోన్ ద్వారా చెప్పింది. హాస్టల్‌ను, పాఠశాలను వదిలేసి ఇంటి వద్దే చదువుకొని పరీక్షలు రాస్తానని అడిగింది. మేమే నచ్చచెప్పి హాస్టల్‌లోనే ఉంచాం. భవ్యశ్రీ కాళ్లు, చేతులు, మెడపై గాయాలున్నాయి. హాస్టల్ వంట గదిలో జరుగుతున్న అకృత్యాలపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలి.

\- కోడి లలిత, భవ్యశ్రీ తల్లి

మొత్తంగా మా కుటుంబమే పోయింది

ఇప్పటికే భార్య, కుమారుడిని కోల్పోయిన నేను మిగిలి ఉన్న కుమార్తె వైష్ణవి కోసమే బతుకుతున్నాను.. ఆ ఒక్క ఆశా దీపం ఆరిపోవడంతో నేను బతికి ఉండటం దండగ అనిపిస్తోంది. భవ్యశ్రీ, వైష్ణవి మంచి మిత్రులు. బాగా చదువుకునే వారు. మావి పేద కుటుంబాలు కావడంతో ఉన్నత చదువులకోసం హాస్టల్‌లో చేర్పించాం. హాస్టల్‌లో నెలకొన్న విపరిణామాలతోనే పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి.

\- గాదె రాజు, వైష్ణవి తండ్రి

ఆస్పత్రి వద్ద ఆందోళనలు



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

భవ్యశ్రీ, వైష్ణవి మృతదేహాలను పోస్టుమార్టం కోసం శనివారం అర్ధరాత్రి దాటాక జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ మృతుల తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదించడం అక్కడివారిని కలిచివేసింది. తమ పిల్లలు ఆత్మహత్య చేసుకునేంత పిరికివారు కాదని, తీవ్రంగా హింసించడంతోనే ప్రాణాలు కోల్పోయారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు హాస్టల్ వార్డెన్ శైలజ, హాస్టల్ ట్యూటర్ భువనేశ్వరి, బాలికల ఉన్నత పాఠశాల పీఈటీ ప్రతిభ, ఆటో డ్రైవర్ ఆంజనేయులు, వంట మనిషి సుజాతపై అనుమానాలున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆస్పత్రి వద్ద బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం నేతలు.. పలు సంఘాల కార్యకర్తలు ఆందోళనలు చేశారు. కాగా హాస్టల్‌ను క్లూస్‌టీం సందర్శించి ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బిజినెస్

వరంగల్ ● సోమవారం 5 ఫిబ్రవరి 2024

అపోలో మైక్రోసిస్టమ్స్ లాభంలో 35 శాతం వృద్ధి

హైదరాబాద్: అపోలో మైక్రోసిస్టమ్స్ లిమిటెడ్ (ఏఎంఎస్ఎల్) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.91.84 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.10 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.6.60 కోట్లు)తో పోల్చితే లాభం 35 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం వ్యయాలు రూ.71.73 కోట్ల నుంచి రూ.77.46 కోట్లకు పెరిగాయని కంపెనీ పేర్కొంది. ఏరోస్పేస్, రక్షణ, ట్రాన్స్‌పోర్టేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలకు అవసరమైన టెక్నాలజీ సొల్యూషన్లను ఏఎంఎస్ఎల్ అందిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ		విజయవాడ	538
హైదరాబాద్	535	విశాఖపట్నం	555
5వ తేదీ		వరంగల్	537
చిత్తూరు	573	దజను గుడ్లు రూ.72	
గోదావరి	538		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	111	గోదావరి	113
వరంగల్	111	విజయవాడ	113
కరీంనగర్	111	గుంటూరు	117
మహబూబ్‌నగర్	111	ఒంగోలు	117
కర్నూలు	111	చిత్తూరు	123
విశాఖపట్నం	107		

ఈసారికీ అంతే

రెపో రేట్లలో యథాతథ స్థితి!

8న ఆర్‌బీఐ పాలసీ

ముంబై/న్యూఢిల్లీ: ఈ వారంలో జరగబోయే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో కూడా కీలక రెపో రేటు విషయంలో యథాతథ స్థితికే మొగ్గుచూపే ఆస్కారం ఉందంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇదే చివరి ఎంపీసీ సమావేశం. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలోని ఎంపీసీ మంగళవారం నుంచి మూడు రోజుల పాటు దేశీయంగాను, అంతర్జాతీయంగాను తాజా ఆర్థిక స్థితిని, ద్రవ్యోల్బణం తీరుతెన్నులను సమీక్షించనుంది. సమీక్ష అనంతరం గురువారం (8వ తేదీ) ఉదయం దాస్ ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు. ఇప్పటికీ రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి పరిధిలో గరిష్ఠ స్థాయిలోనే ఉన్నందు వల్ల ఈ సారి కూడా రెపో రేటు తగ్గింపు అవకాశాలు ఇంచుమించుగా లేనట్టేనన్నది ఆర్థిక నిపుణుల అభిప్రాయం. సుమారు ఏడాది కాలంగా ఆర్‌బీఐ రెపో రేటును ఎలాంటి మార్పులు లేకుండా 6.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తోంది. చివరిసారిగా గత ఏడాది ఫిబ్రవరి పాలసీలో రెపో రేటును 6.25 శాతం నుంచి 6.5 శాతానికి పెంచారు. గత ఏడాది జూలైలో గరిష్ఠ స్థాయి 7.44 శాతం నుంచి తగ్గుతూ వస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు నెలలో 5.69 శాతం వద్ద ఉంది. ఆర్‌బీఐ అంచనాల ప్రకారం జూన్ చివరి వరకు ద్రవ్యోల్బణం 5 శాతం కన్నా పైనే ఉండవచ్చు. దీనికి తోడు వృద్ధి కూడా బలంగానే ఉన్నందు వల్ల రేట్ల తగ్గింపునకు తక్షణ ఒత్తిడి కూడా ఏమీ లేదన్నది విశ్లేషకుల అభిప్రాయం.

ఎన్ఎఫ్ఐఆర్ ముసాయిదా బిల్లు రెడీ: నేషనల్ ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ రిజిస్ట్రీ (ఎన్ఎఫ్ఐఆర్) ఏర్పాటుకు వీలు కల్పించే ముసాయిదా బిల్లు సిద్ధమైందని, జూలై సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంటులో ప్రతిపాదించే ఆస్కారం ఉన్నదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. రుణ సంబంధిత సమాచారం సిద్ధం చేయడం కోసం ప్రభుత్వ నిర్వహణలోని సంస్థ ఒకటి ఏర్పాటు చేయడం, ఎన్ఎఫ్ఐఆర్‌గా వ్యవహరించే ఆ సంస్థ ద్వారా లెండింగ్ ఏజెన్సీలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉంచడం దీని లక్ష్యం.

ముకేశ్ అంబానీ బ్రాండింగ్ అదుర్స్



ప్రపంచంలో రెండో స్థానంలో అంబానీ

న్యూఢిల్లీ: సంపద సృష్టిలోనే కాదు, బ్రాండ్ ఇమేజీ సృష్టికర్తగానూ రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మరోసారి తన సత్తా చాటారు. బ్రాండ్ ఫైనాన్స్ అనే సంస్థ ప్రపంచంలోని మేటి సంస్థల సీఈఓలతో రూపొందించిన బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్-2024లో ముకేశ్ అంబానీకి మన దేశం నుంచి ఒకటో స్థానం, ప్రపంచ సీఈఓల జాబితాలో రెండో స్థానం దక్కింది. అంబానీ ఈ ఇండెక్స్‌లో రెండో స్థానం సంపాదించడం వరుసగా ఇది రెండో సంవత్సరం. చైనా ఎలక్ట్రానిక్ దిగ్గజం టెన్సెంట్ చీఫ్ హువాటెంగ్ మా కేవలం 1.3 శాతం అధిక స్కోరుతో అంబానీని తోసిపుచ్చి ప్రథమ స్థానంలో నిలిచారు.

సత్య నాదెళ్లను అధిగమించి: బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్-2024లో ముకేశ్ అంబానీ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌లను వెంచిపోయారు. ఉద్యోగులు, మదుపరులు, ఇతర స్టేక్ హోల్డర్లు, సామాజిక ప్రయోజనాలను సమతౌల్యం చేస్తూ కంపెనీ సుస్థిర అభివృద్ధికి దోహదం చేసే సీఈఓలకు ఈ ఇండెక్స్‌లో స్థానం లభిస్తుంది. కాగా గత ఏడాది ఈ ఇండెక్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్న టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఈ సంవత్సరం ఐదో స్థానానికి ఎదిగారు. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) చీఫ్ అనీష్ షా, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ వరుసగా 6, 16వ స్థానాల్లో నిలిచారు.

'పేటీఎం'కు గుడ్‌బై చెప్పండి

ఇతర యాప్‌లకు మళ్లండి.. ట్రేడర్లకు సీఏఐటీ సూచన

న్యూఢిల్లీ: పేటీఎం సంక్షోభం దేశంలోని చిరు వ్యాపారులనూ భయపెడుతోంది. వ్యాపారులు, చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తమ వ్యాపార లావాదేవీల కోసం పేటీఎం యాప్‌నకు గుడ్‌బై చెప్పి, ఇతర పేమెంట్ యాప్‌లకు మారాలని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) తన సభ్యులకు సూచించింది. పేటీఎం వ్యాలెట్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో సీఏఐటీ ఈ సూచన చేసింది. వ్యాపారుల నిధులకు భద్రతతో పాటు ఆర్థిక లావాదేవీలకు అంతరాయం లేకుండా ఉండేందుకు ఈ చర్యలు అవసరమని తెలిపింది. పేటీఎం వ్యాలెట్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ద్వారా అక్రమ నగదు లావాదేవీలు, రూ.వందల కోట్ల విలువైన అనుమానాస్పద లావాదేవీలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 29 నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్.. కొత్త డిపాజిట్ల స్వీకరణ, రుణ లావాదేవీలు, టాప్-అప్స్ నిలిపివేయాలని ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే.

డిపాజిట్ల సేకరణలో బీఓఎందే పైచేయి

న్యూఢిల్లీ: దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ల సేకరణలో వృద్ధిపరంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) అగ్రగామిగా ఉంది. పలు బ్యాంకులు డిపాజిట్ల సేకరణలో ఎదురీదుతున్న సమయంలో బీఓఎం, ఎస్‌బీఐ మాత్రమే డిసెంబరు త్రైమాసికంలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోగలిగినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. డిపాజిట్ల సేకరణలో బీఓఎం 17.89 శాతం వృద్ధిని నమోదు చేయగా ఎస్‌బీఐ 12.84 శాతం వృద్ధిని నమోదు చేసింది.

ఆయిల్ కంపెనీల పెట్టుబడి రూ.1.2 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఐఓసీ, ఇతర ఆయిల్ కంపెనీలు పెద్దఎత్తున పెట్టుబడులకు సిద్ధమవుతున్నాయి. ఈ పెట్టుబడులు ఎంత లేదన్నా రూ.1.2 లక్షల కోట్ల వరకు ఉంటాయని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 5% ఎక్కువ. ఈ రూ.1.2 లక్షల కోట్లలో రూ.30,800 కోట్లు ఓఎన్‌జీసీ, ఓఎన్‌జీసీ విదేశ్ రూ.5,580 కోట్లు, ఐఓసీ రూ.30,910 కోట్లు, బీపీసీఎల్ రూ.13,000 కోట్లు, గెయిల్ రూ.8,000 కోట్లు, హెచ్‌పీసీఎల్ రూ.12,500 కోట్లు, ఆయిల్ ఇండియా రూ.6,880 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నాయి.

22,250 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 5-9 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 21,854-21,450 పాయింట్ల మధ్యన కదలాడి 501 పాయింట్ల లాభంతో 21,854 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,599, 21,205,20,092, 19,652 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,450

నిరోధ స్థాయిలు: 22,050, 22,150, 22,250 (21,950 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 21,650, 21,550, 21,450 (21,750 దిగువన బేరిష్)

లాభాల బాటలోనే..!

రెండు వారాల వరుస నష్టాల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బయటపడ్డాయి. ఒడుదొడుకులకు లోనైనప్పటికీ బడ్జెట్ వారంలో అదరగొట్టాయి. ఈ వారం కూడా అదే జోరును కనబరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలక నిరోధ స్థాయిలను అధిగమించిన నిఫ్టీ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు పుంజుకోవటం, హెవీవెయిట్ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరటం ఇందుకు దోహదం చేసింది. నిఫ్టీ ఫిబ్రవరి ఫ్యూచర్స్ నిరోధ స్థాయి 22,200, మద్దతు స్థాయి 21,880 వద్ద ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

వీగార్డ్ ఇండస్ట్రీస్: డిసెంబరు త్రైమాసికంలో ఈ కంపెనీ అంచనాలను మించి ఫలితాలను ప్రకటించింది. దీంతో ఈ కౌంటర్‌లో మూమెంటమ్ పెరిగింది. గత 8 నెలలుగా ఈ షేరు రూ.280 స్థాయిలో కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.310 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.300/305 స్థాయిల్లో ప్రవేశించి రూ.355/380 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.290 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

అదానీ పోర్ట్స్: చివరి ఏడు సెషన్ల నుంచి ఈ షేరు పూర్తిగా బుల్లిష్‌నెస్‌ను ప్రదర్శిస్తూ వస్తోంది. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు విడుదల చేసినప్పటి నుంచి అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తోంది. గత శుక్రవారం రూ.1,261 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ట్రేడర్లు రూ.1,250/1,260 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,330/1,420 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌టీపీసీ: గత రెండేళ్లుగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. త్రైమాసిక ఫలితాలు విడుదల చేసిన ప్రతిసారి ఈ షేరు దూసుకుపోతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు, డివిడెండ్ ప్రకటనతో గత రెండు వారాలుగా ఈ షేరు మరింత దూకుడును ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 3.26 శాతం లాభంతో రూ.332.50 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.330/325 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.365/395 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.314 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా స్టీల్: త్రైమాసిక ఫలితాలు విడుదలైనప్పటి నుంచి ఈ కౌంటర్‌లో బుల్‌రన్ మొదలైంది. కొన్ని రోజులుగా ఒడుదొడుకులు ఎదురవుతున్నా ప్రస్తుతం నిలదొక్కుకుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.138.70 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.135 స్థాయిలో ప్రవేశించి రూ.155/170 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.129 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: ఈ ఏడాది ఆరంభం నుంచి స్వల్పకాలిక డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేరు ప్రస్తుతం పుంజుకుంటోంది. త్వరలో కంపెనీ క్యూ3 ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.583 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.580/570 శ్రేణిలో ఎంటర్ అయి రూ.625/655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.555 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

జీవితకాల గరిష్ఠంలో అప్రమత్తం



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 21,500 వద్ద బలమైన అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై చివరికి జీవితకాల గరిష్ఠ స్థాయి 22,125 వరకు వెళ్లింది. కాని బలమైన ఇంట్రాడే రియాక్షన్‌తో 300 పాయింట్లు నష్టపోయింది. అయినా ముందు వారంతో పోల్చితే 500 పాయింట్లకు పైగా లాభపడి 21,850 వద్ద ముగిసింది. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతను ఇది సూచిస్తోంది. మార్కెట్ ఇక్కడ స్వల్పకాలిక నిరోధం ఏర్పరచుకునేందుకు ఇది సంకేతం. అందువల్ల స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. రాబోయే కొద్ది రోజుల్లో కన్సాలిడేషన్ లేదా కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ సానుకూలంగానే ఉంది. గత నాలుగు వారాలుగా మార్కెట్ 22,000-21,000 పాయింట్ల మధ్యన కదలాడుతోంది. మరోసారి స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే రాబోయే కొద్ది రోజుల్లో ఇక్కడ బలం ప్రదర్శించడం తప్పనిసరి. ట్రెండ్‌లో స్పష్టత కోసం కొంత సమయం పట్టవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన మానసిక అవధి 22,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన నిరోధం 22,150. ఇదే జీవితకాల గరిష్ఠ స్థాయి. గత నెలలో రెండు సార్లు ఇక్కడ నుంచే బలమైన కరెక్షన్ ఏర్పడింది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 21,650 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21,400. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 1,000 పాయింట్ల లాభంతో 45,950 వద్ద ముగిసింది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే తదుపరి నిరోధం 46,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 47,100. బలహీనపడి మద్దతు స్థాయి 45,600 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్‌కు 22,150 వద్ద డబుల్ టాప్ ఏర్పడింది. ఇక్కడే అప్రమత్త ట్రెండ్ కనిపించింది. కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. మరింత స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించి కొత్త శిఖరాల దిశగా పయనం సాగించాలంటే 22,150 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి లేదా బ్రేకౌట్ చేయాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	22,000, 22,080
మద్దతు:	21,860, 21,800

www.sundartrends.in

స్పోర్ట్స్




విజయం పరిపూర్ణం

- దేవిస్ కప్ పోరులో పాకిస్థాన్ చిత్తు
- వరల్డ్ గ్రూప్-1కు భారత్ అర్హత

ఇస్లామాబాద్: డేవిస్ కప్‌లో పాకిస్థాన్‌పై తనకు తిరుగు లేదని భారత్ మరోసారి నిరూపించింది. తాజా పోరుకు ముందు ఏడుసార్లు దాయాదితో తలపడగా..అన్నిసార్లూ మనోళ్లదే విజయం. ఆదివారంనాటిది 8వ గెలుపు. ఈ విజయంతో మనోళ్లు వరల్డ్ గ్రూప్-1లో తలపడేందుకు అర్హత సాధించారు. ఇక..60 ఏళ్ల తర్వాత పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టిన భారత జట్టు 4-0తో ప్రత్యర్థిని చిత్తుచేసి ఈ పర్యటనను చిరస్మరణీయం చేసుకుంది. శనివారం రెండు సింగిల్స్‌లో గెలిచి 2-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఇక రెండోరోజు..డబుల్స్ మ్యాచ్‌లో యుకీ బాంబ్రి/సాకేత్ మైనేని ద్వయం 6-2, 7-6 (5)తో ముజావిల్ ముర్తజా/అకీల్ ఖాన్ జోడీని ఓడించింది. ఇక..అంతగా ప్రాధాన్యంలేని నాలుగో మ్యాచ్‌లో తాను ఆడతానని భారత ఆటగాడు పూనాచా కోరడంతో ఆ మ్యాచ్‌ని నిర్వహించారు. 28 ఏళ్ల పూనాచా 6-3, 6-4తో షోయబ్‌పై సునాయాసంగా నెగ్గడంతో భారత్ విజయం పరిపూర్ణమైంది. దీంతో చివరి రివర్స్ సింగిల్స్‌ను ఆడించలేదు.

కేన్, రచిన్ శతకమోత

- న్యూజిలాండ్ 258/2 ● సౌతాఫ్రికాతో తొలి టెస్టు



మౌంట్ మాంగనుయ్: కేన్ విలియమ్సన్ (112 బ్యాటింగ్), రచిన్ రవీంద్ర (118 బ్యాటింగ్) అజేయ శతకాలతో.. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఆదివారం ఆరంభమైన మ్యాచ్‌లో మొదటి రోజు ఆటముగిసే సరికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 258/2 స్కోరు చేసింది. క్రీజులో ఉన్న కేన్, రచిన్ మూడో వికెట్‌కు అభేద్యంగా 219 పరుగులు జోడించారు. కేన్‌కు టెస్టుల్లో ఇది 30వ శతకం. ఈ క్రమంలో 29 శతకాల వీరులు డాన్ బ్రాడ్‌మన్, విరాట్ కోహ్లీలను అధిగమించాడు.

తొలిసారి భార్య ఫొటో షేర్ చేశాడు



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ తన 8వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా భార్య సఫా బేగ్‌తో కలిసున్న ఫొటోను పోస్ట్ చేశాడు. గతంలోనూ ఇర్ఫాన్ భార్యతో ఉన్న ఫొటోలను షేర్ చేసినా.. అందులో ఆమె ముఖం కనిపించేది కాదు. దీంతో అతనిపై చాలా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు తొలిసారి భార్య ముఖం కనిపించేలా ఉన్న ఫొటోను షేర్ చేసి అభిమానులను సర్‌ప్రైజ్ చేశాడు. సౌదీ మోడల్ సఫాను ఇర్ఫాన్ 2016లో వివాహం చేసుకొన్నాడు.

ఇక..బౌలర్ల చేతుల్లో

ఇంగ్లండ్ లక్ష్యం 399 • ప్రస్తుతం 67/1

భారత్ రెండో ఇన్నింగ్స్ 255 • గిల్ శతకం

రెండో టెస్టు



శుభ్‌మన్ గిల్ (104)

సాగర తీరాన రెండో టెస్టు అత్యంత ఆసక్తికరంగా సాగుతోంది. లక్ష్యం 399 పరుగులైనా.. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్ అభిమానుల్లో గుబులు పుట్టిస్తుండగా..వారి దూకుడుకు చెక్ పెట్టేందుకు భారత బౌలర్లు సైతం ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సోమవారం ఆట ఎలాంటి మలుపులు తీసుకుంటుందన్నది ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఫామ్ కోల్పోయి తంటాలు పడుతూ.. జట్టులో చోటు అవసరమా? అనే విమర్శలకు శుభ్‌మన్ గిల్ (147 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 104) చెక్ పెట్టాడు. దాదాపు ఏడాది తర్వాత కెరీర్‌లో మూడో శతకంతో ఆకట్టుకున్నాడు. అతడి ఆటతీరుతోనే ఇంగ్లండ్ ముందు 399 పరుగుల రికార్డు ఛేదన చేరింది. అయితే ఈ లక్ష్యాన్ని ప్రత్యర్థి ఇప్పటికే ఓవర్‌కు 4.79 రన్‌రేట్‌తో ఆరంభించింది. మూడో రోజు ఆదివారం ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 14 ఓవర్లలోనే 67/1 స్కోరుతో ఉంది. ఓపెనర్లు క్రాలే (29 బ్యాటింగ్), డకెట్ (28) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. విజయానికి ఇంకా 332 పరుగుల దూరంలో ఉన్న ఇంగ్లండ్‌కు మరో రెండు రోజుల సమయం ఉండగా.. భారత్ 9 వికెట్ల దూరంలో ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు ప్రమాదకరంగా కనిపించకపోవడంతో బంతికి, బ్యాట్‌కు మధ్య సమరంలో విజేత ఎవరో తేలనుంది. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 78.3 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. గిల్‌కు జతగా అక్షర్ పటేల్ (45) మాత్రమే ఆకట్టుకోగలిగాడు. స్పిన్నర్ హార్ట్‌లీకి 4, రెహాన్‌కు 3, అండర్సన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

గిల్ అండగా..: ఓవర్‌నైట్ స్కోరు 28/0తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత బ్యాటర్లు ఎప్పటిలాగే తడబడ్డారు. అయితే ఈసారి గిల్ ఆదుకున్నాడు. గత 12 ఇన్నింగ్స్‌లో కనీసం అర్ధసెంచరీ కూడా చేయలేకపోయిన అతను ఈసారి పూర్తి సాధికారికంగా బ్యాటింగ్ కొనసాగించాడు. తీవ్ర ఒత్తిడిలోనే క్లాస్ ఇన్నింగ్స్ చూపుతూ కీలకమైన శతకంతో జట్టును పటిష్ఠ స్థితిలో నిలపడమే కాకుండా జట్టులో తన చోటును పదిలం చేసుకున్నాడు. గిల్ తర్వాత అక్షర్‌దే అత్యధిక స్కోరు. చివర్లో అశ్విన్ (29) పోరాటం ఆధిక్యాన్ని పెంచేందుకు తోడ్పడింది. వాస్తవానికి టీ బ్రేక్ సమయానికే భారత్ ఆధిక్యం 370 పరుగులకు చేరింది. చేతిలో మరో 4 వికెట్లున్నాయి. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్ ముందు తాము ఎంత ఆధిక్యంలో ఉన్నా ప్రమాదమే అనే ఆందోళన భారత జట్టులో కనిపించింది. కానీ మరో 28 పరుగులు చేసి మిగతా వికెట్లను కోల్పోవడంతో ఆధిక్యం 400లోపే ముగిసింది. ఆరంభంలోనే కెప్టెన్ రోహిత్ (13), డబుల్ సెంచరీ హీరో యశస్వీ జైస్వాల్ (17)లను వరుస ఓవర్లలో పేసర్ అండర్సన్ పెవిలియన్‌కు చేర్చాడు. గిల్ ఆరంభంలో నెమ్మదిగా ఆడినా కుదురుకున్నాక ఆత్మవిశ్వాసంతో షాట్లు ఆడాడు. శ్రేయాస్ అయ్యర్(29)తో కలిసి మూడో వికెట్‌కు 81 పరుగులు జోడించాడు. మిడాఫ్ నుంచి వెనక్కి పరిగెడుతూ స్టోక్స్ అందుకున్న సూపర్ క్యాచ్‌తో శ్రేయాస్ వెనుదిరిగాడు. రజత్ (9) విఫలం కాగా.. అక్షర్ బ్యాటింగ్ సత్తాను మరోసారి నిరూపించుకున్నాడు. రెండో సెషన్‌లో గిల్ స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుంటూ పరుగులు సాధించాడు. రెహాన్ ఓవర్‌లో 6,4,4తో చెలరేగి 14 రన్స్ సాధించిన గిల్ కాసేపటికే శతకం కూడా పూర్తి చేశాడు. కానీ ఊపు మీదున్న అతడిని బషీర్ వెనక్కిపంపాడు. అప్పటికే అక్షర్‌తో కలిసి గిల్ ఐదో వికెట్‌కు 89 పరుగులు జోడించడం విశేషం. అటు చక్కగా కుదురుకున్న అక్షర్ సైతం స్వల్ప వ్యవధిలోనే హార్ట్‌లీకి చిక్కాడు. ఇక ఆఖరి సెషన్ ఆరంభ రెండు ఓవర్లలోనే భరత్ (6), కుల్దీప్ (0) వికెట్లను భారత్ కోల్పోయింది. ఈ దశలో అశ్విన్‌కు బుమ్రా (26 బంతుల్లో 0) అండగా నిలవడంతో తొమ్మిదో వికెట్‌కు 26 పరుగులు సమకూరాయి.

3 ఇంగ్లండ్ జట్టు నాలుగో ఇన్నింగ్స్‌లో ఇప్పటికే మూడుసార్లు 399+ స్కోర్లు సాధించింది.

టెస్టుల్లో ఇంగ్లండ్ అత్యధిక ఛేదన (378) రికార్డు భారత్‌పైనే ఉంది. అయితే ఇప్పటిదాకా భారత గడ్డపై ఏ పర్యాటక జట్టూ 300+ రన్స్‌ను ఛేదించలేదు.

వైజాగ్‌లో ఆడకపోతే అంతే..

గతేడాది మార్చి నుంచి గిల్ టెస్టుల్లో పేలవ ప్రదర్శన కొనసాగిస్తున్నాడు. దీంతో వైజాగ్ టెస్టుకు ముందు టీమ్ మేనేజ్‌మెంట్ అతడికి అల్టిమేటం జారీ చేసినట్టుగా సమాచారం. ఒకవేళ రెండో టెస్టులో విఫలమైతే వేటు ఖాయమయ్యేదట. అదే జరిగితే ఈనెల 9 నుంచి గుజరాత్‌తో జరిగే రంజీ మ్యాచ్‌లో పంజాబ్ తరఫున బరిలోకి దిగాల్సిందేనని గిల్ తన కుటుంబసభ్యులకు కూడా తెలిపినట్టు మీడియా కథనం. కానీ ఒత్తిడిలోనూ అద్భుత ఆటతీరుతో చెలరేగిన గిల్.. కీలక సమయంలో సెంచరీతో రాణించి జట్టులో తన స్థానానికి ఢోకా లేకుండా చేసుకున్నాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 253

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) అండర్సన్ 17; రోహిత్ (బి) అండర్సన్ 13; గిల్ (సి) ఫోక్స్ (బి) బషీర్ 104; శ్రేయాస్ (సి) స్టోక్స్ (బి) హార్ట్‌లీ 29; రజత్ (సి) ఫోక్స్ (బి) రెహాన్ 9; అక్షర్ (ఎల్బీ) హార్ట్‌లీ 45; భరత్ (సి) స్టోక్స్ (బి) రెహాన్ 6; అశ్విన్ (సి) ఫోక్స్ (బి) రెహాన్ 29; కుల్దీప్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 0; బుమ్రా (సి) బెయిర్‌స్టో (బి) హార్ట్‌లీ 0; ముకేశ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 78.3 ఓవర్లలో 255 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-29, 2-30, 3-111, 4-122, 5-211, 6-220, 7-228, 8-229, 9-255, 10-255. **బౌలింగ్:** అండర్సన్ 10-1-29-2; బషీర్ 15-0-58-1; రెహాన్ 24.3-5-88-3; రూట్ 2-1-1-0; హార్ట్‌లీ 27-3-77-4.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బ్యాటింగ్) 29; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రెహాన్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 14 ఓవర్లలో 67/1. వికెట్ పతనం:** 1-50. **బౌలింగ్:** బుమ్రా 5-1-9-0; ముకేశ్ 2-0-19-0; కుల్దీప్ 4-0-21-0; అశ్విన్ 2-0-8-1; అక్షర్ 1-0-10-0.

రూట్‌కు గాయం



ఇంగ్లండ్ వెటరన్ బ్యాటర్ జో రూట్ చేతి వేలికి గాయం కావడంతో ఆదివారం తొలి సెషన్‌లోనే మైదానం వీడాడు. 18వ ఓవర్‌లో గిల్ క్యాచ్‌ను స్లిప్‌లో అందుకునే క్రమంలో గాయపడిన రూట్ తిరిగి ఫీల్డింగ్‌కు రాలేదు. అయితే అంతర్గత గాయం కాకపోవడంతో రూట్ బ్యాటింగ్‌కు దిగుతాడని ఇంగ్లండ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది.

బుల్స్, జెయింట్స్ జయకేతనం



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ సీజన్-10 పదోవారం ముగింపు పోటీల్లో బెంగళూరు బుల్స్, గుజరాత్ జెయింట్స్ జట్లు విజయఢంకా మోగించాయి. ఆదివారం జరిగిన పోరులో బెంగళూరు 42-37తో యు ముంబాపై నెగ్గింది. బుల్స్ రైడర్లు సుశీల్, అక్షిత్ కీలక సమయాల్లో రాణించి జట్టును గెలుపుతీరాలకు చేర్చారు. మరో మ్యాచ్‌లో గుజరాత్ 42-30తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. గుజరాత్ విజయంలో రైడర్లు రాకేష్, రోహిత్ ముఖ్య భూమిక పోషించారు.

హైదరాబాద్ మరో గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్‌లో హైదరాబాద్ జట్టు వరుసగా ఐదో విజయం సాధించింది. సొంతగడ్డపై మిజోరంతో మ్యాచ్‌ను మూడ్రోజుల్లోనే ముగించింది. ఏకంగా ఇన్నింగ్స్ 73 పరుగులతో ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఓవర్‌నైట్ స్కోరు 458/8తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు స్కోరు 465/9 వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం 266 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మిజోరం 193 రన్స్‌కే కుప్పకూలింది. తనయ్ త్యాగరాజన్ ఐదు వికెట్ల (5/74)తో ప్రత్యర్థి బ్యాటర్ల పనిపట్టాడు. రోహిత్ 2 వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో మిజోరం 199 రన్స్ చేసింది.

సిరీస్ భారత్-ఎ వశం

అహ్మదాబాద్: షామ్స్ ములాని (5/60) తిప్పేయడంతో.. ఇంగ్లండ్ లయన్స్‌తో మూడో, ఆఖరి అనధికార టెస్టులో భారత్-ఎ 134 పరుగుల తేడాతో గెలిచింది. మూడు టెస్టుల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకొంది. 403 పరుగుల ఛేదనలో భాగంగా.. ఓవర్‌నైట్ స్కోరు 83/2తో ఆటకు ఆఖరి రోజైన ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లయన్స్ 268 రన్స్‌కు కుప్పకూలింది. ఓలీ రాబిన్సన్ (80), అలెక్స్ (55) అర్ధ శతకాలు సాధించారు. సారాంశ్ 3 వికెట్లు తీశాడు. భారత్-ఎ 192, 409 పరుగులు చేయగా.. లయన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 199 రన్స్‌కు ఆలౌటైంది.

సీఈవో నియామకంపై వెనక్కు తగ్గను

ఐఓఏ చీఫ్ పీటీ ఉష

న్యూఢిల్లీ: సీఈవో నియామకంపై వెనక్కు తగ్గే ప్రశ్నే లేదని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) చీఫ్ పీటీ ఉష స్పష్టంజేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిబంధనల మేరకు ఐఓఏ సీఈవోగా రఘురామ్ అయ్యర్‌ను గతనెలలో నియమించారు. అయితే సీఈవోకి నెలకు రూ. 20 లక్షలతో పాటు అలవెన్సులు కలిపి ఏడాదికి రూ. 3 కోట్లు ప్యాకేజీగా నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ ఈసీ సభ్యులు ఉషపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. ఈసీ ఆమోదం లేకుండా వేతనం నిర్ణయించారంటూ.. మొత్తం 15 మంది ఈసీ సభ్యుల్లో 12మంది రఘురామ్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు అధ్యక్షురాలు పీటీ ఉషకు లేఖ రాశారు.

ఇబ్రహీం సెంచరీ

అఫ్ఘాన్ రెండో ఇన్నింగ్స్ 199/1

శ్రీలంకతో టెస్టు

కొలంబో: ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (101 బ్యాటింగ్) అజేయ శతకంతో కదం తొక్కడంతో శ్రీలంకతో ఏకైక టెస్టులో అఫ్ఘానిస్థాన్ పోటీలోకి వచ్చింది. ప్రత్యర్థి భారీ మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అధిగమించే దిశగా పయనిస్తోంది. మూడోరోజు ఆట ఆఖరికి రెండో ఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ వికెట్ నష్టానికి 199 పరుగులు చేసింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి 42 రన్స్ వెనుకంజలో నిలిచింది. అంతకుముందు..ఓవర్‌నైట్ స్కోరు 410/6తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 29 పరుగులు జోడించి మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 రన్స్ చేయడంతో.. ఆతిథ్య జట్టుకు 241 పరుగులు ఆధిక్యం లభించింది.

ఇద్దరు వ్యక్తుల మధ్యే కాదు, రెండు దేశాల మధ్య మిత్రత్వం దీర్ఘకాలం కొనసాగాలంటే భావసారూప్యత ఎంతో అవసరం. విపత్కర కాలంలో ఒకరికి ఒకరు వెన్నుదన్నుగా నిలవడం మరీ ముఖ్యం. ఫ్రాన్స్-భారత్‌ల మధ్య సుదీర్ఘ స్నేహ సంబంధాలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్ - ఫ్రాన్స్ ద్వైపాక్షిక సంబంధాలు



1980ల్లో మిరాజ్ యుద్ధ విమానాలను అందించడం మొదలు, 1982లో భారత్‌కు అణు ఇంధనాన్ని అందించాల్సిన అమెరికా సహకరించనప్పుడు, ఆ స్థానంలో ఫ్రాన్స్ భారత్‌కు అణు ఇంధన సరఫరా చేయడం వరకూ ఒక సహకార ధోరణే కనిపిస్తుంది. అనంతరం 1998లో భారత్ అణు పరీక్షలు జరిపినప్పుడు అమెరికా వంటి అగ్ర దేశాలన్నీ భారత్‌పై ఆంక్షలు విధించినా, ఫ్రాన్స్ మాత్రం ఆ పని చేయకుండా తన మిత్రత్వాన్ని చాటుకుంది.

ఇలాంటి సయోధ్య, స్నేహబంధం ఇటీవల మరోసారి రుజువైంది. తొలుత గత జూలైలో ప్రధాని మోదీని ఫ్రాన్స్ తమ 'బాస్టిల్ డే' పరేడ్‌కు ఆహ్వానించగా, ఈయేటి గణతంత్ర దినోత్సవ ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్‌ను భారత్ ఆహ్వానించింది. ఈ పర్యటనల సందర్భంగా అనేక కీలక ఒప్పందాలు కుదిరిన నేపథ్యంలో, ఇరుదేశాల మధ్య సుదీర్ఘ స్నేహబంధం, నేటి ప్రపంచ పరిస్థితుల్లో అది మరింత బలపడాల్సిన ఆవసరం, సవాళ్లు చర్చనీయమైనాయి.

> గణతంత్ర దినోత్సవ ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్‌ను భారత్ ఆహ్వానించింది. ఈ పర్యటనల సందర్భంగా అనేక కీలక ఒప్పందాలు కుదిరిన నేపథ్యంలో, ఇరుదేశాల మధ్య సుదీర్ఘ స్నేహ బంధం, నేటి ప్రపంచ పరిస్థితుల్లో అతి మరింత బలపడాల్సిన ఆవశ్యకత, సవాళ్లు చర్చనీయమైనాయి.

ఇండో-ఫ్రాన్స్ సుదీర్ఘ ద్వైపాక్షిక బంధం

బహుళ ధ్రువ ప్రపంచం దిశగా భావసారూప్యం: ఫ్రాన్స్-భారత్ రెండూ ఎంతో భావసారూప్యం గల దేశాలు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, రష్యా కూటములపరంగా ప్రపంచం చీలిపోయిన సందర్భంలోనూ, భారతదేశం ఏ కూటమివైపు మొగ్గుచూపకుండా అలీన(నాన్ ఎలైన్‌మెంట్) ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించింది. అదేవిధంగా ఫ్రాన్స్ అమెరికాకు మిత్ర దేశమే అయినా కూడా తటస్థ వైఖరినే అవలంబించింది. అదేవిధంగా ఇరాన్‌పై అమెరికా దాడి సమయంలోనూ, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాలు అమెరికాకు సహకరించినా, ఫ్రాన్స్ మాత్రం ఇరాక్‌పై అమెరికా దాడిని వ్యతిరేకించింది. భారత్ కూడా ఇలాంటి దాడులను ఎప్పుడూ సమర్థించలేదు. ఇటీవల రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ పరిస్థితుల్లో కూడా రెండు దేశాలూ ఏ దేశానికీ మద్దతుగా నిలువలేదు. యుద్ధ విరమణనే కోరాయి. దాడులను ఖండించాయి.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో రష్యా, చైనా ఒక కూటమిగా, అమెరికా, పాశ్చాత్య దేశాలు మరోవైపు మోహరిస్తూ ఉన్న నేపథ్యంలో భారత్-ఫ్రాన్స్ తటస్థ కూటమిగా బహుళ ధ్రువ ప్రపంచం ఆవిష్కారానికి ఆస్కారం ఉంది. గ్లోబల్ సౌత్‌కు భారత్ నేతృత్వం వహిస్తూ, యూరోపియన్ యూనియన్‌కు ఫ్రాన్స్ ప్రాతినిధ్యంతో రెండు శక్తులనూ సమన్వయం చేయడం ద్వారా ఒక తటస్థ బహుళ ధ్రువ ప్రపంచం వైపు పయనించవచ్చు.

వ్యూహాత్మక సంబంధాలు: తొలినుంచే రెండు దేశాల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణం 1998లో వీటిమధ్య 'స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్(వ్యూహాత్మక భాగస్వామ్య) ఒప్పందానికి దారితీసింది. రక్షణ, భద్రతా రంగాల్లో సహకారం, అంతరిక్ష పరిశోధనల పరంగా, పౌర అణు ఇంధనపరంగా సహకారం ఈ ఒప్పందంలోని కీలక అంశాలు. భారతదేశ భౌగోళిక వ్యూహాత్మకత దృష్ట్యా ఫ్రాన్స్ తన ఇండో పసిఫిక్ ప్రాంతమైన 'రీ యూనియన్ ఐలాండ్'లో భారత వాయుసేనకు స్థావరం ఇవ్వడమే కాక, 2020లో 'ఇండియన్ ఓషన్ కమిషన్'లో భారత్‌కు అబ్జర్వర్‌గా స్థానం దక్కడానికి ఫ్రాన్స్ సహకరించింది. తద్వారా భారత్‌కు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఎంతో వ్యూహాత్మక ప్రయోజనాలు చేకూరాయి.

అదేవిధంగా ఇండో పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత కార్యకలాపాలు, సమ్మిళిత ప్రయోజనాలు, పరస్పర సహకారానికిగానూ ఏర్పడిన 'ఇండియా-ఫ్రాన్స్-ఆస్ట్రేలియా ట్రై లేటరల్ డైలాగ్'లో ఈ రెండు దేశాలూ కీలకపాత్ర పోషిస్తున్నాయి.

భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాల 25వ వార్షికోత్సవం సందర్భంగా తమ బంధాన్ని 2047 వరకూ పొడిగించుకొనేందుకు 'హారిజన్ ఆఫ్ 2047' అగ్రిమెంట్ గత సంవత్సరం జరిగింది. దీంతో 1947లో భారత్-ఫ్రాన్స్ మధ్య ప్రారంభమైన దౌత్య సంబంధాలకు 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తవగా, 1998లో ఏర్పర్చుకున్న వ్యూహాత్మక సంబంధాలకు 50 ఏళ్ల పూర్తవుతాయి.

రాజకీయ మద్దతు: భారత్‌కు ఐక్యరాజ్యసమితి శాశ్వత సభ్యత్వం ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన తొలి శాశ్వత సభ్యదేశం ఫ్రాన్స్. అంతేకాక మిసైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజీమ్(ఎంటీసీఆర్), వాస్సెనార్ అగ్రిమెంట్, ఆస్ట్రేలియా గ్రూప్‌లలో భారత ప్రాతినిధ్యానికి కూడా ఫ్రాన్స్ ఇతోధికంగా సహకరించింది. జమ్మూ కాశ్మీర్ అంశంలో ఫ్రాన్స్ భారత్‌కు మద్దతు ఇవ్వడమే కాదు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కూడా ఖండిస్తూ వస్తోంది. అంతేకాక చైనాకు దీటైన ప్రత్యామ్నాయ శక్తిగా భారత్‌కు తన మద్దతును తెలుపుతూ వస్తోంది.

ఆర్థిక సంబంధాలు: ఇరుదేశాల మధ్య ఇటీవలకాలంలో విస్తృతస్థాయిలో వాణిజ్యం జరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇరుదేశాల మధ్య 13.4 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది.

భారత్ నుంచి ఫ్రాన్స్‌కు ఏడు బిలియన్ డాలర్లపైగా ఎగుమతులు పెరిగాయి. అదేవిధంగా భారతదేశంలో ప్రత్యక్ష పెట్టుబడుల్లో 1.64 శాతం సమకూర్చుతూ భారత్‌లో విదేశీ పెట్టుబడులపరంగా ఫ్రాన్స్ 11వ స్థానంలో నిలిచింది. భారత్‌లో ఫ్రాన్స్‌కు చెందిన దాదాపు వెయ్యి సంస్థలు(ఎస్టాబ్లిష్‌మెంట్స్) 20 బిలియన్ డాలర్ల టర్నోవర్ కలిగి మూడు లక్షలమందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అదేవిధంగా భారత్‌కు చెందిన 150 కంపెనీలు ఫ్రాన్స్‌లో ఏడువేలమందికి ఉపాధిని స్తున్నాయి.

ఇండో-ఫ్రాన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ కమిటీ(ఏఈటీసీ) ద్వారా భారత్-ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల పెరుగుదలకు, వ్యాపార అవరోధాల పరిష్కారానికి కృషి జరుగుతోంది.

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

భారతదేశంలో తొలిసారి గొప్ప పరిపాలనను అందించిన వారు మౌర్యులు. వీరు విశాల భారత దేశాన్ని ఆక్రమించారు. వాయువ్యంలో గ్రీకులను, మగధలో నంద వంశస్థులను నిర్మూలించారు. 'పాటలీపుత్రం' రాజధానిగా క్రీపూ.322 నుంచి క్రీపూ.185 వరకు పరిపాలించారు.

మౌర్య సామ్రాజ్యం



ఇండియన్ హిస్టరీ

మౌర్యుల చరిత్రకు ఆధారాలు

మౌర్యుల చరిత్రకు అనేక సాహిత్య, పురావస్తు ఆధారాలతోపాటు గ్రీకు, చైనా చరిత్రకారుల రచనలు లభించాయి.

కౌటిల్యుని అర్థశాస్త్రం: సంస్కృతంలో రాసిన ఈ గ్రంథం మౌర్యుల పరిపాలన విధానాలు, చంద్రగుప్తుని రాజకీయ, రాజనీతి సిద్ధాంతాలను తెలియజేస్తుంది.

విశాఖదత్తుని ముద్రారాక్షసం: నందవంశంలోని చివరి రాజైన ధననందున్ని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి, వారి రాజ్యాన్ని ఆక్రమించుకున్నట్లు రాసి ఉంది. ఈ గ్రంథంలో విశాఖదత్తుడు మౌర్యులను 'హీనకులస్థులు'గా పేర్కొన్నాడు.

హేమచంద్రుని పరిశిష్టపర్వణ్: ఈ గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడు జైనమతంలోని 'దిగంబర'శాఖను తన గురువైన 'బద్రబాహు' ద్వారా స్వీకరించిన విధానం రాసి ఉంది.

విదేశీ గ్రంథాలు: గ్రీకు రాయబారి మెగస్తనీస్ తన 'ఇండికా' గ్రంథంలో పాటలీపుత్రంలోని పరిపాలన, సమాజంలోని మతం, స్త్రీల దుస్థితి, ఆర్థిక రంగాల గురించి రాశాడు. చైనా యాత్రికుడు ఫాహియాన్ గుప్తుల కాలంలో భారతదేశం సందర్శించినప్పటికీ మౌర్యుల కాలం నాటి సామాజిక విధానాన్నే వివరించాడు.

అశోకుని శిలాశాసనాలు: భారతదేశంలో తొలిసారిగా అశోకుడు అనేక శాసనాలు వేయించాడు. బ్రాహ్మి లిపి, పాళి భాషలో అనేక శాసనాలున్నప్పటికీ, సంస్కృతంలో మాత్రం చెక్కించలేదు. దీనికి ముఖ్య కారణం ఆ కాలంనాటి ప్రజల వాడుక భాష 'పాళి' కావడం. సార్‌నాథ్, మస్కి, రుమిందై, కౌశాంబి, రాయలసీమలోని కర్నూలులో ఎర్రగుడి, రాజుల మందగిరి వద్ద అశోకుని శాసనాలు లభించాయి.

మౌర్యుల రాజకీయ చరిత్ర(322 - 185 క్రీపూ.)

మౌర్య వంశస్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. అలెగ్జాండర్ సేనాని సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి ప్రస్తుత ఆఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్- ఇరాన్ సరిహద్దులను ఆక్రమించాడు. గ్రీకులు చంద్రగుప్త మౌర్యున్ని 'యాండ్రకోటస్'గా పేర్కొన్నారు. చంద్రగుప్త మౌర్యుడు గ్రీకులతో వివాహ సంబంధాలు కుదుర్చుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా వారి నుంచి అరకోషియా(కాందహార్), కాబూల్, గెడ్రోసియా(బెలూచిస్థాన్), మీరట్ మొదలైన ప్రాంతాలను కైవసం చేసుకున్నాడు. చివరికి చంద్రగుప్త మౌర్యుడు జైనమతం స్వీకరించాడు. కర్ణాటకలోని మైసూర్ వద్ద గల చంద్రగిరి పర్వతంపై 'సల్లేఖన' వ్రతం(ఉపవాస దీక్ష) చేపట్టి మరణించినట్లు జైనగ్రంథాల్లో ఉంది.

బిందుసారుడు(297- 273 క్రీ.పూ.): చంద్రగుప్త మౌర్యుని కుమారుడు. ఇతనికి 'సింహసేనుడు' 'అమిత్రఘాత' అనే బిరుదులున్నాయి. బిందుసారునికి సిరియా రాజు మొదటి అందయోకస్‌తో మంచి స్నేహం ఉండేది. స్నేహానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని, అత్తిపండ్లను బిందుసారునికి కానుకలుగా పంపేవాడు. తారాచంద్ అనే బౌద్ధ టిబెట్ చరిత్రకారుడు బిందుసారుడిని రెండు సముద్రాల మధ్య ప్రాంతాన్ని పాలించినవాడు అని తన రచనల్లో పేర్కొన్నాడు. బిందుసారుని కాలంలో తక్షశిల రాష్ట్రంలో సైనిక తిరుగుబాటు జరిగింది. దీనిని యువరాజైన అశోకుడు కఠినంగా అణచివేశాడు. బిందుసారుడు చివరి దశలో 'అజీవకమతం'ను స్వీకరించాడు. బిందుసారుడు నాగార్జున గుహలో మరణించినట్లు, అందుకే వాటిని అజీవక మతస్థులకు అంకితం చేసినట్లు కొన్ని గ్రంథాల్లో రాసి ఉంది.

అశోకుడు(273 - 232 క్రీ.పూ.): బిందుసారుని కుమారుడు అశోకుడు. తన పట్టాభిషేకం సందర్భంగా రాజ్యంలో ఉన్న యుద్ధఖైదీలను విడుదల చేశాడు. భారతదేశంలో శాసనాలు ముద్రించిన తొలిరాజు. బ్రాహ్మిలిపిలో పాళిభాషలో గల అశోకుని శాసనాలను జర్మనీకి చెందిన జేమ్స్‌ప్రిన్సెస్ అనే చరిత్రకారుడు తొలిసారిగా గుర్తించి, చదివాడు. అశోకుడు వాయువ్య ప్రాంతంలో సెబాష్‌ఘర్, మన్సార శాసనాలు; ఆఫ్ఘానిస్థాన్‌లో ఖంతహాల్ శాసనం చెక్కించాడు. సిరియారాజు రెండో అంటియోకస్‌తో, ఈజిప్టురాజు ఫిలడేల్ఫస్‌తో, మాసిడోనియా రాజు అంటియోగానస్‌తో, సైరస్‌రాజు మాగాస్‌తో, ఎపిరస్ రాజు అలెగ్జాండర్‌తో మంచి స్నేహసంబంధాలు కొనసాగించాడు.

సామ్రాజ్యకాంక్షతో కళింగపై దండయాత్ర చేశాడు. ఈ యుద్ధం తరవాత అశోకుడు బౌద్ధ దీక్షను స్వీకరించాడు. 3వ బౌద్ధమత సమావేశాన్ని పాటలీపుత్రలో నిర్వహించాడు. 'దేవానాంప్రియ', 'ప్రియదాసి' అనే బిరుదులు అశోకునికి ఉన్నాయి. నైతిక సూత్రాలు ప్రచారం చేయడానికి 18 మంది దర్మమహా మాత్రులను అశోకుడు నియమించారు. దయ, దాతృత్వం, సంక్షేమం ముఖ్యమైన లక్షణాలు 'ధర్మ' సూత్రంలో పేర్కొన్నారు. 232 క్రీ.పూ.లో అశోకుడు మరణించాడు.

మౌర్యుల పరిపాలన విధానం

భారతదేశ చరిత్రలో ఏ రాజవంశానికి లేని కేంద్రీకృత పాలన వ్యవస్థ మౌర్యుల కాలంలో కన్పిస్తుంది. అశోకుడు పాటలీపుత్రం కేంద్రంగా ఉంటూ మారుమూల గ్రామమైన సిద్ధాపురంలోని విషయాలను తెలుసుకునేవాడు. మౌర్యులకున్న విస్తృత అధికార యంత్రాంగం చరిత్రలో ఏ రాజవంశంలోనూ కన్పించదు. నిరపేక్ష, నిరంకుశ రాజరికం అధికారాలు చెలాయించేవారు. దేశచరిత్రలోనే తొలిసారిగా శ్రేయో రాజ్యం స్థాపించారు. వీరి పాలనలో మూడు దశలు ప్రధానంగా కన్పిస్తాయి అవి..కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ ప్రభుత్వం, స్థానిక పాలన.

కేంద్ర ప్రభుత్వం: రాజుకు సహాయం చేయడానికి మంత్రిపరిషత్ ఉండేదని మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో రాశాడు. పాలనలో ఆయా విభాగాలను పర్యవేక్షించడానికి 32 మంది అధ్యక్షులు ఉండేవారు. వీరిలో 'సన్నిదాత', 'కోశాధికారి', 'సంహార్త్రి' పన్నులు వసూలు చేసే అధికారులు.

ప్రాంతీయ పాలన: పాలన సౌలభ్యం కోసం మౌర్యులు తమ సామ్రాజ్యాన్ని నాలుగు ప్రాంతాలుగా, ఆహారాలుగా, రాష్ట్రాలుగా విభజించారు. తూర్పు ప్రాంతానికి తోసలి; పశ్చిమ ప్రాంతానికి తక్షశిల; మధ్య ప్రాంతానికి ఉజ్జయిని, అవంతి; దక్షిణ ప్రాంతానికి సువర్ణగిరి ముఖ్యస్థానాలు. రాష్ట్రాలకు పాలనాధికారులను కుమార మాత్యులు అని అంటారు. వీరికి సహాయంగా రజుక, యుక్త అనే అధికారులు ఉంటారు. 'పురుష' అనే అధికారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమాచారం అందించేవారు.

స్థానిక పాలన: స్థల లేదా స్థానిక ప్రధాన పాలన విభాగాలు. వీటి పాలనను స్థానిక, గ్రామిక నిర్వహించేవారు. పాలనలో చివరి భాగం గ్రామం. గ్రామణి పాలన బాధ్యతలు నిర్వహిస్తారు.

నగర పాలన: మెగస్తనీస్ తన ఇండికాలో 30 మంది సభ్యులతో 6 కమిటీలను పురపాలక సంఘం నిర్వహించినట్లు రాశాడు.

సైనిక పాలన: మెగస్తనీస్ రచనల్లో పాటలీపుత్ర నగర పాలన గురించి ఉంది. ఒక్కో కమిటీతో ఐదుగురు సభ్యుల చొప్పున సైనిక పాలన బాధ్యతలు నిర్వహించారు. కాల్బలం, సైనిక జీతభత్యాల నిర్వహణ. అశ్వికదళం, గజదళం, రథబలం, నౌకాదళం ముఖ్యమైన విభాగాలు. సైనిక చికిత్సలకు అంబులెన్స్ వ్యవస్థ ఉండేదని చాణక్యుడు రాశాడు. సైన్యంలో ఆరు లక్షల కాల్బలం, 30 వేల అశ్వదళం, 9 వేల గజబలం ఉండేదని 'ప్లీని' తన నేచురల్ హిస్టరీ గ్రంథంలో రాశాడు.

న్యాయవ్యవస్థ: న్యాయవ్యవస్థలో రాజే సర్వసైన్యాధీశుడు. 'ప్రాడ్విి' వాకులు, న్యాయాధికారులు అనేవారు ఉండేవారు. దివ్య, దైవ పరీక్షలు సామాన్యం. అశోకుడు అహింసావాదం ప్రచారం చేసినప్పటికీ 'మరణ శిక్ష' అమలులో ఉండేది. హత్య వంటి నేరాలకు మరణదండన, దేశద్రోహులను మంటల్లో వేసి కాల్చడం లాంటి తీవ్ర శిక్షలు ఉండేవి.

గూఢచారి వ్యవస్థ: వేగులు, పతివేదికలు, పులిసానులు, గూఢపురుషులు చక్రవర్తికి కన్నులు, చెవులు వంటి వారని కౌటిల్యుడు పేర్కొన్నాడు. గూఢచారి దళంలో స్త్రీలు కూడా ముఖ్య పాత్ర పోషించేవారు.

ఆర్థిక విధానం: మౌర్యుల ఆర్థిక సంవత్సరం జూలైలో ప్రారంభమయ్యేది. భూమిశిస్తు ముఖ్య ఆదాయం. 1/4వ వంతు భూమి శిస్తు ఉండేది. అటవీ సంపదపై హిరణ్య, బయలు భూములపై ప్రజ అనే పన్నులు విధించేవారు. 'సీత' భూములు రాజు ఆధీనంలో ఉండేవి. వీటి పర్యవేక్షణను 'సీతాధ్యక్షులు' చూసేవారు. పాటలీపుత్రం నుంచి తక్షశిల వరకు అశోకుడు రాజమార్గం వేయించాడు. 'తామ్రలిప్తి' అంతర్జాతీయ నౌకా కేంద్రంగా ఉండేది. 'పన' అనేది అమలులో ఉన్న కరెన్సీ. విదేశీ, స్వదేశీ వాణిజ్యాలు అధికం. అనేక పట్టణాలు అభివృద్ధి చెందాయి. తోసలి, సువర్ణగిరి, తక్షశిల, అవంతి, మగధ, తామ్రపర్ణి, లలితపట్టణం మొదలైనవి ప్రసిద్ధి చెందిన నగరాలు.

చివరి మౌర్యరాజులు: అశోకుడి మరణం తరవాత కుణాలుడు రాజ్యానికి వచ్చాడు. ఈ కాలంలో మౌర్య సామ్రాజ్యం రెండుగా చీలిపోయింది. తరవాత వచ్చిన రాజులు దాదాపు 50 సంవత్సరాలు పాలించారు. చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని, అతని సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించి శుంగ వంశాన్ని స్థాపించాడు.

సమాజం పరిస్థితులు: మౌర్యుల కాలంలో బానిస వ్యవస్థ లేదని మెగస్తనీస్, ఉండేదని కౌటిల్యుడు తమ రచనల్లో పేర్కొన్నారు. బహుభార్యత్వం, బాల్య వివాహాలు, సతీసహగమనం మౌర్యుల పాలనలో సాధారణం. వ్యభిచార వృత్తి ఉండేదని దియోడోరస్ రాశాడు. 8 రకాల వివాహాలు జరిగేవని, వీటితో పాటు స్వయంవరం, రాక్షస వివాహం, గాంధర్వ వివాహం కూడా ఉండేవని చరిత్రకారులు పేర్కొన్నారు. మౌర్యులు మద్యపాన ప్రియులు అని మెగస్తనీస్ వ్యాఖ్యానించాడు. ప్రజలు గోధుమ, బార్లీని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. నూలు, పట్టు, వస్త్రాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. బంగారం, వెండి, రత్నాలు కలిగిన ఆభరణాలు ధరించేవారు. జూదం ఆడటం, జంతువులతో పోరాటాలు, మల్ల యుద్ధాలు, ఉత్సవాలు వీరి వినోదాలు.

మౌర్యుల వాస్తు - శిల్పకళ: సాంచి, సార్‌నాథ్, బార్హుత్ స్థూపాలు చెప్పుకోదగినవి. బార్హుత్ స్థూపం తరవాత కాలంలో అభివృద్ధి చెందింది. శుంగులు వీటికి తోరణాలు నిర్మించారు. అశోకుడు 'చునార్' గనుల నుంచి రాతిని తెప్పించి, చెక్కించి నిర్మింపజేశాడు. గుహ దేవాలయాలు నిర్మించాడు. అశోకుడు ఆఫ్ఘానిస్థాన్‌లోనే ఎక్కువగా 84 వేల స్థూపాలు వేయించాడు. శ్రీనగర్ పట్టణం అశోకుని కాలంలోనే నిర్మించినట్లు కల్హణుడు తన 'రాజ తరంగిణి'లో పేర్కొన్నాడు.

రాతి శాసనాలు: 8 ప్రదేశాల్లో మొత్తం 21 శిలా శాసనాలు లభించాయి. మొదటి శాసనంలో జంతు బలి గురించి, 6వ శాసనంలో ప్రజల నడవడిక గురించి, 13వ శాసనంలో కళింగ యుద్ధం గురించి రాసి ఉంది. 7వ శాసనంలో పరమత సహనం, పదో శాసనంలో పునర్జన్మ సిద్ధాంతం, పదకొండో శాసనంలో కుటుంబ జీవనం గురించి లిఖించి ఉన్నాయి.

మత విధానం: చంద్రగుప్తుడు జైనం, బిందుసారుడు ఆజీవకం, అశోకుడు బౌద్ధమతం స్వీకరించారు. మౌర్యుల కాలంలో పరమత సహనం ఉండేది.



డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట

తెలంగాణ పారిశ్రామికరంగం

ఎకానమీ

ఆర్థికవ్యవస్థను స్థూలంగా మూడు రకాలుగా విభజిస్తారు. అవి 1) ప్రాథమిక రంగం(వ్యవసాయ రంగం) 2) ద్వితీయ రంగం(పారిశ్రామిక రంగం) 3) తృతీయ రంగం(సేవల రంగం). సాధారణంగా ఆర్థికాభివృద్ధి ఆరంభంలో స్థూల ఆదాయంలో, ఉపాధిలో వ్యవసాయరంగం వాటా ఎక్కువగా ఉన్న ఆర్థికాభివృద్ధి పరిణామక్రమంలో వ్యవసాయ రంగం వాటా క్రమేణా తగ్గి వ్యవసాయేతర రంగాల వాటా ఆదాయంలోనూ, ఉపాధి కల్పలోనూ పెరుగుతూ ఉంటుంది.

పారిశ్రామికరంగంలో వస్తువుల తయారీ, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, గనుల తవ్వకం, ఖనిజాల వెలికితీత, నిర్మాణం ఉంటాయి. అయితే కొన్నిసార్లు గనుల తవ్వకం, ఖనిజాల వెలికితీతను ప్రాథమికరంగంలో, నిర్మాణాన్ని సేవలరంగంలో కూడా చూపుతారు.

తెలంగాణలో ఔషధాలు, జీవ రసాయనాలు, సిమెంట్, ఇంజనీరింగ్, వస్త్ర, చర్మ, ఇనుము, స్టీల్, నగలు, ఆభరణాలు, బయో టెక్నాలజీ, ముత్యాలు, విలువైన రాళ్లు, విమాన ముడి భాగాలు, రక్షణ సంబంధిత, అగ్రి, ప్రాసెసింగ్ మొదలైన పరిశ్రమలు ప్రధానంగా ఉన్నాయి. 2022-23లో తెలంగాణ స్థూల పారిశ్రామిక ఉత్పత్తి అదనపు విలువ రూ.2,26,492 కోట్లు. తెలంగాణ రాష్ట్ర స్థూల అదనపు విలువలో పారిశ్రామిక రంగం వాటా 18.96 శాతం. 2014-15 నుంచి 2022-23 వరకు తెలంగాణ రాష్ట్ర స్థూల అదనపు విలువలో పారిశ్రామిక రంగం వాటాను, తెలంగాణ పారిశ్రామికరంగ అదనపు విలువలో వృద్ధి ధోరణిని కింది పట్టికలో చూడవచ్చు.

పట్టిక-1: తెలంగాణ పారిశ్రామిక రంగం వార్షిక వృద్ధి, రాష్ట్ర స్థూల అదనపు విలువలో పారిశ్రామికరంగం వాటా (ప్రస్తుత ధరల ప్రకారం).

సంవత్సరం	తెలంగాణ రాష్ట్ర స్థూల అదనపు విలువలో పారిశ్రామిక రంగం వాటా	తెలంగాణ పారిశ్రామిక రంగం వృద్ధి
2014-15	22.4	1.5
2015-16	23.6	19.8
2016-17	21.5	3.4
2017-18	22.2	16.6
2018-19	23.5	20.9
2019-20	20.8	(-)0.6
2020-21	19.7	(-)4.1
2021-22	19.7	17.9
2022-23	19.0	10.5

పై పట్టిక-1ను పరిశీలిస్తే తెలంగాణ పారిశ్రామికరంగం కరోనా ప్రభావిత కాలం 2019-20, 2020-21లో వ్యతిరేక వృద్ధిని నమోదు చేయగా, మిగతాకాలంలో వృద్ధిని నమోదు చేసింది. గరిష్ఠంగా 2018-19లో 20.9 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. తెలంగాణ స్థూల అదనపు విలువలో పారిశ్రామికరంగం వాటాను చూస్తే దాదాపు 20 శాతంతో స్థిరంగా ఉంది. 2018-19లో పారిశ్రామిక రంగం వాటా గరిష్ఠంగా 23.5 శాతం ఉండగా 2022-23లో కనిష్ఠంగా 19 శాతంగా ఉంది.

స్థిరమైన(2011-12) ధరల ప్రకారం తెలంగాణ పారిశ్రామిక స్థూల ఉత్పత్తి విలువ, వృద్ధి, తెలంగాణ స్థూల ఉత్పత్తిలో పారిశ్రామికరంగం వాటాను కింది పట్టిక ద్వారా విశ్లేషించవచ్చు.

పట్టిక-2: స్థిరమైన (2011-12) ధరల్లో తెలంగాణ స్థూల పారిశ్రామిక ఉత్పత్తి విలువ, వృద్ధి, రాష్ట్ర మొత్తం స్థూల ఉత్పత్తిలో వాటా.

సంవత్సరం	తెలంగాణ స్థూల పారిశ్రామిక ఉత్పత్తి విలువ (రూ.కోట్లలో)	వృద్ధి శాతం	మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వాటా(%)
2014-15	78,231	---	20.4
2015-16	98,944	21.4	22.4
2016-17	95,034	0.1	20.7
2017-18	1,06,133	11.7	21.2
2018-19	1,19,962	13.0	22.0
2019-20	1,19,294	(-)0.6	20.6
2020-21	1,16,060	(-)2.7	21.1
2021-22	1,24,919	7.6	20.7
2022-23	1,27,649	2.2	19.8

పై పట్టిక-2ను పరిశీలిస్తే స్థిరమైన ధరల్లో తెలంగాణ ద్వితీయరంగ స్థూల ఉత్పత్తి విలువ 2014-15లో రూ.78,231 కోట్లు ఉండగా 2022-23లో రూ.1,27,649 కోట్లుగా ఉంది. మొత్తమ్మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత 2022-23 నాటికి తెలంగాణ రాష్ట్ర స్థూల పారిశ్రామిక ఉత్పత్తి విలువ దాదాపు 63 శాతం పెరిగింది. ఇక వార్షిక వృద్ధిని చూస్తే కరోనా కాలంలో స్థిరమైన ధరల్లో కూడా పారిశ్రామికరంగం ఉత్పత్తి విలువ పడిపోయింది. మిగతా కాలంలో వృద్ధిని నమోదు చేసింది. 2015-16లో గరిష్ఠంగా 21.4 శాతం వృద్ధిని నమోదు చేయగా, 2018-19లో 13 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక స్థిరమైన ధరల్లో కూడా మొత్తం స్థూల రాష్ట్ర ఉత్పత్తి విలువలో స్థూల రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తి విలువ వాటా దాదాపు 20 శాతం దగ్గర స్థిరంగా ఉంది.



2015-16లో పారిశ్రామికరంగం వాటా గరిష్ఠంగా 22.4 శాతం ఉండగా 2018-19లో 22 శాతంగా ఉంది. 2022-23లో కనిష్ఠంగా 19.8 శాతంగా ఉంది.

పారిశ్రామిక ఉపరంగాలు

పారిశ్రామిక స్థూల అదనపు విలువలో దాదాపు 59 శాతం వాటాను తయారీరంగం సమకూర్చుతున్నది. తరవాత నిర్మాణరంగం 19 శాతం వాటా, గనుల తవ్వకం, ఖనిజాల వెలికితీత 12.33 శాతం; విద్యుత్, గ్యాస్, నీటి సరఫరాలు 9.67 శాతం వాటాను కలిగి ఉన్నాయి. కింది పట్టిక-3లో స్థిరమైన ధరల ప్రకారం తెలంగాణ పారిశ్రామికరంగాల వార్షిక వృద్ధిని, తెలంగాణ స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక ఉపరంగాల వాటాను పరిశీలించవచ్చు.

పట్టిక-3: పారిశ్రామిక ఉపరంగాల వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక ఉపరంగాల వాటా.

సంవత్సరం	వస్తువుల తయారీ		నిర్మాణం		విద్యుత్, గ్యాస్, నీటిసరఫరా	
	వృద్ధి(%)లో	రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వాటా(%లో)	వృద్ధి (%లో)	రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వాటా(%లో)	వృద్ధి (%లో)	రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వాటా(%లో)
2014-15	---	12.6	---	6.1	---	1.7
2015-16	32.1	15.0	2.8	5.7	8.8	1.7
2016-17	1.9	14.1	1.5	5.3	(-)20.4	1.2
2017-18	9.3	14.2	14.3	5.6	27.9	1.5
2018-19	16.5	15.2	4.3	5.3	12.1	1.5
2019-20	(-)2.0	14.0	(-)5.0	4.8	29.6	1.8
2020-21	(-)2.3	14.4	(-)3.3	4.9	(-)4.4	1.9
2021-22	10.8	14.6	0.8	4.5	0.9	1.7
2022-23	1.7	13.9	4.0	4.3	1.6	1.6

పట్టిక-3ను పరిశీలిస్తే కరోనా కాలంలో అన్ని పారిశ్రామిక ఉపరంగాలు వ్యతిరేక వృద్ధిని నమోదు చేశాయి. అయితే విద్యుత్, గ్యాస్, నీటిసరఫరా రంగం 2019-20లో వ్యతిరేక వృద్ధిని నమోదు చేయలేదు. కానీ 2020-21లో ఈ రంగం కూడా వ్యతిరేక వృద్ధినే నమోదు చేసింది.

మిగతా కాలంలో అన్ని ఉపరంగాలు వృద్ధిని నమోదు చేశాయి. అయితే గరిష్ఠంగా వస్తువుల తయారీ రంగం 2015-16లో 32.1 శాతం వృద్ధిని, 2018-19లో 16.5 శాతం వృద్ధిని నమోదు చేయగా, నిర్మాణరంగం 2017-18లో గరిష్ఠంగా 14.3 శాతం వృద్ధిని నమోదుచేసింది. ఇక విద్యుత్, గ్యాస్, నీటిసరఫరా రంగం 2019-20లో గరిష్ఠంగా 29.6 శాతం వృద్ధిని, 2017-18లో 27.9 శాతం వృద్ధిని నమోదుచేసింది.

ఇక మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక ఉపరంగాల వాటాను చూస్తే వస్తువుల తయారీ రంగం మొదటిస్థానంలో, నిర్మాణరంగం ద్వితీయస్థానంలో; విద్యుత్, గ్యాస్, నీటి సరఫరారంగం తృతీయస్థానంలో ఉన్నాయి. ఉపరంగాల వాటా శాతం స్థిరంగా కూడా ఉంది. వస్తువుల తయారీరంగం దాదాపు 15 శాతం, నిర్మాణ రంగం 5 శాతం; విద్యుత్, గ్యాస్, నీటిసరఫరా రంగం దాదాపు రెండు శాతం వాటాను కలిగి ఉన్నాయి.

పారిశ్రామికరంగంలో ఉపాధి

రాష్ట్రంలో 29,90,043 మంది కార్మికులు పారిశ్రామికరంగంలో ఉపాధి పొందుతున్నారు. అంటే మొత్తం కార్మికుల్లో 21 శాతం మంది పారిశ్రామికరంగంలో ఉపాధి పొందుతున్నారు. పారిశ్రామిక ఉపరంగాల వారీగా ఉపాధిని చూస్తే రాష్ట్రంలోని మొత్తం కార్మికుల్లో 11 శాతం వస్తువుల తయారీ రంగంలో, 8.8 శాతం నిర్మాణరంగంలో, 1.2 శాతం మిగతా రెండు ఉపరంగాల్లో ఉపాధి పొందుతున్నారు. మొత్తం పారిశ్రామికరంగ కార్మికుల్లో 52 శాతం వస్తువుల తయారీ రంగంలో, 42 శాతం నిర్మాణరంగంలో, మూడు శాతం గనుల తవ్వకం, ఖనిజాల వెలికితీత, మరో మూడు శాతం విద్యుత్, గ్యాస్, నీటిసరఫరా రంగాల్లో ఉపాధి పొందుతున్నారు.

తెలంగాణ పారిశ్రామిక ఎగుమతులు

2021-22లో రూ.2,65,510 కోట్ల విలువైన వస్తు, సేవల ఎగుమతులు తెలంగాణ నుంచి జరిగాయి. ఇందులో 31 శాతం వాటాను సరుకులు కలిగి ఉన్నాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువలో సరుకుల ఎగుమతుల విలువ 7.10 శాతంగా ఉంది. సరుకుల ఎగుమతుల విలువ రూ.81,971 కోట్లు. మొత్తం సరుకుల్లో ఔషధాలు జీవ రసాయనాలు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఔషధాలు 33.9 శాతం, జీవ రసాయనాలు 23.41 శాతం, ఎలక్ట్రికల్ యంత్రాలు 5.47 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఆరకంగా తెలంగాణ నుంచి ఎగుమతి అవుతున్న పారిశ్రామిక వస్తువుల్లో మొదటి అయిదు స్థానాల్లో ఔషధాలు, మందులు, జీవ రసాయనాలు, ఎలక్ట్రిక్ యంత్రాలు, మరమ్మత్తు యంత్రాలు, ఉప్పు, ఖనిజాలు ఉన్నాయి.

తెలంగాణ వస్తువులను ఎగుమతి చేసిన దేశాల్లో మొదటి పది స్థానాల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలు, చైనా, బంగ్లాదేశ్, రష్యా, బ్రిటన్, సింగపూర్, బ్రెజిల్, జర్మనీ, జపాన్, టర్కీలు ఉన్నాయి. 2021-22లో తెలంగాణ మొత్తం ఎగుమతుల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు 28.13 శాతం, చైనాకు 7.3 శాతం, బంగ్లాదేశ్‌కు 3.64 శాతం, రష్యాకు 2.66 శాతం జరిగాయి. తెలంగాణ నుంచి ఎగుమతి అవుతున్న వస్తువులు తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచి వస్తున్న మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్(అయిదు జిల్లాలు) మొత్తం ఎగుమతుల్లో 85 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి 25.43 శాతం, హైదరాబాద్ 19.89 శాతం, సంగారెడ్డి 19.53 శాతం, రంగారెడ్డి 16.57 శాతం, మెదక్ 3.6 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇతర ప్రధాన జిల్లాల్లో నల్లగొండ 2.45 శాతం, ఖమ్మం 2.25 శాతం, యాదాద్రి భువనగిరి 1.98 శాతం ఉన్నాయి.



డా.ఎం.ఏ.మాలిక్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.



గ్లోబల్ రైస్ సమ్మిట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

వచ్చే ఖరీఫ్ నుంచి పంటలకు బోనస్!

- బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ప్రాధాన్యం
- భారత్ రైస్ హాస్యాస్పదం.. సన్నబియ్యం ఇస్తే సంతోషమే
- బియ్యం ఎగుమతులపై నిషేధంతో ఇబ్బందులు: తుమ్మల

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి పంటలకు బోనస్ ఇచ్చే అవకాశం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అలాగే, బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కేంద్రం భారత్ రైస్ పేరిట రూ.29కే కిలో బియ్యం విక్రయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన బియ్యాన్ని భారత్ రైస్ పేరిట విక్రయిస్తే ఎలా అని ప్రశ్నించారు. భారత్ రైస్‌గా సన్నబియ్యాన్ని ఇస్తే సంతోషం అని వ్యాఖ్యానించారు. ఇంటర్నేషనల్ కమాడిటీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో వచ్చే జూన్‌లో హైదరాబాద్ వేదికగా జరిగే గ్లోబల్ రైస్ సమ్మిట్ -2024 బ్రోచర్‌ను మంత్రి తుమ్మల ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రం నుంచి పంట ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు, రైతులకు మరింత లబ్ధి కలిగించేందుకు ఈ సమ్మిట్ ఉపయోగపడుతుందని అన్నారు. బియ్యం ఎగుమతులపై కేంద్రం పెట్టిన ఆంక్షలతో తెలంగాణతోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పంట ఉత్పత్తుల ఎగుమతులు పెరిగితేనే రైతులకు ప్రయోజనమని చెప్పారు. రాష్ట్రం నుంచి పంట ఉత్పత్తుల ఎగుమతులు పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భారత్ రైస్ పథకంలో పంపిణీ చేసే బియ్యం... ఆ రాష్ట్ర అవసరాలకు తగినట్లుగా లేకపోతే పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచానికే అన్నం పెడుతున్నదని చెప్పారు. దేశానికి ఏ రకం బియ్యం అవసరమో కేంద్రం ముందే చెబితే.. రైతులు ఆ రకాన్ని అధికంగా పండించే అవకాశం ఉంటుందని సూచించారు. కేంద్రం ఎగుమతులకు అవకాశం ఇస్తే రైస్ పాలసీ మీద పునరాలోచన చేయాలని కోరారు. రేషన్ ద్వారా ఇస్తున్న బియ్యాన్ని పెద్దగా ఎవరూ వాడటం లేదని ఈ నేపథ్యంలో రూ.29కే కిలో భారత్ రైస్ అనేది హాస్యాస్పదంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ బి.గోపి, ఇంటర్నేషనల్ కమాడిటీ ఇనిస్టిట్యూట్ అధ్యక్షుడు జెరిమీ పాల్గొన్నారు.

2022-23 కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణకు బ్రేక్

- ప్రొక్యూర్మెంట్ నిలిపివేయాలని జిల్లా మేనేజర్లకు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ప్రొక్యూర్మెంట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2022- 23 సంవత్సరంలో ఖరీఫ్, యాసంగి సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణను నిలిపివేయాలని జిల్లా మేనేజర్లకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాలు జారీచేశారు. జనవరి 31తో తుది గడువు ముగిసింది కాబట్టి రెండు సీజన్ల బియ్యాన్ని రైస్‌మిల్లర్ల నుంచి ఇకమీదట తీసుకోవద్దని, 2023- 24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ప్రొక్యూర్మెంట్‌పై మాత్రమే దృష్టిసారించాలని ఉత్తర్వులిచ్చారు. ఆదేశాలను ఉల్లంఘించి సేకరించినట్లయితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజానికి జనవరి 31న గడువు ముగియటంతో... మరో నెల రోజులు గడువు తీసుకొని సేకరణను పూర్తిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ భావించింది. ఈక్రమంలోనే కమిషనర్ చౌహాన్ ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. కానీ కేంద్రం నుంచి పొడిగింపు ఉత్తర్వులు రాలేదు. దీంతో 2022- 23కు సంబంధించిన బియ్యం సేకరణ నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే గతేడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంకా 3.85 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయిలు రైస్‌మిల్లర్ల వద్ద ఉన్నాయి. యాసంగి సీజన్‌కు సంబంధించి 32.13 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయిలు ఉన్నాయి. ఇదిలా ఉండగా... 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 47.47 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలుచేసింది. మిల్లింగ్ మొదలుపెట్టాల్సి ఉంది.

శంకర్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్‌పై వేటు

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం దీనిపై విచారణకు ఆదేశించారు. దీంతో అడిషనల్ ఐజీ, ఇద్దరు డీఐజీలు, రంగారెడ్డి డీఆర్ (జిల్లా రిజిస్ట్రార్) సమావేశమయ్యారు. శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారు. కాగా.. హైదరాబాద్ డీఆర్ భార్య కూడా ఈ భూములు కొన్నవారిలో ఉన్నారు ఈ కొనుగోలు వ్యవహారంలో హైదరాబాద్ సౌత్ డీఆర్ పాత్రపైనా అధికారులు విచారణ జరుపుతున్నారు. కొనుగోలుదారుల్లో ఒకరు హైదరాబాద్ డీఆర్ భార్యేనని సంబంధిత రిజిస్ట్రేషన్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ అధికారి ఒకరు నిర్ధారించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మునిసిపాలిటీ పరిధిలో ప్రొగ్రెసివ్ ఆగ్రో సర్వీసెస్ పేరిట రెండు వేర్వేరు సర్వే నంబర్లలో ఉన్న 5.12 ఎకరాల వ్యవసాయ భూమికి అసలైన యజమాని ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ. ఆయన 2023 మార్చి 17న శంకర్‌పల్లి తహశీల్దారు ఎండీ నయీముద్దీన్ ద్వారా నాలా ధ్రువీకరణ పత్రాన్ని పొందాడు. అయితే ఆ భూమి తమదేనని, తన తండ్రి పేరిట ఉందని.. దానికి యజమానిని తానేనని పేర్కొంటూ ముదుగుల వరప్రసాద్ శంకర్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2024 జనవరి 20న నీలంగౌడ్, రవీందర్‌కుమార్, పినిమెల్లి ప్రశాంత్, కస్తూరి హరిరంజనికి విక్రయించాడు. వీరిలో నీలంగౌడ్, ఇతరులు రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించారు. తాము స్వాధీనం చేసుకున్న భూముల్లోకి ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ, ప్రాజెక్ట్ నెక్ట్స్ ప్రతినిధులెవరు ప్రవేశించకూడదంటూ ఇంజెంక్షన్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. న్యాయమూర్తి ఫిబ్రవరి 16కు కేసును వాయిదా వేశారు.

సీట్ల పంపకాలపై బాబు-పవన్ మంతనాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీట్ల సర్దుబాటుపై టీడీపీ-జనసేన చర్చలు కొలిక్కి వస్తున్నాయి. జనసేనకు కేటాయించే సీట్లపై దాదాపు స్పష్టత వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం మధ్యాహ్నం, రాత్రి పొద్దుపోయాక రెండు దఫాలుగా సమావేశమయ్యారు. ఉభయ పార్టీల నేతలెవరూ లేకుండా ఏకాంతంగా, సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. పొత్తు సీట్లను త్వరత్వరగా తేల్చడమే ఈ భేటీల ఉద్దేశం. మధ్యాహ్నం తొలుత ఇక్కడి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ వచ్చారు. వెంట ఎవరూ లేకుండా మంగళగిరిలోని తమ పార్టీ కార్యాలయం నుంచి తన కారు తానే డ్రైవ్ చేసుకుంటూ పవన్ వచ్చారు. ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వాగతం పలికారు. తర్వాత చంద్రబాబు ఆయన్ను ఇంట్లోకి తోడ్కొని వెళ్లారు. సుమారు మూడు గంటలపాటు చర్చలు జరిపారు. ప్రధానంగా సీట్ల సర్దుబాటు, ఉమ్మడి మేనిఫెస్టో, ప్రచార కార్యాచరణపై చర్చలు సాగాయి. రాత్రి 9.30 గంటలకు మరోసారి పవన్ ఉండవల్లికి వచ్చి చంద్రబాబుతో మంతనాలు జరిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానాన్ని తీసుకుని.. అక్కడ అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది.. ఎవరికి విజయావకాశాలు ఉన్నాయి.. తమ తమ సర్వేల నివేదికల ఆధారంగా చర్చలు జరిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జనసేనాని 32 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలు ఇవ్వాలని కోరారు. ఇందులో 20 స్థానాలిచ్చేందుకు చంద్రబాబు అంగీకరించారని.. వాటిపై ఏకాభిప్రాయం కూడా కుదిరిందని జనసేన వర్గాలు తెలిపాయి. టీడీపీ మరో ఐదు స్థానాలు ఇచ్చే అవకాశం ఉందని, 27 ఇవ్వాలని పవన్ కోరుతున్నారని అంటున్నాయి. అలాగే కాకినాడ, మచిలీపట్నం ఎంపీ సీట్లను ఇప్పటికే జనసేనకు ఇచ్చారు. తాజాగా అనకాపల్లి గానీ, తిరుపతి గానీ ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలిసింది. ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖపట్నం జిల్లాలో సీట్ల సర్దుబాటే ఈ పార్టీలకు కష్టతరంగా ఉన్నట్లు సమాచారం.



నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

జయజయ హే తెలంగాణ


(మొదటిపేజీ తరువాయి)

దక్కుతుందని భావించారని, కానీ గత పదేళ్లుగా తెలంగాణలో రాజరిక నడవడికే కనిపించిందని మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. క్యాబినెట్ భేటీ ముగిసిన తర్వాత వారు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర చిహ్నం ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను ప్రతిబింబించేలా లేవన్నారు. తెలంగాణ తల్లి అంటే ఒక వ్యక్తి గుర్తుకు వచ్చేలా రూపొందించారని.. రాష్ట్ర చిహ్నం కూడా రాచరిక పోకడలను ప్రతిబింబించేలా ఉందని.. అందుకే వాటిలో కొన్ని మార్పులు చేపట్టాలని నిర్ణయించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, ఉద్యమకారులు, కవులు, కళాకారులు, యోధుల ఆలోచనలకు అనుగుణంగా, వారి సూచనల మేరకు, వారితో చర్చించిన తర్వాతనే తెలంగాణ తల్లి, రాష్ట్ర చిహ్నంలో మార్పులుంటాయని మంత్రులు వెల్లడించారు. అహంకారంతో, అహంభావంతో కూడిన సింబల్స్ మారుతాయన్నారు. కవి అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా మార్చామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆరు గ్యారెంటీల్లో భాగంగా రెండింటిని అమలు చేశామని.. వాటిలో ఒకటైన మహాలక్ష్మి పథకం ద్వారా శనివారం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 14.25 కోట్ల మంది బస్సులో ఉచిత ప్రయాణం చేశారని మంత్రులు వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో మరో రెండు గ్యారెంటీల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేస్తారని తెలిపారు. ప్రజలు ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకున్నారని, వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో వమ్ము కానీయబోమన్నారు. గ్యారెంటీల అమలుపై అవాకులు, చెవాకులు పేలుతున్న బీఆర్‌ఎస్ నేతల నోటికి చెక్ పెడతామన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత కుల గణన చేపడతామని హామీ ఇచ్చామని, అందులో భాగంగానే కులగణనకు క్యాబినెట్‌లో ఆమోదం తెలిపామని మంత్రులు వెల్లడించారు. ఇక రాష్ట్ర విభజన తర్వాత కేంద్రం వాహనాల రిజిస్ట్రేషన్ కోసం టీజీగా గెజిట్ ఇస్తే.. గత ప్రభుత్వం తమ పార్టీ పేరు గుర్తొచ్చేలా టీఎస్‌గా మార్చిందని మంత్రులు ఆరోపించారు. నియమాలు, నిబంధనలను ఏ మాత్రం పాటించలేదని మంత్రులు మండిపడ్డారు. అందుకే వాహనాల రిజిస్ట్రేషన్‌కు టీఎస్ బదులు టీజీ అనే అక్షరాలను వాడాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 8 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించుకుంటామని, తొలుత గవర్నర్ ప్రసంగం ఉంటుందని, ఆ తర్వాత బడ్జెట్‌ను ప్రవేశపెడతామని స్పష్టం చేశారు. సభ ఎన్ని రోజులు ఉండేదీ బీఏసీ భేటీ తర్వాత తేలుతుందన్నారు. అలాగే ఖైదీల క్షమాబిక్షకు సంబంధించి కూడా తమ భేటీలో చర్చించినట్లు తెలిపారు. వారి విడుదలకు ఎదురౌతున్న న్యాయపరమైన చిక్కులను తొలగించేందుకు అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

బీఆర్‌ఎస్‌కు ఇంగిత జ్ఞానం ఉండాలి

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ఎటువంటి సందేహం అక్కర్లేదని మంత్రులు మరోమారు స్పష్టం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఖజాను ఖాళీ చేసినప్పటికీ.. ప్రజలకిచ్చిన హామీలను తాము నెరవేరుస్తామన్నారు. కృష్ణా, గోదావరి నదీజలాల విషయంలో బీఆర్‌ఎస్ ఏమైనా పోరాటం చేసిందా? అని నిలదీశారు. దీనిపై కేసీఆర్, హరీశ్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మంత్రులు మండిపడ్డారు. ప్రజలను మభ్యపెట్టి, నదీజలాల్లో రాష్ట్రవాటా రాకుండా చేశారని ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలతో లోపాయికారీ ఒప్పందాలను చేసుకుంది బీఆర్‌ఎస్సే అని నిప్పులు చెరిగారు. అసలు ఆ పార్టీకి ఇంగిత జ్ఞానం లేదని దుయ్యబట్టారు. నదీజలాల ఒప్పందాలకు సూత్రధారులు, పాత్రధారులు ఎవరని మంత్రులు ప్రశ్నించారు. 2014 నుంచి బీఆర్‌ఎస్ ఏం వెలగబెట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించే విషయమై సీఎం అధ్యక్షతన మీటింగ్ జరిగిందని.. దానిపై కసరత్తు చేస్తున్నామని మంత్రులు వెల్లడించారు.

అందెశ్రీ కలం నుంచి..



స్వరాష్ట్రం ఏర్పడ్డ 10 ఏళ్లకు తెలంగాణకు.. 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా అధికారికంగా ప్రకటించారు. నిజానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన రోజుల్లో.. ఈ గీతాన్ని తెలంగాణలోని ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థలో ఆలపించారు. అప్పటి తెలంగాణ ఉద్యమ సారథి, మాజీ సీఎం కేసీఆర్ అప్పట్లో ఈ గీతానికి పలు సవరణలు చేశారు. జనగామ జిల్లా రేబర్తికి చెందిన అందెశ్రీ 11 చరణాలతో ఈ గీతాన్ని రాయగా.. అందులోని నాలుగు చరణాలను రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామన్నారు. 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించినా.. రాష్ట్ర గీతం మాత్రం అధికారికం కాలేదు. అయితే.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మాత్రం ఈ గీతాలాపన ఆగలేదు. పది జిల్లాలు కాస్తా 33 కావడంతో.. ఓ చరణంలో 'పది జిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం' అనే పదంలో పది జిల్లాలను 'పలు జిల్లల' అని మార్చి మరీ స్కూళ్లలో కొనసాగిస్తున్నారు. 2021లో బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తారు. దాంతో.. అప్పటి సీఎం కేసీఆర్.. ఆ పాటను ప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించలేదని పేర్కొన్నారు. రాష్ట్ర గీతాన్ని రాసుకున్నప్పుడు దాని గురించి ప్రకటిస్తామన్నా రు. ఇప్పుడు ప్రభుత్వం మారి, రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో.. 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించారు.

'ఆంధ్రజ్యోతి' పాఠకుల కోసం ఆ గీతం పల్లవి, 4 చరణాలు

జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల తల్లీ నీరాజనం
పది జిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ.. జైజై తెలంగాణ

పోతనది పురిటిగడ్డ, రుద్రమది వీరగడ్డ
గండరగండడు కొమురం భీముడే నీ బిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప
గోలుకొండ నవాబుల గొప్ప వెలుగే చార్‌మినార్
జై తెలంగాణ.. జైజై తెలంగాణ

జానపద జన జీవన జావళీలు జాలువారే
కవి గాయక వైతాళిక కళలా మంజీరాలు
జాతిని జాగృత పరిచే గీతాల జన జాతర
అనునిత్యం నీ గానం అమ్మ నీవే మా ప్రాణం
జై తెలంగాణ.. జైజై తెలంగాణ

సిరివెలుగుల విరజిమ్మే సింగరేణి బంగారం
అణువణువు ఖనిజాలే నీ తనువుకు సింగారం
సహజమైన వన సంపద సక్కనైన పూవుల పొద
సిరులు పండే సారమున్న మాగాణే కరములీయ
జై తెలంగాణ.. జైజై తెలంగాణ

గోదావరి కృష్ణమ్మలు మన బీళ్లకు మళ్లాలి
పచ్చని మాగాణాల్లో పసిడి సిరులు పండాలి
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి
ప్రత్యేక రాష్ట్రాన ప్రజల కలలు పండాలి
స్వరాష్ట్రమై తెలంగాణ స్వర్ణయుగం కావాలి
జై తెలంగాణ.. జైజై తెలంగాణ

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై నివేదిక ఇవ్వండి

- నిర్ణీత గడువు పెట్టుకోండి
- కేబినేట్ సబ్ కమిటీకి సూచించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూతపడిన నిజాం చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు వీలైనంత త్వరలో సమగ్ర నివేదికను తయారుచేసి అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినేట్ సబ్ కమిటీకి సూచించారు. ఆదివారం సచివాలయంలో సబ్‌కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. బోధన్, ముత్యంపేటలో మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలకు సంబంధించిన పాత బకాయిలు, ఆర్థిక ఇబ్బందులపై విశ్లేషించారు. ఆయా రాష్ట్రాల్లో చెరుకు రైతుల అవసరాలు, ఇప్పుడు వారు పడుతున్న సాధక బాధకాలపై సమగ్రంగా చర్చించారు. మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపించేందుకు ఏం చేయాలి? ఎలాంటి మార్గాలను అనుసరించాలో చర్చించి తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి కమిటీకి సూచించారు. నిర్ణీత గడువు పెట్టుకొని నివేదిక తయారుచేయాలని, నివేదిక ఆధారంగా మరోసారి సమావేశమవుదామని కమిటీ సభ్యులతో సీఎం అన్నారు.



అనితా రామచంద్రన్.. పంచాయతీరాజ్‌కు

- టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిగా నవీన్ నికోలస్
- ఐఅండ్‌పీఆర్ కమిషనర్‌గా హనుమంతరావు
- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిగా ఉన్న అనితా రామచంద్రన్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. తెలంగాణ వచ్చిన తొలినాళ్లలో కూడా ఆమె ఈ పోస్టులో పనిచేశారు. ఆ తర్వాత భువనగిరి కలెక్టర్‌గా, అక్కడి నుంచి టీఎస్‌పీఎస్సీకి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శిగా ఉన్న ఎం.హనుమంతరావును సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా నియమించారు. ఈ హోదాలో ఈయన జీఏడీ ప్రత్యేక కార్యదర్శిగా కూడా అదనపు బాధ్యతలు చేపడతారు. సమాచార శాఖ కమిషనర్‌గా ఉన్న కె.అశోక్‌రెడ్డిని అక్కడి నుంచి తప్పించి.. ఉద్యాన శాఖ డైరెక్టర్‌గా నియమించారు. ఆదివారం రాత్రి ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్(సీఆర్వో)గా ఉన్న బాలమాయాదేవిని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా.. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న జి.ఫణీంద్ర రెడ్డిని హైదరాబాద్ సీఆర్వోగా బదిలీచేశారు. ఫిషరీస్ కమిషనర్‌గా ఉన్న లచ్చిరాం భూక్యాను ఆయన సొంత శాఖ భారతీయ రైల్వేలకు పంపించారు. ఫిషరీస్ డైరెక్టర్ బాధ్యతలను వ్యవసాయ డైరెక్టర్‌గా ఉన్న బి.గోపీకి అదనంగా అప్పగించారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న నిర్మలా కాంతి వెస్లీని మహిళా శిశు సంక్షేమం, అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. మహిళా ఆర్థిక సంస్థ ఎండీగా కూడా ఈమెకు అదనపు బాధ్యతలను అప్పగించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్), ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్(టీటీడబ్ల్యుఆర్‌ఈఐఎస్) కార్యదర్శిగా ఉన్న నవీన్ నికోలస్‌ను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.సీతాలక్ష్మిని టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్, టీటీడబ్ల్యుఆర్‌ఈఐఎస్ కార్యదర్శిగా నియమించారు. జూపార్క్ డైరెక్టర్‌గా ఉన్న ఐఎఫ్‌ఎస్ అధికారి వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్‌ను పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా బదిలీచేశారు.



విఠలాచార్య, గడ్డం సమ్మయ్య, సోమ్‌లాల్, ఆనందాచారి, దాసరి కొండప్ప, ఉమామహేశ్వరికి చెక్కులు అందజేస్తున్న రేవంత్, వెంకయ్య, చిరంజీవి, భట్టి

తెలుగు వాళ్లు ఎక్కడున్నా మన వాళ్లే

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సినీనటుడు చిరంజీవిని శాలువా, జ్ఞాపికలతో రేవంత్ సన్మానించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీతలు దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, కూరెళ్ల విఠలాచార్య, వేలు ఆనందాచారి, కేతావత్ సోమ్‌లాల్, ఉమామహేశ్వరికి రూ.25లక్షల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. "దేశ రాజకీయాల్లో నిలువెత్తు తెలుగుదనం ముప్పవరపు వెంకయ్యనాయుడును సన్మానించడమంటే మనల్ని మనం గౌరవించుకోవడమే. విశ్రాంతి, విరామం ఎరుగని నాయకుడు. చట్టసభల్లో ఆయన వ్యవహారశైలి ఆదర్శనీయం. అంతటి గొప్ప నాయకుడు వెంకయ్య నాయుడు రాష్ట్రపతి అవుతారనుకొన్నా. ఆ పదవికి కావాల్సిన అర్హతలన్నీ ఆయనకు ఉన్నాయి. నీలం సంజీవరెడ్డి తర్వాత రెండవ తెలుగు వాడిగా వెంకయ్య రాష్ట్రపతి అవ్వాలి, ఆయనకు ఆ అవకాశం రావాలి" అని రేవంత్ ఆకాంక్షించారు. అలాగే, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం సినీ నటుడు చిరంజీవి సొంతమని రేవంత్ కొనియాడారు. 150పై చిలుకు సినిమాల్లో నటించి, జాతీయ స్థాయి గుర్తింపు పొందినా నిరాడంబరంగా ఉండడం చిరంజీవి ఔన్నత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి గొప్పవ్యక్తులను సన్మానించుకోవడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఇది రాజకీయాలకు అతీతమైన సభ అని, మంచి సంప్రదాయాన్ని నెలకొల్పే ప్రయత్నంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పద్మ పురస్కార గ్రహీతలను సత్కరించుకొంటున్నామని తెలిపారు. "కవులు, కళాకారులు వయసు మళ్లాక వెనక్కి తిరిగి చూసుకొంటే చప్పట్లు, దుప్పట్లే మిగులుతుంటాయి. చాలామంది ఇంటి ఖర్చులకూ ఇబ్బంది పడుతుంటారు. అందుకే పద్మశ్రీ గ్రహీతలైన పేదకవులు, కళాకారులందరికీ ప్రతి నెలా రూ.25వేల చొప్పున పింఛన్ అందిస్తాం" అని ప్రకటించారు.



వెంకయ్యను సన్మానిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు భట్టి, కోమటిరెడ్డి, పొంగులేటి, జూపల్లి

ఇది మంచి సంప్రదాయం

సాధారణంగా అవార్డులు, సన్మానాలకు తాను దూరంగా ఉంటానని, కానీ.. ప్రధాని మోదీ మీద గౌరవంతో పద్మ విభూషణ్ పురస్కారాన్ని కాదనలేకపోయానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను గుర్తించి పద్మ పురస్కారాలతో గౌరవించడం ఒక ఎత్తయితే, అందులో తెలుగు వారిని పిలిచి ఇలా సన్మానించడం ద్వారా మంచి సంప్రదాయానికి సీఎం రేవంత్ నాంది పలికారని ప్రశంసించారు. చైతన్యశీలి, ఉత్సాహవంతుడైన రేవంత్ పాలనలో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. "తెలుగు కళామతల్లికి ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్ రెండు కళ్లు అయితే... మెగాస్టార్ చిరంజీవి మూడో కన్ను. నటనలో ప్రమాణాలు పాటించిన వ్యక్తి. ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపడేది లేదనడానికి చిరంజీవి సినీ జీవితమే ఉదాహరణ" అని వ్యాఖ్యానించారు. పట్టుదల, కృషి, సమయపాలన, క్రమశిక్షణ ఉంటే ప్రతి ఒక్కరూ ఉన్నతశిఖరాలకు చేరుకోవచ్చనడానికి వేదికపై కొలువుదీరిన వారే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా జీవనంలో ఉన్న వ్యక్తులు కొన్ని విలువలు పాటించాలని, ప్రస్తుతం చట్టసభల్లో నేతల గలాటాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. బూతులు మాట్లాడే నేతలకు పోలింగ్ బూత్‌లోనే ప్రజలు తగిన సమాధానం చెప్పాలని సూచించారు. కులం, మతం, ప్రాంతం, జిల్లా, భాష, యాస.. అంటూ జనాన్ని రెచ్చగొట్టే వ్యక్తులకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

మీ అభిమానం కంటే అవార్డు పెద్దదికాదు

"ఎక్కడ కళాకారులు గౌరవించబడతారో, సన్మానించబడతారో ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని పెద్దలంటారు. ఈ సన్మాన సభ చూస్తుంటే, నాకు అక్షర సత్యం అనిపిస్తోంది. అవార్డులు ప్రకటించిన వెంటనే స్పందించి సన్మానించడం ఇంతవరకూ ఎన్నడూ జరగలేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నంది అవార్డులు గత చరిత్రలా మారాయి. కానీ యంగ్ అండ్ డైనమిక్ లీడర్ రేవంత్‌రెడ్డి నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని తిరిగి కొనసాగించనున్నట్లు ప్రకటించడమేగాక, అవార్డుకు ప్రజాగాయకుడు గద్దర్ పేరు పెట్టడం సముచితం.. ముదావహం" అని సినీనటుడు చిరంజీవి అన్నారు. విశాఖ ఉక్కు పోరాట సమయంలో విద్యార్థి నాయకుడిగా వెంకయ్య పిలుపు ఇస్తే, నర్సాపురంలో తాను ధర్నాలో పాల్గొన్నానని గుర్తుచేశారు. ఆనాటి నుంచి తనకు ఆయన ఆరాధ్యనీయుడని, ఆయన వాగ్ధాటికి తాను పెద్ద అభిమానినని పేర్కొన్నారు. అభిమానుల ప్రేమ కంటే తనకు ఈ అవార్డు పెద్దదేమీ కాదని అన్నారు. సామాజిక బాధ్యతగా 25 ఏళ్ల కిందట బ్లడ్ బ్యాంక్ నెలకొల్పానని, సినీ ప్రేక్షకులను అలరిస్తూనే సేవను కొనసాగిస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయాలు దిగజారిపోతున్నాయని, వ్యక్తిగత విమర్శలు చేసే వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కాగా, కార్యక్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లను లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకోగా.. వాగ్వాదం చోటుచేసుకొంది.

బాధ్యత మరింత పెరిగింది

మోత్కూరు: పద్మశ్రీ పురస్కారంతో మరింత బాధ్యత పెరిగిందని ప్రముఖ కవి కూరెళ్ల విఠలాచార్య అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.25లక్షల నగదుతో స్థానిక గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

బీఆర్ఎస్ శకం ముగిసింది: కె.లక్ష్మణ్



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ శకం ముగిసిందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పదికి తక్కువ కాకుండా సీట్లు, 35 శాతం ఓట్లు సాధించడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని నిలువరించేందుకే బీఆర్ఎస్‌ను బతికించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని, ఆ రెండు పార్టీలు తోడు దొంగలేనని అన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలును సాకుగా చూపించి ఆరు గ్యారంటీల అమలును వాయిదా వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని లక్ష్మణ్ ఆరోపించారు. ఇండియా కూటమికి ఎజెండా లేదని, నాయకుడు ఎవరో తేల్చుకోలేక విపక్షాలు సతమతమవుతున్నాయని, దేశంలోని ప్రాంతీయపార్టీలు, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఒక్కటై పోటీచేసినా బీజేపీని ఓడించలేవని తెలిపారు.

పూలే విగ్రహం కోసం 12న మహాధర్నా: కవిత



అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 12న మహాధర్నాను నిర్వహించనున్నట్లు భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా ప్రకటించాయి. ఈ విషయమై జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం ఒక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ఈ ధర్నాలో బీసీ, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మేధావులు, ప్రొఫెసర్లు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. అదేవిధంగా అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు 6 నుంచి 10వ తేదీ వరకు వరంగల్, కరీంనగర్, వికారాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ, సంగారెడ్డిల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు కవిత వెల్లడించారు.

ఆర్టీసీని పునర్నిర్మించాలి: కోదండరాం

- టీఎంయూ ప్రధాన కార్యదర్శిగా అశ్వత్థామరెడ్డి ఎన్నిక..

హైదరాబాద్/మన్సూరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల కాలంలో ఆర్థిక సమస్యలతో అస్తవ్యస్తంగా మారిన ఆర్టీసీ పునర్నిర్మాణంలో కార్మికులు శక్తివంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరముందని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్న యూనియన్లను కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిందని.. యూనియన్ల పునరుద్ధరణకు కృషి చేస్తానని చెప్పారు. ఆర్టీసీ ఆస్తులను ఆక్రమించుకునేందుకే బీఆర్ఎస్ సర్కారు.. ప్రభుత్వంలో విలీన ప్రక్రియకు తెరలేపిందని విమర్శించారు. ఆదివారం ఎల్బీనగర్‌లో ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర మహాసభ సంఘం అధ్యక్షుడు రామచందర్ అధ్యక్షతన జరగ్గా.. ముఖ్య అతిథిగా కోదండరాం పాల్గొని ప్రసంగించారు. కార్మికులు ఐక్యతతో పనిచేసి ఆర్టీసీకి పూర్వవైభవం తేవాలన్నారు. 'తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషించినా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సరైన ప్రాధాన్యత దక్కలేదు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ప్రభుత్వం సానుకూలంగా ఉంది. పేరుకుపోయిన బకాయిలను కార్మికులకు చెల్లింపులు చేయించడంతో పాటు న్యాయ సమ్మతమైన డిమాండ్లను సాధించుకునేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి' అని సూచించారు. సమావేశంలో టీఎంయూ ప్రధాన కార్యదర్శిగా అశ్వత్థామరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారం రోజుల్లో టీఎంయూ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్టు అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో టీఎంయూ నేతలు శంకర్, రాజలింగం, వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ: గాలి వినోద్



బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఉస్మానియా, తెలంగాణ యూనివర్సిటీల మాజీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ లా, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ప్రకటించారు. మోదీ పాలన నియంతృత్వానికి నిదర్శనమని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రాహుల్ గాంధీని ప్రధానిగా చూడడమే ధ్యేయంగా ఆ పార్టీలో చేరుతున్నట్లు ఆయన వివరించారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని రుద్దుతోందని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడమే లక్ష్యంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

కేటీఆర్‌కు వేలకోట్ల బినామీ ఆస్తులు: గజ్జెలకాంతం

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌కు పలువురు బినామీలున్నారని, వారి పేరిట వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నాయని కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం ఆరోపించారు. వాటన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో వెలుగులోకి తెస్తుందని చెప్పారు. గాంధీ కుటుంబం నుంచి వచ్చిన ప్రియాంక కాలి గోటికి కూడా ఎమ్మెల్సీ కవిత సరిపోదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో అక్రమ సంపాదనతో దుబాయ్‌లో వేల కోట్ల విలువ చేసే ఇళ్లను కవిత కొన్నారని ఆరోపించారు.

సంక్షేమమే మా అజెండా.. సామాజిక న్యాయమే మా జెండా!

రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రజల సంక్షేమమే మా అజెండా... సామాజిక న్యాయమే మా జెండా" అని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం కేబినెట్ సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడిన ఆయన.. బీసీ కులాల చిరకాల వాంఛ అయిన కులగణనకు ఆమోదం తెలిపిన తెలంగాణ కేబినెట్‌కు ధన్యవాదాలు తెలిపారు. 'మేమెంతో... మాకంత!' అనే నినాదాన్ని నిజం చేయటానికి కులగణన తొలి అడుగని అన్నారు. ఈ తొలి అడుగుకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అణగారిన వర్గాల ఆకాంక్షలు నెరవేరాలంటే జనాభా లెక్కలు తేలాలని, అందుకే కులగణనకు కేబినెట్ ఆమోదముద్ర వేసిందని చెప్పారు. బీసీలు అంటే వెనకబడిన కులాలు కాదని రాష్ట్రానికి, దేశానికి వెన్నెముక లాంటి వర్గాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీసీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందనటానికి కేబినెట్ తీసుకున్న నిర్ణయమే సాక్ష్యమని పొన్నం పేర్కొన్నారు.

అమెరికా ప్రోత్సాహంతోనే పాలస్తీనాలో మారణహోమం: డి. రాజా

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అమెరికా సామ్రాజ్యవాదం, యూరోపియన్ సెక్యూలర్ దేశాలు ఇస్తున్న ప్రోత్సాహంతోనే పాలస్తీనాలో మారణహోమం జరుగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలస్తీనాకు మద్దతుగా సీపీఐ ఆధ్వర్యంలో సంఘీభావ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి డి. రాజా హాజరై మాట్లాడారు. ఇజ్రాయెల్ అహంకారం వల్లనే వేలాది మంది పాలస్తీనా ప్రజలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశానిది స్వతంత్ర విదేశాంగ విధానమని, అయితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయెల్‌కు సంబంధించి తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు భారతదేశం గైర్హాజరు కావడం మోదీ చేసిన తప్పన్నారు. ఇజ్రాయెల్ పాలస్తీనాపై చేసిన దాడిలో వేలమంది పిల్లలతో పాటు మరో 20 వేల మంది మృతి చెందారని 27 వేల మందిని జైలులో పెట్టారని పాలస్తీనా రాయబారి హెచ్.ఈ.అబుల్ పేర్కొన్నారు. 122 మంది పాత్రికేయులు కూడా మృతి చెందారన్నారు. సభ అనంతరం డి.రాజా సంఘీభావ నిధిగా 50 వేల రూపాయలను విరాళంగా పాలస్తీనా రాయబారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో చాడా వెంకటరెడ్డి, తెలంగాణ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాపాలే.. శాపాలు

(మొదటి పేజీ తరువాయి)



కేటాయింపులపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేస్తామని, రెండు రోజులపాటు ప్రత్యేకంగా చర్చిద్దామని సీఎం సూచించారు. ఆ రెండు రోజులపాటు అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని, ఎవరు ద్రోహియో తేలిపోతుందని సవాల్ విసిరారు. కృష్ణా నీటి పంపిణీపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖతో కలిసి ఆదివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'కేసీఆర్‌కు సూటిగా సవాల్ విసురుతున్నా. అసెంబ్లీ సమావేశాల్లో ప్రాజెక్టులు, జలాలపై చర్చ పెడదాం. ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేస్తాం. రెండు రోజులపాటు దీనిపై చర్చిద్దాం. చాలవంటే సమావేశాలను పొడిగిద్దాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత.. అందరూ రండి. అవసరమైతే.. ఉమ్మడి సమావేశాలు నిర్వహిద్దాం. మీకు నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రండి. మీకు పూర్తి అవకాశం ఇస్తాం. ఒక్క నిమిషం కూడా మైక్ కట్ చేయం. నిజానిజాలేంటో నిరూపిద్దాం" అని సీఎం రేవంత్ అన్నారు. ఎవరు తెలంగాణకు అన్యాయం చేశారో ఈ చర్చల్లో తేలిపోతుందన్నారు. "కాళ్ల నొప్పి అంటూ అసెంబ్లీకి రాకుండా తప్పించుకోవద్దు. నీకున్న నొప్పి ఏంటో నాకు తెలుసు" అంటూ కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు.

కేసీఆర్, హరీశ్ నిర్ణయాలతోనే నష్టం..

కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్.. వారు చేసిన పాపాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్‌పై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. "నల్లగొండకు వెళ్లి నిరసన తెలపడం కాదు.. ముందు అసెంబ్లీలో చర్చ పెడదాం" అని అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం చేసినప్పుడే కృష్ణా, గోదావరి జలాల పంపిణీని కేంద్రానికి అప్పగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారని, ఎంపీగా ఉండి కేసీఆర్ అందుకు ఒప్పుకొన్నారని తెలిపారు. పునర్విభజన చట్టం-2014లోని పార్ట్-9లోని సెక్షన్ 84, 85, 86, 87, 88, 89 ప్రకారం ప్రాజెక్టులను బోర్డుల ద్వారా కేంద్రానికి అప్పగించడానికి పునాది పడిందే కేసీఆర్ ఎంపీగా ఉన్నప్పుడు అని పేర్కొన్నారు. 2014 ఫిబ్రవరి 2న పార్లమెంట్‌లో చట్టం ఆమోదం పొందిన సమయంలో టీఆర్ఎస్ అభ్యంతరం చెప్పకపోగా.. కేసీఆర్ ఓటు వేసి చట్టాన్ని ఆమోదింపజేశారని గుర్తు చేశారు. దీనికి పూర్తి బాధ్యత ఎంపీగా కేసీఆర్‌ది, రాజ్యసభ సభ్యుడిగా కేశవరావుదేనని రేవంత్ స్పష్టం చేశారు. చట్టంలోని ప్రతి అక్షరాన్ని తానే సూచించానని కేసీఆర్ చెప్పారన్నారు. "ఈ పుస్తకానికి, ఈ చట్టానికి మీరే రచయిత కదా! ఈ అన్యాయానికి పునాది పడింది అప్పుడే. ఉమ్మడి రాష్ట్రానికి ఉన్న 811 టీఎంసీల నీళ్లపై పంపకాలు ఎలా జరగాలో ఇరు రాష్ట్రాల సీఎంలతో చర్చించారు. 2015 జూన్ 18న కేఆర్ఎంబీ సమావేశం నిర్వహించింది. 299 టీఎంసీలు తెలంగాణకు, 511 టీఎంసీలను ఏపీకి కేటాయించేందుకు కేసీఆర్, హరీశ్ ఆదేశాల మేరకు అప్పటి అధికారులు సంతకాలు పెట్టారు. 50 శాతం వాటా అడగకుండా రాష్ట్రానికి అన్యాయం చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంతం 68 శాతం తెలంగాణలో ఉంది. అంతర్జాతీయ నీటి విధి విధానాల ప్రకారం పరివాహక ప్రాంతానికి తగ్గట్టుగా నీటి కేటాయింపులు ఉండాలి. అలా అయితే, 500 టీఎంసీలకు పైచిలుకు తెలంగాణకు కేటాయించాలి. కానీ, సంతకాలు పెట్టి మరీ తెలంగాణకు రావాల్సిన నీటిని ఏపీకి ధారాదత్తం చేసిన దుర్మార్గుడు కేసీఆర్" అని రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 15 ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తామని 2022 మే 27న జరిగిన బోర్డు 16వ సమావేశంలో అంగీకరించారని తెలిపారు. మళ్లీ 2023 మే 19న కేఆర్ఎంబీ 17వ సమావేశంలో ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తున్నట్లు కేసీఆర్ అంగీకరించారని గుర్తు చేశారు. 2023 బడ్జెట్ పద్దు బుక్‌లో గోదావరి, కృష్ణా బోర్డులకు రూ.400 కోట్లు కేటాయించారని, ప్రాజెక్టులను కేంద్రానికి స్వాధీనం చేయడం మామా, అల్లుళ్లు కలిసే చేశారని విమర్శించారు కేసీఆర్ ఆమోదంతోనే తెలంగాణకు తీవ్ర నష్టం జరిగే రాయలసీమ లిఫ్టు ప్రాజెక్టును ఏపీ చేపట్టిందని సీఎం రేవంత్ అన్నారు. 2020 జనవరి 14న ఏపీ సీఎం జగన్ ప్రగతి భవన్ లో కేసీఆర్‌ను కలిసి కృష్ణా జలాలపై ఆరు గంటలు సమీక్ష చేశారని తెలిపారు. అక్కడే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రోజుకు 8 టీఎంసీలను తరలించుకుపోయేందుకు కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్టు ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం 2020 మే 5న జీవో విడుదల చేసిందని, శ్రీశైలం ఎఫ్ఆర్ఎల్ 834 అడుగులు కాగా, 797 అగుడుల నుంచే నీటిని తరలించేందుకు దీనిని చేపట్టారని తెలిపారు. దాంతో శ్రీశైలం ప్రాజెక్టులో బురద కూడా మిగలదని అన్నారు. 2020 ఆగస్టు 5న కేఆర్ఎంబీ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయిస్తే.. అందుకు హాజరు కాకుండా ఆగస్టు 20 వరకు తాము బిజీగా ఉన్నామంటూ అప్పటి నీటిపారుదల శాఖ కార్యదర్శి రజత్‌కుమార్ లేఖ రాశారని చెప్పారు. 2020 ఆగస్టు 10న రాయలసీమ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన టెండర్ ఖరారు కావాల్సి ఉందని, టెండర్ ఆపేందుకు సమావేశానికి హాజరు కావాల్సిందిపోయి.. తాము రాలేమంటూ లేఖ రాశారని అన్నారు. తద్వారా టెండర్ ఒప్పందాలు పూర్తయ్యేందుకు సహకరించారని ఆరోపించారు.

ఇప్పుడు రమ్మను జగన్మోహన్‌రెడ్డిని..

ఎన్నికల పోలింగ్ రోజు ఏపీ పోలీసులు తుపాకులు పట్టుకుని నాగార్జునసాగర్‌ను ఆక్రమించుకున్నారని, అప్పుడు కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. "రండ పనులు చేసింది నువ్వు. లొంగిపోయింది నువ్వు. అందుకే జగన్మోహన్‌రెడ్డి వచ్చి ప్రాజెక్టును స్వాధీనం చేసుకున్నాడు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రమ్మను జగన్మోహన్‌రెడ్డిని" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లంకె బిందె లాంటి తెలంగాణ రాష్ట్రాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం మట్టి కుండలుగా మార్చిందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే.. మేడిగడ్డ బ్యారేజీ పనికివచ్చే పరిస్థితి కనిపించడం లేదని, అయితే.. దీనిపై నిపుణుల కమిటీ నివేదిక మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు హైకోర్టు సీజేకు లేఖ రాశామని, ఆయన నిర్ణయం మేరకు దీనిపై విచారణ జరుగుతుందని చెప్పారు. కాగా, రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు మరణ శాసనం లాంటివని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. తాము వాటిని మార్చే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. రూ.95 వేల కోట్ల వ్యయం చేసిన కాళేశ్వరం కూలిపోయిందని, ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రానికి ప్రాజెక్టును అప్పగించబోమని స్పష్టం చేశారు.

పదవులకు ఆశపడి పెదవులు మూసుకున్నారు..

2004లో కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడ్డ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో టీఆర్ఎస్ భాగస్వామి అని రేవంత్‌రెడ్డి అన్నారు. పోతిరెడ్డిపాడు పొక్క పెద్దది చేసే నిర్ణయం జరిగినపుడు హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డిలే మంత్రులుగా ఉన్నారని, కేంద్రంలో కేసీఆర్ మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. పదవులకు ఆశపడి పెదవులు మూసుకుంది మీరు కాదా? అని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్ల తరలించుకపోతుంటే కొట్లాడింది తెలంగాణ కాంగ్రెస్ నేతలు పీజేఆర్, మర్రి శశిధర్‌రెడ్డి అని, వాళ్లకు సహకరించకుండా వైఎస్‌కు లొంగిపోయింది కేసీఆర్ అని ఆరోపించారు. ముచ్చుమర్రి ద్వారా చంద్రబాబు కూడా దెబ్బ వేశారన్నారు. కేసీఆర్ ధనదాహంతో తెలంగాణ నీటిని తరలించుకుపోయేందుకు సహకరించారని విమర్శించారు. ఇలా ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీల నీటిని తరలించడానికి అవకాశం ఉండగా, తెలంగాణలోని కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ వంటి అన్ని ప్రాజెక్టులు పూర్తయినా.. రోజుకు రెండు టీఎంసీల లోపే నీటిని వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. తెలంగాణ హక్కులను కాలరాస్తూ నీటి దొంగలు కృష్ణా జలాలను దారిదోపిడీ చేస్తున్నారని, ఈ జలదోపిడీకి కారణం కేసీఆరేనని రేవంత్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని, పాలమూరు-రంగారెడ్డి పడావు పడ్డదని అన్నారు. ఇన్ని పాపాలు చేసి ఇప్పుడు ప్రజా ఉద్యమాలు చేస్తామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. గ్రావిటీ ద్వారా నల్లగొండకు నీటిని అందించే ఎస్ఎల్‌బీసీలో మొత్తం 40 కిలోమీటర్ల టన్నెల్‌ను తవ్వాల్సి ఉండగా, ఉమ్మడి రాష్ట్రంలోనే 30 కిలో మీటర్ల మేర పూర్తి చేశారని, టీఆర్ఎస్ పదేళ్ల కాలంలో కిలోమీటర్ చేశారని చెప్పారు. 60 ఏళ్ల ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన దానికంటే ఎక్కువ నిర్లక్ష్యం ఈ పదేళ్లలో జరిగిందన్నారు. జల పంపిణీలో రాష్ట్రానికి ఇప్పటివరకు జరిగిన నష్టాన్ని సరిచేయడానికి తాము ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా నీటి పంపకం విషయంలో పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాల కేటాయింపులను కలిపి చూడాల్సిందిగా కేంద్ర మంత్రి షెకావత్‌ను కోరామన్నారు. తెలంగాణ రాష్ట్ర నీటి వాటాలు, హక్కులు తేలే వరకు ప్రాజెక్టులను బోర్డులకు అప్పగించబోమని స్పష్టం చేసినట్టు చెప్పారు. ఇదే విషయాన్ని పేర్కొంటూ గత జనవరి 27న ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా.. కేంద్రానికి లేఖ రాశారని తెలిపారు.

మేం తిడితే తట్టుకోలేవ్

(మొదటి పేజీ తరువాయి)



అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన విజయోత్సవ సభల్లో కేటీఆర్ మాట్లాడారు. "ఓడిపోయినందుకు బాధపడాల్సిన పని లేదు. ఇదే ప్రజలు మనకు రెండు సార్లు అవకాశమిచ్చారు. మొన్న జరిగింది మన మంచికే అనుకుంటున్న. చీకటి ఉంటేనే వెలుగు విలువ తెలుస్తుంది.. నికృష్టమైన కాంగ్రెస్ పాలన చూస్తేనే కేసీఆర్ గొప్పతనం అర్థమవుతుంది. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే.. కాంగ్రెస్‌ను బొంద పెడదాం" అని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో అన్నారు. ఏ ప్రజలైతే గ్రామాలు, జిల్లాల్లో కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయారో.. వాళ్లే గులాబీ కండువాను వెతుక్కుంటూ వచ్చి లోక్‌సభ, కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తారనే విశ్వాసం ఉందని పేర్కొన్నారు. నెలకు రూ.2,500 కోసం ఆడబిడ్డలు.. రూ.15 వేల రైతు బంధు కోసం అన్నదాతలు.. రూ.4 వేల కోసం పింఛన్‌దారులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. రూ.500కే సిలిండర్ ఎప్పుడిస్తారని, కరెంట్ బిల్లులు సోనియా గాంధీ ఎప్పటి నుంచి చెల్లిస్తుందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. డిసెంబరు 9న చేస్తామన్న రూ.2 లక్షల రైతు రుణ మాఫీ.. ఫిబ్రవరి 9 వచ్చినా కాలేదన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్ హామీలో కటింగ్‌లు పెడతామంటే ప్రజలు ఊరుకోరని చెప్పారు. ఎండాకాలం రాక ముందే విద్యుత్ కోతలు మొదలయ్యాయని చెప్పారు. 6.5 లక్షల ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ తెలిపారు.

మోదీకి భయపడుతున్నావ్

"బడ్జెట్‌లో తెలంగాణకు బీజేపీ ఇచ్చిందేం లేదు.. అయినా సీఎం మాట్లాడటం లేదు. మోదీకి ఎందుకు భయపడుతున్నావు. నీ జుట్టు ఏమైనా ఆయన చేతిలో ఉందా..? కేసులకు భయపడుతున్నావా..? బీజేపీ మీద మాట్లాడే దమ్ము లేదు.. ఇక్కడికి వచ్చి కేసీఆర్‌ను దూషిస్తున్నాడు" అని విమర్శించారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం సహకరించకపోయినా.. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా నడిపించిందని పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో గర్జించేది గులాబీ జెండానే..

"నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉండాలనుకున్నాం.. స్పీకర్ ఎన్నికకు సహకరించాం.. శాసనసభా సమావేశాల్లో కాంగ్రెస్ కార్యకర్త కంటే హీనంగా గవర్నర్ ప్రసంగం ఉంది.. అందుకే విధి లేని పరిస్థితుల్లో ఎదురుదాడికి దిగాం. గత లోక్‌సభ ఎన్నికల్లా కాకుండా ఈసారి గట్టిగా కొట్లాడుదాం. రాష్ట్రం గొంతు పార్లమెంట్‌లో వినపడాలంటే కాంగ్రెస్, బీజేపీతో కాదు. వాళ్లకు ఢిల్లీలో బాసులుంటారు. మోదీ, రాహుల్‌ను చూస్తే వారి గొంతు పెగలదు. పార్లమెంట్‌లో గర్జించేది గులాబీ జెండా మాత్రమే. బీఆర్ఎస్ జెండా లోక్‌సభ ఎన్నికల్లో ఎగిరితేనే రాష్ట్రానికి లాభం. ప్రశ్నించే గొంతు అని మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి.. రక్షణ శాఖ భూములు ఇవ్వకపోతే ఎందుకు ప్రశ్నించలేదు. మల్కాజ్‌గిరిలో కేసీఆర్ ఎవరికి అవకాశం ఇచ్చినా కలిసికట్టుగా కష్టపడదాం" అని కార్యకర్తలతో కేటీఆర్ అన్నారు.

గంపగుత్తగా కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రాజెక్టుల అప్పగింత

ప్రాజెక్టులపై చర్చ పెడితే దిమ్మతిరిగే జవాబు చెప్తాం

ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు సర్కారుదే బాధ్యత

కాంగ్రెస్ 420హామీలను నెరవేర్చే వరకు పోరాటం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

పటాన్‌చెరు, వనస్థలిపురం, ఫిబ్రవరి 4 : పదేళ్లుగా ఒత్తిడి తెచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రాజెక్టులకు కృష్ణా రివర్ బోర్డుకు అప్పగించలేదని కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే బోర్డుకు ప్రాజెక్టులకు గంపగుత్తగా అప్పగిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఈ తీరుతో రాష్ట్రంలో సాగునీటి కొరత ఏర్పడబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా ఆదివారం పటాన్‌చెరు, హస్తినాపురంలో జరిగిన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పాలని బిల్లును తయారు చేసి పాస్ చేసింది గత కాంగ్రెస్ ప్రభుత్వంలోని మీ జైపాల్ రెడ్డి, జైరాం రమేష్ కాదా? అని ప్రశ్నించారు. మంచినీటి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగిస్తే హైదరాబాద్‌తో పాటు నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు సాగు, తాగునీరు సమస్యలు వస్తాయని అన్నారు. పోతిరెడ్డిపాడుపై గట్టిగా పోరాడింది తామేననీ, ఆనాడు టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి.. పోతిరెడ్డిపాడుపై నోరువిప్పలేదని ఇప్పుడు దీనిపై మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదన్నారు. 'ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చపెడితే నీకు దిమ్మతిరిగే సమాధానం చెప్తాం బిడ్డా' అని నిప్పులు చెరిగారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై మాట మార్చడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని, ఆ 420 హామీలను నెరవేర్చేంత వరకు ప్రజాపోరాటం చేస్తామన్నారు. పదుల సంఖ్యలో ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.10 వేల చొప్పున ఇచ్చి ఆదుకునేంత వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. రేవంత్‌రెడ్డి మాటమీద నిలబడేవాడైతే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసి ఓట్లు అడగాలన్నారు. ఆయన దగ్గర విషయం లేదు కాబట్టే బీఆర్ఎస్‌పై విషం చిమ్ముతున్న విషయం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలను ఓట్లు అడిగే నైతిక అర్హత లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరింతగా కష్టపడి త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచి సత్తాచాటాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై ప్రభుత్వ వైఖరి

రైతాంగానికి గొడ్డలిపెట్టు



- సీనియర్ నేతలతో కేసీఆర్ భేటీ
- రేపు తెలంగాణ భవన్‌కు కేసీఆర్
- కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై నిరసనలకు బీఆర్ఎస్ నిర్ణయం!
- త్వరలో నల్లగొండలో కేసీఆర్ సభ

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని బీఆర్ఎస్ వ్యతిరేకించింది. ఆదివారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తన నివాసంలో పార్టీ సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ అనాలోచిత వైఖరి కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులకు గొడ్డలిపెట్టులా మారిందని బీఆర్ఎస్ విమర్శించింది. సాగర్, శ్రీశైలం సహా కృష్ణా నది మీద ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడం వంటి రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ రైతు వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా ఖండించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తదితర ముఖ్య నేతలు, కృష్ణా బేసిన్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, అందుబాటులో ఉన్న నేతలు పాల్గొన్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ సీనియర్ నేతలు సోమవారం మీడియా సమావేశం నిర్వహించే అవకాశం ఉందని, అలాగే మంగళవారం కేసీఆర్ తెలంగాణ భవన్‌కు రానున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. అదే రోజు కృష్ణా నదీ పరివాహక జిల్లాల ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమవుతారని ఆ వర్గాలు వెల్లడించాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో భవిష్యత్తులో సాగు, తాగునీటికి సంకట పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు ప్రజల్లోకి వెళ్లాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగింతపై పార్టీ శ్రేణులతో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని భావిస్తున్నారు. నల్లగొండ వేదికగా ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో త్వరలో నిరసన సభ చేపట్టాలని నిర్ణయించారు. ఈ సభ ద్వారా సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టాలని, తమ వైఖరిని ప్రజల ముందుంచాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

ఎన్‌హెచ్‌ఎం నిధుల్లో రాష్ట్రానికి మొండి చేయి!

గత నాలుగేళ్లలో విడుదలైంది రూ.2,621కోట్లే.. లబ్ధి పొందిన రాష్ట్రాల్లో తెలంగాణకు 15వ స్థానం

- భారీగా నిధులు పొందిన 10 రాష్ట్రాల్లో 7 ఉత్తరాదివే
- నాలుగేళ్లలో ఆ ఏడింటికే రూ.57,210కోట్ల విడుదల
- అన్ని రాష్ట్రాలకూ కలిపి అందింది రూ.1.11లక్షల కోట్లు
- లాబీయింగ్, కేంద్రంతో సఖ్యత ఆధారంగానే నిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌ఎచ్‌ఎం) నిధుల్లో రాష్ట్రానికి ఏటా మొండి చేయి ఎదురవుతోంది. గత నాలుగేళ్లలో ఎన్‌హెచ్‌ఎం కింద తెలంగాణకు రూ. 2621 కోట్లు విడుదల కాగా, లబ్ధి పొందిన రాష్ట్రాల జాబితాలో రాష్ట్రం 15వ స్థానంలో నిలిచింది. నాలుగేళ్లలో విడుదలైన మొత్తం నిధుల్లో రాష్ట్రానికి దక్కింది 2.35శాతం మాత్రమే కావడం గమనార్హం. ఈ మేరకు వివరాలను కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కలిపి రూ.1,11,168 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఎన్‌హెచ్‌ఎం కింద అత్యధిక నిధులు పొందిన రాష్ట్రాల జాబితాలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ రాష్ట్రానికి గడిచిన నాలుగేళ్లలో కేంద్రం రూ.15,872కోట్లు విడుదల చేసింది. ఇచ్చింది. రెండోస్థానంలో ఉన్న మధ్యప్రదేశ్‌కు రూ.9,051 కోట్లు, మూడో స్థానంలో ఉన్న మహారాష్ట్రకు రూ.7661 కోట్లు, నాలుగో స్థానంలో ఉన్న అసోంకు రూ.7,207 కోట్లు, ఐదో స్థానంలో రాజస్థాన్‌కు రూ.7,056 కోట్లు విడుదలయ్యాయి. కేవలం ఆ ఐదు రాష్ట్రాలకే మొత్తం నిధుల్లో 42.12 శాతం అందినట్లు ఆ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర గణాంకాల ప్రకారం ఎన్‌హెచ్‌ఎం నిధుల్లో మెజారిటీ భాగం ఉత్తరాది రాష్ట్రాలకే వెళ్లినట్లు స్పష్టమవుతోంది. అత్యధిక నిధులు పొందిన 10 రాష్ట్రాల్లో 7 ఉత్తరాదివే కావడం గమనార్హం. ఈ ఏడింటికే గత నాలుగేళ్లలో రూ.57,210 కోట్లు అంటే 51.46 శాతం నిధులు విడుదలయ్యాయి. ఆరోగ్య సూచికల్లో మెరుగైన స్థానాల్లో నిలిచిన రాష్ట్రాలు కూడా భారీగా ఎన్‌హెచ్‌ఎం నిధులను రాబట్టుకోగలిగాయి. ఉదాహరణకు తమిళనాడు దేశంలోనే ఆరోగ్యసూచికల విషయంలో చాలా మెరుగ్గా ఉంది. ఆ రాష్ట్రానికి గడిచిన ఐదేళ్లలో రూ.5,936 కోట్లను కేంద్రం విడుదల చేసింది. తమిళనాడు కన్నా మెరుగైన స్థితిలో కేరళ ఉన్నా.. ఆ రాష్ట్రానికి రూ. 2,763 కోట్లు మాత్రమే అందాయి. మరోవైపు.. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కూడా గత నాలుగేళ్లలో రూ.4,563 కోట్లను ఆ పథకం కింద తెచ్చుకోగలిగింది. కేంద్రంతో ఆయా రాష్ట్రాల సఖ్యతతో పాటు ఎన్‌హెచ్‌ఎం అధికారులు చేసే లాబీయింగ్‌తోనే ఎక్కువగా నిధులొచ్చే వెసులుబాటు ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా రాష్ట్రం నుంచే ఇచ్చే ప్రతిపాదనలు, ఆరోగ్య ప్రాజెక్టులు(ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ప్లాన్స్), కేంద్రం ఇచ్చిన నిధులను సరిగ్గా ఖర్చు పెట్టడమే ఇందులో కీలక అంశాలు. అయితే, ఈ పథకం కింద నిధులు తెచ్చుకోవడంలో గత ప్రభుత్వంతో పాటు అప్పటి ఆరోగ్యశాఖ యంత్రాంగం విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రం ఇచ్చిన ఎన్‌హెచ్‌ఎం నిధులను ఇతర పథకాలకు వాడుకోవడం, రాష్ట్ర వాటాను ఇవ్వకపోవడం వంటివి కూడా ఇందుకు కారణాలని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే ఒకదశలో ఎన్‌హెచ్‌ఎం కింద ఇచ్చే నిధులను కొద్ది నెలల పాటు కేంద్రం నిలిపివేసిందని ఆ వర్గాలు గుర్తు చేస్తున్నాయి.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor:* ***K. Srinivas****. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86.* ***Managing Director: Vemuri Radha Krishna,*** *Founder: K.L.N.Prasad.*